


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




వరంగల్ | 22-09-2026 మంగళవారం | సంపుటి : 11 | సంచిక : 280 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on

## భూసేకరణ చిక్కుముళ్లకు పరిష్కారం



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వుదయం)** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు భూసేకరణ, పునరావాస ప్రక్రియలను సత్వరమే పూర్తి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సచివాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ఏర్పాటు చేసిన దృశ్య శ్రవణ సమావేశంలో (వీడియో కాన్ఫరెన్స్) భూసేకరణ, పునరావాస పనుల పురోగతిపై ఆయన జిల్లాల వారీగా సుదీర్ఘంగా చర్చించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, పునరావాస ప్రక్రియ అత్యంత కీలకమైన అంశమని పేర్కొంటూ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ కేసుల ప్రస్తుత స్థితిగతులపై జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసిత కుటుంబాలకు అందించాల్సిన పరిహారం, పునరావాస కేంద్రాల ఏర్పాటు, అక్కడ కల్పించాల్సిన మౌలిక వసతులపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించి పలు సూచనలు చేశారు .ఈ కీలక సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థిక శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్యరాజ్, భూసేకరణ-పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వారితో పాటు ఇంజినీర్ఇన్‌చీఫ్ రమేష్ బాబు, నీటిపారుదల శాఖ సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొని ప్రాజెక్టుల వారీగా పూర్తి కావాల్సిన భూసేకరణ వివరాలు, అటవీ శాఖ అనుమతులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పునర్వ్యవస్థీకరణ పనుల ద్వారా పూర్తి న్యాయం జరిగేలా యంత్రాంగం వేగంగా స్పందించాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

## ఖరీదైన ప్రాంతాల్లోనే పట్టణ
# పేదలకు సొంతింటి ధీమా



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వుదయం)** మహానగర పరిధిలోని పట్టణ పేదల దశాబ్దాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయంతో ముందడుగు వేసింది. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని రాయదుర్గం మల్కం చెరువు సమీపంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, కేవలం నాలుగు గోడలు, పైకప్పు నిర్మించి ఇవ్వడం మాత్రమే ప్రభుత్వం ధ్యేయం కాదని, కోట్లాది రూపాయల విలువైన నగర నడిబొడ్డున పేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించేలా భద్రతా భావాన్ని కల్పించడమే తమ ముఖ్యమంత్రి ఆలోచన అని స్పష్టం చేశారు. గతంలో పేదలను ఊరికి ముప్పై నలభై కిలోమీటర్ల దూరంలో నిర్బంధించిన పరిస్థితులకు భిన్నంగా, అత్యంత విలువైన భూములున్న చోటే అర్హులకు అపార్ట్‌మెంట్ సంస్కృతిని పరిచయం చేస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు.

ఈ బృహత్తర పథకంలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, సిఫార్సులకు లేదా పైరవీలకు తావులేకుండా నూటికి నూరు శాతం పారదర్శకంగా లాటరీ పద్ధతిలోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు ద్వారా బహిరంగంగా జాబితాలను వెల్లడించి, అభ్యంతరాలను స్వీకరించిన అనంతరమే అర్హులను ఖరారు చేస్తున్నట్లు వెల్లడించారు. తొలి విడతగా ప్రతి నియోజకవర్గానికి నాణ్యమైన ప్రమాణాలతో 480 గృహాల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నామని, క్యూర్ పరిధిలో రాబోయే రెండున్నర సంవత్సరాలలో దశల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి లబ్ధిదారునికి పదిహేడు నుండి ఇరవై గజాల వరకు అన్‌డివైడెడ్ స్థల హక్కులతో పాటు, ఎలాంటి రిజిస్ట్రేషన్ రుసుములు లేకుండా ఉచితంగా సేల్ డీడ్ పత్రాలను అందించి సంపూర్ణ యాజమాన్య హక్కులను కల్పిస్తామన్నారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన మంత్రి, స్థానిక ప్రజలే స్వయంగా వారానికి ఒకసారి వచ్చి పనులను పరిశీలించుకోవచ్చని, నాణ్యతా లోపాలు కనిపిస్తే తక్షణమే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వేగవంతంగా పనులు పూర్తి చేసి, వచ్చే బోనాల పండగ నాటికి లబ్ధిదారులతో ఇక్కడి నుంచే బోనాలు ఎత్తించేలా గృహ ప్రవేశాలు చేయిస్తామని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వం ఇచ్చే ఉచిత కానుక కాదని, భవిష్యత్ తరాలకు మీ పిల్లల ఆత్మగౌరవాన్ని పెంచే అమూల్యమైన సొంత ఆస్తిగా కాపాడుకోవాలని కోరారు. పేదల సంక్షేమ కార్యక్రమాలపై అనవసర రాజకీయ విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు.

# నాలుగు భాగాలుగా ఉత్తరప్రదేశ్ విభజన

## ప్రధాని మోదీ హామీ

### యుపి రాజకీయాల్లో వేడెక్కిన విభజన రగడ



**లక్నో (ఏఎంఎస్) :** దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని నాలుగు భాగాలుగా విభజించే అంశం దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ వార్తల్లోకి వచ్చింది. కుల గణన పూర్తయిన తర్వాత ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విభజన ప్రక్రియ చేపడతామని ప్రధాని నరేంద్ర మోదీ తనకు స్వయంగా హామీ ఇచ్చారని సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) అధినేత, యూపీ రాష్ట్ర మంత్రి ఓం ప్రకాశ్ రాజ్‌భర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవొరియాలో నిర్వహించిన 'సామాజిక సమరసత మహా ర్యాలీ'లో ఆయన మాట్లాడుతూ, ఇరవై ఏడు శాతం రిజర్వేషన్ల అమలుతో పాటు రాష్ట్ర విభజనపై ప్రధానితో చర్చించినట్లు తెలిపారు. కుల ఆధారిత లెక్కలు పూర్తయితే విభజన ప్రక్రియలో ఎలాంటి చిక్కులు ఉండవని ప్రధాని పేర్కొన్నట్లు ఆయన వెల్లడించారు.పూర్వాంచల్ రాష్ట్రానికి రాజ్‌భర్ నేతృత్వంలోనే పాలనరాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటుకాబోయే పూర్వాంచల్ రాష్ట్రానికి రాజ్‌భర్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తియే ముఖ్యమంత్రి అవుతారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. యువత అధైర్యపడకుండా పార్టీ లంబికను అనుసరించాలని, సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్ లేదా కాంగ్రెస్ పార్టీల బురిడీ మాటలను నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు. 2027 ప్రారంభంలో ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ప్రధానంగా వెనుకబడిన తరగతుల ఓటర్లను ఆకట్టుకోవడానికే రాజ్‌భర్ ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.రాష్ట్ర విభజనపై సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంఉత్తరప్రదేశ్‌ను విభజించాలనే డిమాండ్ ఈనాటిది కాదు. 2012 అసెంబ్లీ ఎన్నికలకు ముందు, అప్పటి ముఖ్యమంత్రి మాయావతి ఉత్తరప్రదేశ్‌ను అవధ్ ప్రదేశ్, పూర్వాంచల్, బుందేల్‌ఖండ్, పశ్చిమ ప్రదేశ్‌లుగా నాలుగు భాగాలుగా విభజించాలని అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపారు. దానికి ముందు 2008లోనే కాంగ్రెస్ నేతలు రెండో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌ను వేయాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో రాష్ట్రీయ లోక్ దళ్, కాంగ్రెస్ వంటి పార్టీలు కూడా గతంలో ఈ విభజనకు మద్దతు తెలిపాయి. 2000వ సంవత్సరంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రదేశ్ నుంచి ఉత్తరాఖండ్ (గతంలో ఉత్తరాంచల్) రాష్ట్రాన్ని వేరు చేసిన విషయం విదితమే.

## రైల్వే పరిధిలో ముమ్మరంగా
# తాగునీటి పరీక్షలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 (వుదయం)** ప్రయాణికులకు, రైల్వే సిబ్బందికి పూర్తి సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించాలనే సంకల్పంతో దక్షిణ మధ్య రైల్వే తన పరిధిలోని రైల్వే స్టేషన్లు, రైల్వే కాలనీలలో నీటి పర్యవేక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ రైల్వే స్టేషన్‌తో పాటు అనుబంధ రైల్వే కాలనీలో నీటి నాణ్యతా పరీక్షలు, పర్యవేక్షణా ఏర్పాట్లను జోన్ యంత్రాంగం వేగవంతం చేసింది. మున్సిపల్ నీటి సరఫరా, నిల్వ జలాశయాలు, క్లోరినేషన్ ప్రక్రియలతో పాటు పంపిణీ వ్యవస్థ మొత్తాన్ని అధికారులు సమగ్రంగా తనిఖీ చేశారు. ప్రతిరోజూ నీటిలోని అవశేష క్లోరిన్ స్థాయిలను తనిఖీ చేయడంతో పాటు, బ్యాక్టీరియా కాలుష్యాన్ని గుర్తించేందుకు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించేలా కఠిన చర్యలు చేపట్టారు.

**అన్ని నీటి నమూనాలు సంతృప్తికరం: 188 పరీక్షల్లోనూ పూర్తి నాణ్యత**

ఈ నెలాఖరులో (సెప్టెంబర్ 09 నుండి 15 వరకు) నిర్వహించిన తాజా పరీక్షల ఫలితాలు తాగునీటి నాణ్యతపై సంతృప్తికరమైన వివరాలను వెల్లడించాయి. హైదరాబాద్ స్టేషన్, కాలనీల పరిధి నుండి సేకరించిన మొత్తం 188 నీటి నమూనాలను పూర్తిస్థాయి బ్యాక్టీరియాలాజికల్ విశ్లేషణకు గురిచేశారు. ఈ పరీక్షల్లో ఏ ఒక్క నమూనాలోనూ ఇకోలి బ్యాక్టీరియా ఉనికి నమోదు కాలేదని, అన్ని నమూనాలు నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి నాణ్యతతో ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు.

**నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడొద్దు: జీఎం ఆదేశం**

నిర్దేశిత తాగునీటి ప్రమాణాలను అధికారులు, పర్యవేక్షక సిబ్బంది ఖచ్చితంగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆదేశించారు.

# సోనియా గాంధీ ఓటరు నమోదు వివాదం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (ఏఎంఎస్) :** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీకి ఓటరు జాబితాలో పేరు నమోదు అంశానికి సంబంధించి మళ్లీ చట్టపరమైన చిక్కులు ఎదురయ్యాయి. భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే, అనగా 1980వ సంవత్సరంలోనే ఆమె ఓటరుగా నమోదు చేసుకున్నారనే ఆరోపణలపై దాఖలైన పిటిషన్‌పై దిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఈ వ్యవహారంలో ప్రథమ సమాచార నివేదిక నమోదు చేయాలని కోరుతూ దాఖలైన వినతిని మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించగా, ఆ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పునఃపరిశీలన పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేశారు. దీంతో సోనియా గాంధీ ఓటరు నమోదు అంశంపై పునఃపరిశీలనతో పాటు దర్యాప్తునకు మార్గం సుగమమైంది. మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో సరైన వివరణలు లేవని, చట్టపరమైన నియమావళిని పాటించకపోవడమే కాకుండా సంబంధిత అధికారుల వాదనలను సరిగ్గా వినలేదని ఉన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ కేసు తదుపరి విచారణను న్యాయమూర్తి ఈ నెల ఇరవై తొమ్మిదవ తేదీకి వాయిదా వేశారు. భారత పౌరసత్వ చట్టాల ప్రకారం సోనియా గాంధీకి 1983లో పౌరసత్వం లభించగా, 1980 నాటి న్యూదిల్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఆమె పేరు ఉందంటూ గతంలో ప్రచారం జరిగింది. గాంధీ కుటుంబ సభ్యులతో పాటు ఇంకా ఇటలీ పౌరసత్వంలోనే ఉన్న సోనియా పేరును నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఓటరు జాబితాలో చేర్చి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో ఈ వ్యవహారం మళ్లీ సంచలనంగా మారింది.

# పంటలను కాపాడటంలో ప్రభుత్వం విఫలం




**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వుదయం)** జూరాల ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా భారత్ రాష్ట్ర సమితి నాయకులను, రైతులను అక్రమంగా అరెస్టు చేయడం పట్ల ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన ఆందోళనలను తీర్చాల్సింది పోయి పోలీసు బలగాలతో అణచివేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సామాజిక మాధ్యమం వేదికగా నిలదీశారు. మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు పలువురు మాజీ శాసనసభ్యులు, పార్టీ నాయకులను గృహనిర్బంధం చేయడం, ముందస్తు అరెస్టులకు పాల్పడటం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. జూరాల జలాశయంలో తొమ్మిది టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ పంటలకు నీరు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. తమ పంటలను కాపాడుకోవాలనే తపనతో ఆందోళనకు దిగిన రైతులపై అక్రమ కేసులు బనాయించడం, ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులను మోహరించడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని ధ్వజమెత్తారు.




# రష్యా-ఉక్రెయిన్ యుద్ధ జ్వాలలు

**కీవ్:** ఉక్రెయిన్, రష్యాల నడుమ యుద్ధ వాతావరణం మరోసారి అత్యంత తీవ్రరూపం దాల్చింది. ఇటీవల ఉక్రెయిన్ సైన్యం దాదాపు వెయ్యికి పైగా డ్రోన్లతో రష్యా సరిహద్దులపై విరుచుకుపడటంతో, రష్యా దళాలు ప్రతీకార దాడులకు దిగాయి. ఉక్రెయిన్‌లోని వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న జపోరిజియా నగరాన్ని లక్ష్యంగా చేసుకుని మాస్కో దళాలు విచక్షణారహితంగా దాడులు ప్రారంభించాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు.

## ఇంతే కదా...!




## నష్టాల మూసివేత నుంచి
# రికార్డు లాభాల వైపు

### 23.33 కోట్ల లాభాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వుదయం)** మూడు దశాబ్దాల క్రితం రూ. 21 కోట్ల పేరుకుపోయిన నష్టాలతో మూసివేత అంచుకు చేరిన ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఏపీఎచ్ఎంఈఎల్) సంస్థ, ప్రజా పాలనలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ లాభాల శిఖరాలకు చేరుకుంది. ఒకప్పుడు మనుగడే ప్రశ్నార్థకమై దివాలా తీసే స్థితికి చేరిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ, సింగరేణి ఆధీనంలోకి వచ్చిన తర్వాత ఊపిరి పోసుకుని, గడచిన మూడేళ్లలోనే రూ. 34.20 కోట్ల నికర లాభాలను అర్జించి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా రికార్డు స్థాయిలో 202526 ఆర్థిక సంవత్సరంలోనే రూ. 23.33 కోట్ల నికర లాభాన్ని సాధించి తన యాభై ఏళ్ల చరిత్రలోనే సరికొత్త రికార్డును నెలకొల్పింది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత విస్తరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వడం, యాజమాన్య ప్రతిభ, ఉద్యోగుల కృషి కలగలిసి ఈ భారీ విజయాన్ని సాకారం చేశాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ఏపీఎచ్ఎంఈఎల్‌ను కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితం చేయకుండా జాతీయ స్థాయిలో పోటీపడే దిగ్గజ సంస్థగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన చర్యలు చేపట్టారు. గతంలో ఉప ముఖ్యమంత్రి స్వయంగా కొండపల్లిలోని ప్లాంటును సందర్శించి కార్మికుల్లో నూతనోత్సాహాన్ని నింపడమే కాకుండా, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త యంత్రాల తయారీకి దిశానిర్దేశం చేశారు. దీని ఫలితంగానే సింగరేణితో పాటు బీహెచ్ఈఎల్, జెన్‌కో, ఎన్ఎమ్‌డీసీ, వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి దేశీయ దిగ్గజ సంస్థల నుంచి భారీ ఆర్డర్లను దక్కించుకుంటూ వ్యాపారాన్ని దేశవ్యాప్తంగా విస్తరించింది. 1976లో ప్రారంభమై తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన సమయంలో సింగరేణి సంస్థ పెట్టుబడులు పెట్టి నిర్వహణ బాధ్యతలను స్వీకరించడం ఈ సంస్థ దశను పూర్తిగా మార్చివేసింది. సంస్థను మరింత లాభదాయకంగా మార్చే క్రమంలో వ్యయ నియంత్రణపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. ప్లాంట్ ప్రాంగణంలో రూ. 1.24 కోట్ల వ్యయంతో 300 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఏటా రూ. 60 లక్షల వరకు అవుతున్న విద్యుత్ ఖర్చులను ఆదా చేసేందుకు శ్రీకారం చుట్టింది. రోజుకు సుమారు 1,200 యూనిట్ల స్వచ్ఛమైన సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా నెలకు రూ. 2 లక్షల చొప్పున ఐదేళ్లలోనే పెట్టిన పెట్టుబడి తిరిగి రానుంది. మౌలిక వసతుల కల్పన, వ్యయ నియంత్రణ, నూతన మార్కెట్ల సాధన వంటి సమగ్ర వ్యూహాలతో మును పెన్నడూ లేని రీతిలో అభివృద్ధి పథంలో పయనిస్తుండటంపై అధికారులు, కార్మికులు



## ఇందిరమ్మ గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

**నారాయణఖేడ్ సెప్టెంబర్ 21(వుదయం)**

నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలో ని నిజాంపేట్ మండలం ర్యాలమడుగు గ్రామంలో ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమం ప్రారంభించారు. నిజాంపేట్ మండల ర్యాలమడుగు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ప్ర భుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ ప్రారంభించారు.

**ఈ సందర్భంగా సంయుక్తంగా వారు మాట్లాడుతూ...**

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కు టుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు లభించ డంతో దొంతిగారి సుజాత-మల్లేష్ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింద ని, వారి కొత్త జీవితం సుఖసంతోషాల తో సాగాలని ఆకాంక్షించారు. ఇందిర మ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబా లకు గౌరవప్రదమైన నివాసం కల్పించ డంతోపాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారు లకు ఇళ్ల మంజూరు, నిర్మాణం, బిల్లుల చెల్లింపు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బంది లు లేకుండా అధికారులు సమన్వయం తో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పింగ రెడ్డి నిజాంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పండ రి రెడ్డి నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ర్యాలమడుగు గ్రామ సర్పంచ్ సాయిలు. రాధా కిషన్ సెట్, సుబాష్ కౌన్సిలర్, మల్లేష్, సాయి లు, వెంకటరాములు, కిష్టయ్య, లక్ష్మ య్య, నాగయ్య ఉప సర్పంచ్, సాయిలు, తదితర ముఖ్య నాయకులు ర్యాలమడు గు గ్రామ ప్రజలు పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో మా గొంతును నొక్కలేరు

- రైతులకు జూరాల నీటిని తక్షణమే విడుదల చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ పల్లయ్య

**గద్వాల, సెప్టెంబర్ 21 (వుదయం కరస్పాండెంట్)**

జూరాల ప్రాజెక్టు నుంచి రైతులకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యం లో తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య అన్నారు. అక్రమ అరెస్టులతో తమ గొంతును అణచలేరని పేర్కొన్నారు. జూరాల ద్వారా రైతులకు నీరు అందించాలని కోరుతూ సోమవారం ధర్నా కార్యక్రమానికి పి లుపునిచ్చిన నేపథ్యంలో గద్వాల టౌన్ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి కురువ పల్లయ్యను అరెస్టు చేసి గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు, అరెస్టు లు చేసినా రైతులకు జూరాల నీటిని విడుదల చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. జూరాల గేట్లు ఎత్తి రైతులకు నీరివ్వాలిజూరాల కుడి, ఎడమ కాలువల గేట్లను ఎందుకు మూసివేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్ర శ్నించారు. రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి నీటిని ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నా యని ఆయన ఆరోపించారు. తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొట్టి నీటిని ఆంధ్రప్ర దేశ్‌కు తరలిస్తున్నారంటూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. పాలమూరు ప్రాం తానికి చెందిన ముఖ్యమంత్రి ఉన్నప్ప టికీ పాలమూరు రైతులకు నీరు అంద కపోవడం బాధాకరమన్నారు. ''మన



నీళ్లను మనం వినియోగించుకోవడాని కి కూడా నిర్బంధాలు ఎందుకు?'' అని ప్రశ్నించారు. జూరాల నుంచి రైతులకు తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జూరాల గేట్లు ఎత్తి రైతులకు నీటిని విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున రైతుల ఆగ్రహాన్ని ప్రభు త్వం ఎదుర్కోవాల్సి ఉంటుందని కురువ పల్లయ్య హెచ్చరించారు. పాలమూరు జిల్లాకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు.



## వినాయక మండపం వద్ద వినూత్న సేవ

- అన్నదానం కాదు.. వైద్యదానం
- మిరుదొడ్డిలో సింహ గర్జన యూత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం
- వందలాదిమంది పేదలకు పరీక్షలు, మందుల పంపిణీ

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 21, వుదయం :**

వినాయక మండపాల వద్ద అన్నదానం చేయడం సర్వసాధారణం. కానీ మిరు దొడ్డి యువకులు వినూత్నంగా ఆలోచించి వైద్య దానం నిర్వహించి ప్రశం సలు పొందారు. సిద్దిపేట జిల్లా మిరు దొడ్డి మండల కేంద్రంలో సోమవారం సింహ గర్జన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 21 ఫీట్ల భారీ వినా యకుడిని ఏర్పాటు చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. అయినా వారు సంతృప్తి చెందకుండా గ్రామీణ పేద ప్రజలకు భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు ఆరోగ్యం ఉండేందుకు కృషి చేయా లనుకున్నారు. ఆలోచన వచ్చిన వెంటనే గజ్వేల్ లోని మెగా కంటి మరియు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అశ్విన్ కుమార్, డాక్టర్ ప్రశాంతిని సంప్ర దించారు. తమ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుకు సహకరించాలని కోరడంతో స్పందించిన వైద్యులు వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గ్రామంలోని వినాయక మండపం వద్దనే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వందలాది మంది రోగులు శిబిరానికి రావడంతో ప్రతి ఒక్కరినీ వేరుగా పరీక్షిం చి ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు గజ్వేల్ మెగా ఆసుపత్రిలో తక్కువ ఖర్చుతో సర్జరీ చేస్తా మని వైద్యులు హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే సహకరించిన డాక్టర్ అశ్విన్ కుమార్, డాక్టర్ ప్రశాంతిని సింహ గర్జన అధ్యక్షుడు లింగాల సదానంద రెడ్డి, స్థానిక సర్పంచ్ మహేశ్వరి దేవరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొ నడం సంతోషంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహ గర్జన యూత్ సభ్యులు సుధాకర్, లోకం నవీన్, కవిరాజు, అంజి పాల్గొన్నారు.

## ఆపదలో ఆపన్నహస్తం.. బాధిత కుటుంబానికి ప్రభుత్వ భరోసా!

- పైడిగుమ్మల్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ
- బందెల రత్నయ్య కుటుంబానికి రూ.28 వేల ఆర్థిక సాయం
- కష్టకాలంలో అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరేలా కృషి: కాంగ్రెస్ పార్టీ నవ యువనాయకులు బందెల ప్రశాంత్

**కోహీర్, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో బందెల రత్నయ్య కుటుంబా




నికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆ ర్ఎఫ్) కింద మంజూరైన రూ.28 వేల విలువైన చెక్కును కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందజేశారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధిత కుటుంబానికి చెక్కును అందించి, ప్రభు త్వ సహాయంపై కాంగ్రెస్ యువ కెరిటం బందెలు ప్రశాంత్ వివరించారు. కష్టకా లంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్న కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బందెల ప్రశాంత్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటి కప్పుడు తెలుసుకుంటూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు..అర్హులైన ప్రతి కు టుంబానికి సంక్షేమ పథకాలుప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పి స్తూఅవసరమైన వారికి పథకాల ప్రయో జనాలు అందేలా సహకారం

**ప్రజలకు అండగా నిరంతరం పనిచేస్తాం: కాంగ్రెస్ నాయకులు**

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించి, అర్హత ఉన్నవారు వాటి ప్రయోజనాలను పొందేలా కాంగ్రెస్ నాయకులు, కా ర్యకర్తలు సహకరిస్తారని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం కుటుంబాలకు ఎంతో ఉపయోగకరం గా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా బందెల ప్రశాంత్ మాట్లాడుతూ సీఎం సహాయనిధి ద్వారా రూ.28 వేల ఆర్థిక సాయం మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, కోహీర్ మండల కాంగ్రెస్ నాయకులు, నియోజ కవర్గ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తామ ని అన్నారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ప్రజ లకు అందుబాటులో ఉంటూ వారి సమ స్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి

**తెలకపల్లి సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూ చుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పి ఎ సి ఎస్ కార్యాలయం లో సోమవారం ఉచిత వేరుశనగ విత్త నాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని తెలిపారు. తమ ప్రభు త్వం రైతులకు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఉచిత0గా వేరుశనగ విత్తనాలను అందించడంతో పాటు రైతులు పండించిన పంటను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇంకా తమ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన పేదలకు ఇందిర మ్మ ఇండ్లు, చౌక ధర దుకాణాల ద్వారా సన్న బియ్యం, స్మార్ట్ రేషన్ కార్డులు,కొత్త కొత్తవారికి రేషన్ కార్డులు అందించడం జరుగుతుందని తెలిపారు. ఎలినీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెల కొన్నాయని తెలిపారు. కాబట్టి ప్రస్తుతం ఉన్న పరిస్థితికి అనుగుణంగా ఆరుతడి పంటలను వేయాలని సూచించారు. ఇం దుకుగాను రైతులు ఎటువంటి పంటలు సాగు చేయాలనో గ్రామాలకు వెళ్లి అవ గాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సి బ్బందిని ఆదేశించారు.అంతేకాకుండా తె లకపల్లి పి ఎ సి ఎస్ పనితీరు బాగుందని, అందుకు కారణమైన పాలకమండలిని సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ఇదిలా ఉండగా తెలకపల్లి మండలం రామ్ రెడ్డిపల్లిలో 30 గుంటల గ్రామ కంఠం భూమిని విత్తన శుద్ధి కేంద్రం కొరకు కేటాయించినందుకు గాను ఆ గ్రామ సర్పంచ్ యాదవరెడ్డిని ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య, తాసిల్దార్ విజయకు మార్, సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు

## గణనాతుని పూజాకార్యక్రములో పాల్గొన్నఉపసర్పంచ్ పై బిక్షపతి



**పూడూర్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం లోని చింతలపల్లి గ్రామములోని పోచమ్మ దేవాలయ కాలనిలో ఆదివారం గణనా తుని పూజాకార్య క్రమములో పాల్గొ న్న చింతలపల్లి గ్రామ ఉపసర్పంచ్ యాటకారి బిక్షపతి, అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. తరువాత అన్నప్రసాదం కార్యక్రమము నిర్వహిం చిన వినాయక కమిటీ సభ్యులు, ఈకా ర్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు గ్రామప్రజలు భక్తులు చిన్నారులు మహి ళామణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ కరాటే బరిలో దుమ్మురేపిన దుబ్బాక

- 7 గోల్డ్ మెడల్స్ తో సత్తా
- హైదరాబాద్ లో 2000 మందిని వెనక్కి నెట్టి స్వర్ణ పతకాల వేట
- దుబ్బాక కరాటే విద్యార్థులకు ఘన సత్కారం

**దుబ్బాక, సెప్టెంబర్ 21, వుదయం:**

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సిద్దిపేట జిల్లా దుబ్బాక విద్యార్థులు అద్భుత ప్ర తిభతో విజయకేతనం ఎగురవేశారు. హైదరాబాద్ లోని కాటేదాన్ స్పోర్ట్స్ కాం ప్లెక్స్ లో నాకయమా షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్విటేషనల్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ లో దేశంలోని పలు రా



ష్ట్రాల నుంచి సుమారు 2000 మంది క్రీ డాకారులు పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో దుబ్బాకకు చెందిన 7 మంది వి ద్యార్థులు 7 గోల్డ్ మెడల్స్ సాధించి పట్టణ ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటారు.

**స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులు**

దిశా స్కూల్ కు చెందిన ఆరావ్, మాస్టర్ మైండ్ స్కూల్ కు చెందిన సర్వజ్ఞ, ప్రణవి, రిషి అఖిల్, సరస్వతి గ్లోబల్ స్కూల్ కు చెందిన రిస్విత, శిల్పిత, ఋషి విద్యాలయానికి చెందిన శ్రియన్స్ తమ ప్రతిభతో ప్రత్యర్థులను చిత్తు చేసి స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. విద్యార్థుల విజయంపై యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాప కులు, కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో గ్రామీణ విద్యా ర్థులు సైతం జాతీయస్థాయిలో రాణించ గలరని, దుబ్బాక విద్యార్థుల విజయం మరింత మందికి స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నాకయమా అసోసియేషన్ ఆధ్వర్యం లో కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ ను ఛాంపియన్ షిప్ కప్, మాస్టర్ మెమోటోతో ప్రత్యేకంగా సత్కరించా రు. పతక విజేత విద్యార్థులను కూడా అభినందించారు.

## గాంధీ చౌక్‌లో ఆదర్శ దృశ్యం

- జాతిపిత విగ్రహాన్ని స్వహస్తాలతో శుభ్రం చేసిన మహానుభావురాలు!

**సదాశివపేట సెప్టెంబర్ 21 (వు దయం):**

గాంధీజీ విగ్రహంపై పేరుకుపోయిన దుమ్ముధూళిని చూసి చలించిపోయిన ఓ మహానుభావురాలు, ఏమాత్రం సంకోచించకుండా స్వయంగా తన చే తులతోనే విగ్రహాన్ని శుభ్రం చేసి (సాఫ్ చేసి) బాపూజీపై తనకున్న అపారమైన భక్తి ప్రపత్తులను, స్వచ్ఛతా నిబద్ధతను చాటుకున్నారు.



**సదాశివపేట:**

స్థానిక గాంధీ చౌక్‌లోని మహాత్మా గాంధీ విగ్రహంపై దుమ్ముధూళి చేరి ఉండటాన్ని గమనించిన ఓ మహిళా మూర్తి వెంటనే స్పందించారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా, స్వహస్తాలతో బాపూజీ విగ్రహాన్ని శుభ్రం చేసి నిండు గౌరవాన్ని చేకూర్చారు. నిత్యం రద్దీగా ఉండే చౌరస్తాలో మహాత్ముని పట్ల ఆమె చూపిన ఈ నిస్వార్థ భక్తి, ఆదరణ స్థానికుల హృదయాలను హత్తుకుంది. "స్వచ్ఛతే సేవ" అన్న గాంధీజీ సందేశా న్ని కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన ఆమెను చూసి పట్టణ ప్రజలు, బాటసారులు 'నిజమైన మహా నుభావురాలు' అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలి

- ప్రతి వినతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సత్వర చర్యలు తీసుకోవాలి :
- అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు

**సంగారెడ్డి, సెప్టెంబర్ 21:-వుదయం**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు వేగవంతంగా పరిష్కరించేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని అడిషన ల్ కలెక్టర్లు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలె క్టర్లు సంగీత, పాండు లు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమా నికి హాజరైన అర్జీదారుల సమస్యలను




ఆలకిస్తూ, ప్రతి దరఖాస్తును పరిశీలిం చి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరి ష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం అందించాలని తెలిపారు. ప్రజావాణి లో మొత్తం 79 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సం గారెడ్డి డివిజన్‌కు 20, నారాయణఖేడ్ డివిజన్‌కు 2, జహీరాబాద్ డివిజన్‌కు 2, కలెక్టరేట్‌కు 55 దరఖాస్తులు అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, ఎంప్లాయిమెంట్, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ గ్రిడ్, యూత్ వెల్ఫేర్, కోపరేటివ్, లేబర్, అగ్రికల్చర్, విద్య, వైద్య ఆరోగ్య శాఖ, డి ఆర్ డి ఓ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, పోలీస్, ట్రైబల్ వెల్ఫేర్, మహిళా ,శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఈ ఈ పి ఆర్, ఎక్సైజ్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులు అందాయి. ఈ కార్యక్రమం లో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికా రులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్ల వెరిఫికేషన్

- మండల విద్యాధికారి ఎంఈఓ రహీం ఆధ్వర్యంలో పరిశీలన


**ఊర్కొండ న్యూస్ 21 వుదయం ప్రతినిధి**

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఊరుకొండ పేట గ్రామంలో మండల విద్యాధికారి రహీం. పంచాయతీ సెక్రెటరీ ఇబ్రహీం కొత్త పెన్షన్ అభ్యర్థులను పరిశీలన మీరు "కొత్త పెన్షన్ వెరిఫికేషన్" (రాష్ట్ర ప్ర భుత్వాల సామాజిక పింఛన్లు) గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నట్లుగా భావిస్తున్నాను. ప్రస్తుతం తెలుగు రాష్ట్రా ల్లో కొత్త పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. రాష్ట్రాల వారీగా తాజా అప్‌డేట్స్ కింద ఇవ్వబడ్డాయి:1.



తెలంగాణ (చేయూత పెన్షన్లు)దరఖా స్తుల పరిశీలన గడువు: కొత్త పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికే షన్‌ను ఈ నెల (సెప్టెంబర్) 25 లోపు పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. అర్హుల జాబితా: క్షేత్రస్థా యి పరిశీలన ముగిసిన అనంతరం అర్హులైన లబ్ధిదారుల జాబితాను జిల్లా కలెక్టర్లకు పంపుతా. మండల ప్రత్యేక అధికారిగా రహీం తెలిపారు

## కళాజాతా ప్రచార కార్యక్రమం ప్రారంభం



**మహబూబ్‌నగర్**

HIV/AIDS మరియు లైంగికంగా సంక్రమించే వ్యాధులు (STIs)పై ప్ర జల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, HIV నివారణ, సురక్షితమైన మరియు బాధ్యతాయుతమైన ప్రవర్తన, HIVతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష ని ర్మూలన వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన కళాజాతా ప్రచార కార్యక్రమం సోమవారం మహ బూబ్‌నగర్ జిల్లా పాత DM&HO కార్యాలయంలోజిల్లా వైద్యారోగ్య శా ఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు.

కళాజాతా ప్రచారంలో భాగంగా QR Code స్కాన్ చేయడం, Break Free Appను డౌన్‌లోడ్ చేసుకోవడం మరియు Self Risk Assessment పూర్తి చేయడంపై ప్రత్యేకంగా అవగా హన కల్పించాలన్నారు.wwవిద్యా ర్థులు, యువత మరియు సాధారణ ప్రజలు QR Codeను స్కాన్ చేసి Break Free Appను డౌన్‌లోడ్ చేసుకుని, అందులోని 7 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా Self Risk Assessment పూర్తి చేయాలని తెలిపారు.ఈ Self Risk Assessment ద్వారా HIV/ STIలకు సంబంధించిన వ్యక్తిగత ప్రమాద పరిస్థితులపై అవగాహన పొందడంతో పాటు, అవసరమైన సం దర్భాల్లో సంబంధిత ఆరోగ్య సేవలను పొందేందుకు మార్గదర్శకత్వం లభి స్తుందని తెలిపారు.ప్రతి కళాజాతా కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు మరియు సాధారణ ప్రజలు తప్పనిస రిగా QR Code స్కాన్ చేసి Break Free Appను డౌన్‌లోడ్ చేసుకుని, 7 ప్రశ్నల Self Risk Assessment పూర్తి చేసేలా సిబ్బంది ప్రోత్సహించాల ని సూచించారు.ఈ ప్రచార కార్యక్రమా న్ని TI NGOs, LWS మరియు భాగ స్వామ్య NGOల సిబ్బంది సమన్వయం తో నిర్వహిస్తున్నారు. ప్రజలు కళాజాతా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని, HIV/AIDS మరియు STIల నివా రణకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవాలని, అవసరమైన పరీక్షలు మరియు ఆరోగ్య సేవలను వినియోగిం చుకోవాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమలో డా. శశికాంత్, Dy. DM&HO,డా.రాజు నాయక్, Addl. DM&HO, మరియు డా. శివకాంత్ MHN coordinator,హన్మంతు (హెల్త్ ఎడ్యుకేటర్ ), శ్రీశైలం, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్**

- ప్రజావాణికి 132 పిర్యాదుల స్వీకరణ.

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులకు ఆదేశిం చారు.సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్. బి హరిప్రియ తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీ సుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖా స్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరి ష్కరించాలని అన్నారు.

**ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్,**

నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసా యం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రి కార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 132 వినతులను అధికారులు స్వీకరించారు.



**మండల ప్రత్యేక అధికారులు ప్రతి వారం గ్రామ పంచాయతీలను సందర్శించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా.**

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారు లతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మండల ప్రత్యేక అధికారుల క్షేత్రస్థాయి బాధ్యతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాలు, నియోజక వర్గాలకు కేటాయించిన ప్రత్యేక అధికా రులు ప్రతి వారం క్షేత్రస్థాయిలో పర్య టించి ఒక గ్రామ పంచాయతీని తప్పని సరిగా సందర్శించాలని ఆదేశించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థ ప్రస్తుతం లేని నేపథ్యంలో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారుల బాధ్యతలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయని కలెక్టర్ తెలిపారు. అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల ని సూచించారు. ప్రతి సోమవారం జిల్లా కార్యాలయం నుంచి ఒక్కో అధికారికి ఒక గ్రామ పంచాయతీని కేటాయిస్తామ ని, సంబంధిత అధికారి అదే వారంలో ఆ గ్రామాన్ని తప్పనిసరిగా సందర్శిం చాలని తెలిపారు. కేటాయించిన గ్రామ పంచాయతీని సంబంధిత ప్రత్యేక అధికారి ఆ వారంలో బుధవారం లేదా మరొక రోజు తప్పనిసరిగా సందర్శిం చాలని అన్నారు.తదుపరి సోమవారం జరిగే సమీక్షలో అధికారులు తాము సందర్శించిన గ్రామంలో పరిశీలించిన అంశాలు, గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల వివ రాలను సమర్పించాలని ఆదేశించారు.

**ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలి:**

గ్రామ పర్యటనను సాధారణ తనిఖీగా భావించకుండా, సర్పంచ్, ప్రజాప్రతి నిధులు, పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలతో మాట్లాడి గ్రామంలోని ప్రధాన సమస్యలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ కార్యదర్శి హాజరు, పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, బోధన, విద్యార్థుల సమస్యలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి, భవనాల నిర్మాణం, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు తదితర అంశాలను పరి శీలించాలన్నారు. చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు.

**దిశా సమావేశానికి నివేదికలు సిద్ధం చేయాలి:**

అక్టోబర్ 6న దిశ సమావేశం జరగ నున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికా రులు తమ శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన ప్రాజెక్టులు, ప్రస్తుతం అమలులో ఉన్న పనులు, పెండింగ్ అంశాలపై సమగ్ర నివేదికలను వెంటనే పీడీఆర్‌కు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.గత దిశా సమావేశంలో చర్చించిన అంశాలు, అధికారులకు ఇచ్చిన సూచనలు, వాటిపై తీసుకున్న చర్యలకు సంబంధించిన *యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ATR)*ను కూడా సమ ర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరి ప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డి.ఆర్.ఓ ఎ. నిర్మల, జెడ్. పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి. ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, గృహ నిర్మాణ శాఖ పి.డి ఉపేందర్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెరుగు రాజన్న కుంట భూములపై రెవెన్యూ అధికారుల పరిశీలన

- హద్దులు చెరిపేసి దున్నిన వారిపై చర్యలకు పై అధికారులకు నివేదిక

**కోహెడ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

కోహెడ మండలంలోని తీగలకుంట పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 369లో ఉన్న పెరుగు రాజన్న కుంట భూములను రెవెన్యూ అధికారులు జిపిఓ శ్రీశైలం, రాజశేఖర్ పరిశీలిం చారు. గతంలో అధికారులు నిర్ణయిం చిన హద్దులను చెరిపివేసి, కుంట భూమిని దున్నినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.కుంటకు సంబం ధించిన భూమి విస్తీర్ణం, గతంలో గు ర్తించిన హద్దులు, అక్రమంగా దున్నినా ప్రస్తుతం మార్పులను అధికారులు పరి శీలించి వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు . ప్రభుత్వ భూమి హద్దులను



తొలగించి దున్నిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లను న్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కుంట భూముల పరిరక్షణలో భాగంగా ఇప్పటికే అధికారులు హద్దులు నిర్ణయిం చినప్పటికీ, వాటిని చెరిపివేసి మళ్లీ దు న్నడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములను ఆక్ర మణలకు గురికాకుండా కాపాడాలని, హద్దులను పునరుద్ధరించి ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## బీరంగూడలో కూచిపూడి నృత్య హంగామా

**అమీన్ పూర్**
**సెప్టెంబర్ 21, వుదయం**

అమీనాపూర్, బీరంగూడ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ మరియు వందనపురి కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారుల కూచిపూడి నాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బీరంగూడ సాయి భగవాన్ కాలనీలో గణపతి నవరాత్రుల ఉత్సావాళ్ళలో భాగాంగ వినాయక మండపం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక పూజల అనంతరం ఈ సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.భరత వేద



ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వాహకులు డాక్టర్ పీ శ్రీనివాస్ వరప్రసాద్, డాక్టర్ సంధ్యా దేవి సమక్షంలో చిన్నారులు కృతి అన్వికశ్రీ, అన్విత, ఆనంది, లాస్య, వివర్ధన కృష్ణ, భవ్యశ్రీ, హాసిని, దుర్గ, సహస్ర, వేద, కార్తిక, ఆద్య, సిరి, అవని, ఋత్విక, సౌగంధి, చక్రికలు కూచిపూడి నృత్య రూపకంలో పలు అంశాలను నర్తించిన తీరు ఎంతో అలరించింది.అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మోహన్ శంకర్, రాజశేఖర్, కృష్ణ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్, సాగర్, వీరేందర్, సంజీవ, భాస్కర్ రెడ్డి, సురేష్, సతీష్, సత్యనారాయణ రెడ్డి, సత్యనారాయణ రాజు, ఇందు శేఖర్ రెడ్డి తదితరులు పిల్లల ప్రతిభను అభినందించి వారికి ప్రత్యేక బహుమతులను అందజేశారు.

## గంటల తరబడి విద్యుత్ కోత..

- కవాడిగూడలో ప్రజల ఆగ్రహం
- గణేష్ నిమజ్జనం పేరుతో ముందస్తు చర్యలు ఎందుకు చేపట్టలేదంటూ నిలదీత

**ముషీరాబాద్,**
**సెప్టెంబర్ 21(వుదయం)**

ముషీరాబాద్: కవాడిగూడ డివిజన్ పరిధిలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుభాష్ చంద్రబోస్ నగర్, ఏసీటీసీ కాలేజ్, ఎస్బీహెచ్ కాలనీ, మోతీలాల్ నెహ్రూ నగర్, మారుతీనగర్, ఎల్చిగూడ, నేత స్పిన్నింగ్ మిల్స్, వార్తా లైన్, బండమైసమ్మ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10:30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా.. మధ్యాహ్నం 2:30 గంటలకు పునరుద్ధరించారు.మళ్ళీ సాయంత్రం 4 గంటల కు పోయి 4:30 కు వచ్చింది ...విద్యుత్ అంతరాయంపై అధికారులకు ఫోన్ చేయగా గణేష్ నిమజ్జనానికి రహదారుల వెంట ఉన్న చెట్లు అడ్డుగా వస్తుండటంతో వాటిని తొలగించే పనులు జరుగుతున్నాయని సమాధానం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.ముందస్తు ప్రణాళిక లేని విద్యుత్ శాఖ అధికారులు గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ఎప్పటి నుంచో ముందే తెలిసినప్పటికీ.. విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనులు ఎందుకు చేపట్టలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోజుకు గంటపాటు ముందస్తుగా విద్యుత్ నిలిపి పనులు పూర్తి చేసి ఉంటే ప్రజలకు ఇబ్బంది తగ్గేదని అన్నారు.చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా.. విద్యుత్‌పై ఆధారపడిన వ్యాపారాలు, దుకాణాలు కూడా నష్టపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.పండుగల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అధికారులు.. గంటల తరబడి విద్యుత్ నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

ఓట్ల సమయంలో ముందు ఉండే రాజకీయ నాయకులు ప్రజల సమస్య అనగానే ఎందుకోకో వెనకడుగు రాజకీయ నాయకులు ప్రజా సమస్యలపై స్పందించకుండా కేవలం కార్యక్రమాలు, ప్రచారాలకే పరిమితమవుతున్నారంటూ ప్రజలు విమర్శించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ముందే తెలిసినా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకోకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు పడుతుంటే.. ప్రజాప్రతినిధులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించడంలో విఫలమైన అధికా




రులు, రాజకీయ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టి, అనవసరంగా గంటల తరబడి విద్యుత్ కోతలు విధించకుండా చర్యలు తీసుకోవాలని కవాడిగూడ ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు కూడా అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజావాణి అర్జీలకు తక్షణ పరిష్కారం



**రంగారెడ్డి జిల్లా**

పత్రికల్లో ప్రచురితమయ్యే సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని, ప్రజావాణి ద్వారా అందే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు.జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, విజ్ఞప్తుల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను చేపట్టాలని అన్నారు.అదేవిధంగా జిల్లాలోని సమస్యలకు సంబంధించి వార్తాపత్రికలు, ఇతర మాధ్యమాల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై అధికారులు తక్షణమే స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. పత్రికల్లో ప్రచురితమైన సమస్యలను కేవలం వార్తలుగా కాకుండా ప్రజల సమస్యలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలుగా పరిగణించి, వాటి వాస్తవ పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.విద్య, వైద్యం, గృహ నిర్మాణ శాఖలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో విద్య, వైద్య, గృహ నిర్మాణ తదితర శాఖలకు సంబంధించిన పలు సమస్యలు ప్రజల దృష్టికి వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలకు కారణాలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.పాఠశాలలు, విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని, మందులు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్యం, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు.గృహ నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు, గృహ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమస్యల పరిష్కారానికి వ్యవస్థీకృత కార్యాచరణప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి పరిశీలించి, దాని పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకొని, బాధ్యతను నిర్ణయించుకుని, నిర్ణీత గడువులో పరిష్కరించే విధంగా వ్యవస్థీకృతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఒకే సమస్య పదేపదే ప్రజావాణిలో రావడం లేదా పత్రికల్లో ప్రతికూల వార్తగా ప్రచురితం కావడం జరగకుండా అధికారులు ముందస్తుగా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## అరటాకు భోజనం సిద్ధి వినాయక సంప్రదాయం



- 25వ ఏట వైభవంగా సాగిన అన్నప్రసాదం
- అరటాకుల్లో ఆప్యాయ విందు
- హాజరైన రాజయోగి వెంకటస్వామి
- విశేష సంఖ్యలో పాల్గొని భక్తజనం..

**గుమ్మడిదల,**
**సెప్టెంబర్ 21 (వుదయం) :**

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, దైవ సేవయే మానవ సేవగా గుమ్మడిదలలో గత 24 ఏళ్లుగా సాగుతున్న పవిత్ర ఆనవాయితీ సిద్ధి వినాయక అన్నప్రసాద వితరణ.సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో పాతికేళ్ల రజతోత్సవ మైలురాయిగా ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ అన్నప్రసాద కార్యక్రమం ఆధ్యాత్మిక శోభ నడుమ అత్యంత వైభవంగా సాగింది... భక్తులు, దాతల సహకారంతో రెండు దశాబ్దాలకు పైగా నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి ఆదివారం రాత్రి భక్తజనం విశేష సంఖ్యలో తరలి వచ్చారు. మన ప్రాచీన భోజన సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ, అంతరాలు లేకుండా భక్తులందరినీ నేలపై ఒకే వరుసలో కూర్చోబెట్టి, పచ్చటి అరటి ఆకుల్లో ఆప్యాయంగా మహా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి ఆత్మానంద ఆశ్రమాధిపతి పూజ్యపాదులు రాజయోగి వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు దివ్య మంగళాశాసనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "సాటి మనిషికి ఆకలి తీర్చడమే నిజమైన దైవ ఆరాధన. పాతికేళ్లుగా సిద్ధి వినాయక సంఘం సభ్యులు మన సనాతన సంప్రదాయాన్ని కాపాడుతూ అరటాకుల్లో అన్నప్రసాదాన్ని అందించడం ఎంతో అభినందనీయం. నేలపై అందరూ సమానంగా కూర్చొని ఆరగించే ఈ ఆనవాయితీ సమాజంలో ఐక్యతను, ఆత్మీయతను పెంచుతుంది. వినాయకుడి కృపాకటాక్షాలతో గుమ్మడిదల గ్రామం, ఇక్కడి ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలి" అని ఆశీర్వదించారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యా గోవర్ధన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మాధవి సత్యనారాయణ, కత్తుల రమేష్, కిషన్, దేవాలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్రెడ్డి, స్థానిక పెద్దలు మండలి భాషయ్య, పడమటి లక్ష్మారెడ్డి, చెన్నంశెట్టి సత్యనారాయణ, తుల సీదాస్, దేవేందర్ రెడ్డి, వెంకట్రామి రెడ్డి, సిద్ధి వినాయక సంఘం కమిటీ సభ్యులు సూర్యనారాయణ, మహేష్ కుమార్, కూరగాయల నర్సింలు, ఉదయ్ కుమార్, నర్సింగ్ సాగర్, కృష్ణ, రాము, నరేష్, నవీన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి ఆశీస్సులతో సిద్దిపేట ప్రజలందరిపై ఉండాలి



**- 56 వినాయక మండపాలను సందర్శించిన వంగ రాజేశ్వర్ రెడ్డి**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి :**

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని 56 వినాయక మండపాలను సోమవారం వంగ రాజేశ్వర్ రెడ్డి సందర్శించారు. ఆయా మండపాల్లో వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు, భక్తులు, యువత, మహిళలు, కాలనీవాసులతో ఆయన మమేకమై ఉత్సవాల నిర్వహణపై మాట్లాడారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రంగధాంపల్లి మైత్రివనం, ప్రియదర్శిని నగర్, సాయి విద్యానగర్, ఇంద్రనగర్, కాలకుంట కాలనీ, సీతారాం నగర్, బీడీ కాలనీ, బోయగల్లి, పటేల్‌పూర్, శంకర్‌నగర్, పారుపల్లి, వైశ్యభవన్, శ్రీమాతా పార్వతి తదితర ప్రాంతాల్లోని మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా పలుచోట్ల నిర్వాహకులు, భక్తులు ఆయనకు స్వాగతం పలికారు .ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో సిద్దిపేట ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో విఆర్అర్ అభిమానులు, ఆయా వార్డ్ ప్రజలు ఉన్నారు.

## భూసేకరణ ఆర్అండ్ఆర్ పనులు వేగవంతం




- 2026-27లో భూసేకరణకు రూ.6 వేల కోట్ల నిధులు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**నాగర్ కర్నూల్,**
**సెప్టెంబరు 21 (వుదయం బ్యూరో):**

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాస పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు. నాగర్ కర్నూల్ ఐడీఓసీ నుంచి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీఎఫ్ఓ రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2026 27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు నిధులు లబ్ధిదారులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలని, విడుదలైన నిధులు లబ్ధిదారులకు చేరేలా చూడాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అవార్డులు జారీ చేసిన భూముల పరిహారాన్ని మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని సమీక్ష ప్రధాన కార్యదర్శికు రూ.3,100 కోట్ల విలువైన పనులను గుర్తించగా, రూ.2,514 కోట్లు విడుదల చేశామని తెలిపారు.కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, పెండింగ్ అంశాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. రైతులతో నేరుగా సంప్రదింపులు జరిపి పారదర్శకంగా పూర్తి చేస్తామన్నారు.

## మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట



- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**వెల్దండ**
**సెప్టెంబర్ 21 (వు దయం)**

మహిళల ఆర్థికపలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మహిళా సమైక్య రైతు సభ్యులకు వేరుశనగ విత్తనాల పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ను రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని సూచించారు రైతులు పండించిన వేరుశెనగల తో ఇక్కడే నూనె తయారు కేంద్రాన్ని మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలాజీ సింగ్ , డిసిసి ఉపాధ్యక్షులు భూపతి రెడ్డి, జిల్లా కార్యదర్శి మోతిలాల్ నాయక్, మండల పార్టీ అధ్యక్షులు హరి కిషన్ నాయక్, సంజీవ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు మహిళలు పాల్గొన్నారు

## సంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు విజయవంతం



- రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

**సంగారెడ్డి,**
**సెప్టెంబర్ 21:వుదయం.**

12వ తెలంగాణ రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు, టోర్నమెంట్ సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 26, 27 తేదీల్లో హన్మకొండలోని జె.ఎన్. స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సంగారెడ్డి జిల్లా తరఫున పా జట్టు ఎంపికలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన 15 మంది పీడీలు, పీఈటీలు, అలాగే రిటైర్డ్ పీడీలు శర్ఫుద్దీన్ సర్, ఆసిఫ్లకు సంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ఐఆర్ హియరింగ్‌స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

- నో మ్యాపింగ్, అనామలీస్ నోటీసులపై విచారణలు వేగవంతం చేయాలి
- ఫారం-6, 7, 8 దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, సెప్టెంబర్ 21**
**(వుదయం కరస్పాండెంట్)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ అంశాలపై జారీ చేసిన నోటీసులకు సంబంధించిన పెండింగ్ విచారణలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి తుది ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం చేయాలని సూచించారు.సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. జోగులాంబ గద్వాల జిల్లా నుంచి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరుకు సంబంధించిన విచారణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విచారణకు హాజరైన ఓటర్ల నుంచి అవసరమైన పత్రాలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వివరాలను సంబంధిత దరఖాస్తు వ్యవస్థలో నమోదు చేయాలని సూచించారు. అర్హతకు సంబంధించిన అన్ని వివరాలు సక్రమంగా ఉన్న ఓటర్ల దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో స్వీకరించిన ఫారం6, ఫారం7, ఫారం8 దరఖాస్తులను కూడా త్వరితగతిన పరి



ష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం6, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించిన ఫారం7, ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలకు సంబంధించిన ఫారం8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారులు, తహసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE III ADDL.CHIEF JUDGE CITY CIVIL COURT AT:HYDERABAD**
**MVOP.1623 OF 2026**
**Between:**
**Bangaru Manjula** .....**Petitioner**
**AND**
**Vadlakonda Venkatesh** .... **Respondent**
To,
Vadlakonda Venkatesh, S/o.V.Abbaiah,age:Major, Occ:Driver,R/o.2-2-1149, TilakNagar,New Nallakunta, Hyderabad-500044.(Driver and owner of offending Auto bearing no.TS10UA3532).
......**Respondent 1**
Take Notice that the above named petitioner filed petition against you, the respondent,for compensation You are hereby required to appear in the above Hon"Ble court on the **16th day October,2026 at 10.30 A.M.** in person or by pleader duly instructed able to answer all material questions relating to the above proceedings. Also note that in default of your appearance on the above said date the issue will be settled and that the position heard and determined in your absence, You shall also bring with you or send by your pleader any due payment which the petitioner desire to inspect the documents on which intend to repay in support of defence you required.
***(By order of the Court Dt:17-09-2026)***
**Sd/-**
**T.Aditya**
**Advocate,**
**Flat No.302,KJR.Residency, Barkatpura,Hyderabad-50**

**IN THE COURT OF THE HON'BLE. XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL**
**O S NO 589 2026**
**Between:**
SMT G.NIRMALA ...**Plaintif**
**AND**
1.THE TEHSILDAR TIRMALAGHERRY MANDAL.
2.ALL CONCERNED......
....**Defendants**
**PUBLIC NOTICE**
To
All Concerned
This is to inform to general public that the Plaintiff have filled suit for Declaration to declare them as Legal heirs of MISSING UNDETCCTED, G.M.RAMESH , MISSING on. 12-08-2009, such general public are hereby informed you that if any body having any objection kindly appear before the above Hon'ble Court on 24-09-2026, at 10.30 A.M either in person or through Advocate, Failing which matter will be decided as per law. Hence this notice.
**(BY ORDER OFTHE COURT)**
**Sd/-**
**M B SANTOSH KUMAR**
**M S ROHITH KUMAR**
**ADVOCATES**
**Office: 3-41-1, ASHWINI NAGAR COLONY West Marredpally, SECUNDERABAD-26, CELL NO 9391358882**

**IN THE COURT OF THE HON'BLE IIIrd A.J.C.J,L.B.NAGAR, R.DIST,**
**I.A.NO. OF,2026**
**O.S.NO. 633 OF,2026,**
**Between:**
Addulla, Lalitha W/OLate, addulla Mahendar Reddy Age:57yrs, Occ:House hold, R/O, 8-1-18/5/1, Plot..No-2,Kranthinagar colony, Karmanghat,Saroornagar, Ranga Reddy Dist.T.G,State
..**Petitioner/ Plaintiff,**
**And**
1. The Tahsildar, Saroornagar, Mandal, RangaReddy Dist,
2.All Concerned
...**Respondent's/Defendants**
The Plaintiff filed the above suit for declaration to declare the plaintiff is theLegal hair of Late, addulla Mahendar Reddy,who died on 03-04-2025,and thesuit stands posted on 23-10-2026 and if any person or persons Having any objections or claims, he/they may appear before the above Couron 23-10-2026,at abourt 10.30 AM either in person or an advocate, Failing which the matter will be decided basing on the documents availableon record.
**(By order of the Court)**
**Sd/-**
**P.Ram Mohan**
**Advocate,**
**Office:3-1-479,Vasavi Curry Point, L.B.Nagar, R.R.dist, Cell - No-924679609**
**Counsel for Plaintiff**


**IN THE COURT OF THE MVACT CUM HON'BLE II ADDL CHIEF JUDGE CITY CIVIL COURT: AT HYDERABAD**
**O.P.No. 3175 of 2025**
**Between:**
Pulusu Janardhan ...**Petitioner**
**AND**
Kavati Jangaiah and others ...**Respondents**
To,
**Res No-1**
S/o. K. Narsimha, aged: Major, Occ: owner of Lorry No. TS 13-UA-9599, R/o. H. No. 12-1-922,/2/B, Venkatamma thota, Asifnagar, Hyderabad -500001
**Res No-3**
Mohd. Sohrab, S/o. Shekh Riyajul, Aged: Major, Occ: Driver, R/o. Baraini, Bhagalpur, Bihar State -813222.
Please take notice that the above petitioner had filed the case for compensation for the Injuries sustained by Pulusu Janardhan in a motor vehicle accident which occurred on 04-11-2025 under the limits of P.S.Kethapally The above case is posted to 16-10-2026 at 10-30 AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.
**(BY ORDER OFTHE COURT)**
**Sd/-**
**K.ANAND REDDY**
**D.VENKAT RAMANA**
**Advocates**
**Office: Flat No.212, Jamuna Towers, Opp:Yashoda Hospital, Malakpet, Hyderabad-500036. Cell:9848052455, 9848051707**
**Counsels for the petitioners**



“ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు పూర్తిగా చదువుపై దృష్టి సారించడానికివీలుగా నగరాల్లో సరిపడా గృహాలను ఎందుకు నిర్మించలేకపోతోంది. విద్యా సంస్థల్లో హాస్టల్ గదులు లేకపోవడం వల్ల బయటి వసతి వెతుక్కుని అక్కడ రూ. లక్షల్లో చెల్లింపులు చేయలేక కొంత మంది అర్థంతరంగా చదువులు మానేస్తున్నారు. ప్రమిదలు వెలిగించడానికి ప్రభుత్వం వద్ద డబ్బులుంటాయి గానీ హాస్టళ్లకు ఉండవా? ఆమె ఒక గ్రామం నుంచి నగరానికి వచ్చి చదువుకుంటోంది. ప్రభుత్వ హాస్టల్ లేక నెలవారీ అద్దె చెల్లిస్తూ బయట ఉంటోంది. ఏ నెల అద్దె చెల్లించలేకపోయినా తలదాచుకునే గూడు ఉండదనేభయం ఆమెను వెంటాడుతున్నది. కేవలం ఇలాంటికారణాలతో చాలా మంది అమ్మాయిలు చదువుకు దూరమవుతున్నారు. ”

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

## వేమన' పద్యం



అన్నమిడుటకన్న అధిక దానంబుల
నెన్ని చేయనేమి యెన్నబోరు
అన్నమెన్న జీవనాధారమగునయా
విశ్వదాభిరామ వినురవేమ.

# సంపాదకీయం


## సామాన్యుడిపై యుపిఐ బాదుడు

యుపిఐ మార్కెట్ లో జరుగుతున్న లావాదేవీలలో అమెరికా సంస్థలైన వాల్ మార్ట్ కు చెందిన ఫోన్ పే, గూగుల్ పే వాటా కలిగి ఉన్నాయి. కొత్త ఎండిఆర్ విధానం అమల్లోకి వస్తే, ఈ చార్జీల్లో అత్యధిక భాగం చేరేది ఈ రెండు విదేశీ కంపెనీల ఖాతాల్లోకే. ప్రభుత్వ రంగ బ్యాంకుల యాప్ లకు ఈ మార్కెట్ లో ఒక శాతం వాటా కూడా లేదు `అంటే, ఈ వ్యవస్థను నిర్మించింది, నడిపిస్తున్నది ఎవరో, దాని ఫలాలు అనుభవించేదీ వాళ్లే. ఈ మొత్తం వ్యవహారాన్ని అర్థం చేసుకోవాలంటే, పదేండ్ల వెనక్కి వెళ్లాలి. 2015 సెప్టెంబర్ లో, భారత ప్రభుత్వం అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్మెంట్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఆ సంస్థలో అనేక అమెరికా ప్రభుత్వ శాఖలతోపాటు మైక్రోసాఫ్ట్, మాస్టర్కార్డ్, బిల్గేట్స్ ఫౌండేషన్, గూగుల్, వాల్మార్ట్ లాంటి అనేక టెక్ కంపెనీలు, ఎన్జిఒలు భాగస్వాములు. అభివృద్ధి కంటే వాటి వ్యాపార ప్రయోజనాలను విస్తరించుకోవటమే లక్ష్యం. ఇతర అంశాలతో

*2016 నవంబర్ లో పెద్దనోట్ల రద్దును దేశభక్తి నినాదాలతో ప్రకటించారు. నల్లధనం వెలికితీత, నకిలీ నోట్ల నిర్మూలన, ఉగ్రవాద ఆర్థిక మ లాలను దెబ్బతీయడం లక్ష్యాలుగా చెప్పారు. డిమానేటిసేషన్ వల్ల ప్రకటించిన ఏ లక్ష్యాలు నెరవేరలేదనేది వాస్తవం. పార్లమెంటులో కాని, బయట కానీ ఈ అంశాల వి ద చర్చకు ప్రభుత్వం నిరాకరిస్తున్నది. కానీ ఆశ్చర్యకరంగా, డిజిటల్ బ్యాంకింగ్, యుపిఐ లావాదేవీలు మాత్రం అనూహ్యంగా పెరిగాయి. 2016లో నెలకు మ డు లక్షలు మాత్రమే ఉన్న లావాదేవీలు,*

పాటు ఆ సమయంలో భారతదేశంలో తొంభై శాతానికి పైగా లావాదేవీలు నగదు రూపంలోనే జరిగేవి. ఈ నగదు వ్యవస్థను డిజిటల్ కు మార్చాలన్నదే ఆ ఒప్పంద సారాంశం. కానీ, ఈ అసలు విషయాన్ని ప్రజలకు చెప్పకుండా, 2016 నవంబర్ లో పెద్దనోట్ల రద్దును దేశభక్తి నినాదాలతో ప్రకటించారు. నల్లధనం వెలికితీత, నకిలీ నోట్ల నిర్మూలన, ఉగ్రవాద ఆర్థిక మ లాలను దెబ్బతీయడం లక్ష్యాలుగా చెప్పారు. డిమానేటిసేషన్ వల్ల ప్రకటించిన ఏ లక్ష్యాలు నెరవేరలేదనేది వాస్తవం. పార్లమెంటులో కాని, బయట కానీ ఈ అంశాల వి ద చర్చకు ప్రభుత్వం నిరాకరిస్తున్నది. కానీ ఆశ్చర్యకరంగా, డిజిటల్ బ్యాంకింగ్, యుపిఐ లావాదేవీలు మాత్రం అనూహ్యంగా పెరిగాయి. 2016లో నెలకు మ డు లక్షలు మాత్రమే ఉన్న లావాదేవీలు, 2026 నాటికి 2,366 కోట్లకు చేరాయి. ఈ వ్యవస్థకు కేంద్రంగా మారిన విదేశీ కంపెనీలు ఇప్పుడు తమ లావాదేవీలపై చార్జీలు విధించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. ఫలితంగానే చట్ట సవరణ, ఆ వెంటనే ఈ నోటిఫికేషన్ వచ్చాయి. ఇదంతా యాదృచ్ఛికంగా జరిగినది కాదు. ఒక పథకం ప్రకారం, దశలవారీగా అమలైన ప్రక్రియ. సామాన్య ప్రజలు తమ సొంత డబ్బును తామే వాడుకుంటూ, ఆ చెల్లింపుల వి□ద వేల కోట్ల రూపాయలు అమెరికన్ కంపెనీలకు ఛార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి రావడం అన్యాయం. “కస్టమర్ పై భారం లేదు” అనే ప్రభుత్వ వాదన వాస్తవాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం మాత్రమే. ఈ నిర్ణయాన్ని ప్రజలందరూ నిశితంగా గమనించాలి, ప్రశ్నించాలి, వ్యతిరేకించాలి. ప్రభుత్వం ఈ ఎండిఆర్ నోటిఫికేషన్ను వెంటనే ఉపసంహరించుకోవాలి. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన నాటి నుంచి అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఏవిధంగా ప్రభావితం చేస్తున్నాయో చూస్తున్నాం. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ నినాదంతో చేస్తున్న నిర్ణయాలన్నీ అమెరిక కార్పొరేట్ రంగానికి లాభాలు సంపాదించే లక్ష్యంతో చేస్తున్నవే. పాలస్తీన, ఇరాన్ వెనిజువెల దేశాలలో అమెరికా యుద్ధోన్మాదం ఆదేశాల సహజవనరుల వి ద పెత్తనం కోసం ఉద్దేశించినవే. రష్యాతో వాణిజ్యం చేస్తున్నదనే నెపంతో మన దేశ దిగుమతుల వి ద వంద శాతం పన్నులు ప్రకటించింది అమెరికా. ఈ విధానాలను అడ్డుకొని మన దేశ విదేశీ ఎగుమతులను రక్షించాల్సింది పోయి, మరింత మేలు చేసే విధంగా డిజిటల్ లావా


### రచనలు పంపండి



ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# బాధ్యత విస్మరిస్తున్న అగ్ర దేశాలు

వాతావరణ మార్పు భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదం కాదు; ఇప్పటికే ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న వాస్తవ సంక్షోభం. పారిశ్రామిక విప్లవం తర్వాత బొగ్గు, చమురు, సహజవాయువు వినియోగం భారీగా పెరగడంతో వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ పేరుకుపోయి భూగోళ ఉష్ణోగ్రతలు పెరిగాయి. 2015 పారిస్ వాతావరణ ఒప్పందం ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదలను పారిశ్రామిక పూర్వస్థాయితో పోలిస్తే 2 డిగ్రీల సెల్సియస్ కంటే చాలా తక్కువగా ఉంచుతూ, 1.5 డిగ్రీలకు పరిమితం చేసేందుకు ప్రయత్నించాలని నిర్దేశించింది. అయితే పరిస్థితి తీవ్రతను గణాంకాలే చెబుతున్నాయి. 2023 ఫిబ్రవరి నుంచి 2024 జనవరి వరకు నమోదైన 12 నెలల ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1850-1900 పారిశ్రామిక పూర్వస్థాయితో పోలిస్తే 1.52 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉంది. ఇది ఒక్క సంవత్సరపు లేదా 12 నెలల సగటు కావడంతో పారిస్ లక్ష్యం శాశ్వతంగా దాటిపోయిందని అర్థం కాదు; కానీ ప్రపంచం ఎంత ప్రమాదకరమైన అంచుకు చేరిందో మాత్రం స్పష్టమవుతోంది.

ఇక్కడ అసలు ప్రశ్న——ఉద్గారాలను ముందుగా, వేగంగా ఎవరు తగ్గించాలి? ప్రస్తుతం అధిక ఉద్గారాలు చేస్తున్న దేశాలా? లేక శతాబ్దాలుగా వాతావరణంలో కార్బన్ను పేరుకుపోయేలా చేసిన సంపన్న దేశాలా? భారత్ ప్రస్తుతం ప్రపంచంలోని ప్రధాన వార్షిక కార్బన్ ఉద్గార దేశాల్లో ఒకటి. 2024లో ప్రపంచ కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాల్లో భారత వాటా సుమారు 8.27 శాతం. కానీ 1751 నుంచి 2024 వరకు ప్రపంచ చారిత్రక కార్బన్ ఉద్గారాల్లో భారత మొత్తం వాటా కేవలం 3.57 శాతమే. ఈ వ్యత్యాసం వాతావరణ న్యాయ చర్చలో అత్యంత ముఖ్యమైనది. అంటే ప్రస్తుత ఉద్గారాలను మాత్రమే చూపించి చారిత్రక బాధ్యతను పక్కన పెట్టడం సమగ్ర దృక్పథం కాదు. పారిశ్రామికీకరణ ద్వారా సంపదను కూడబెట్టిన అభివృద్ధి చెందిన దేశాలు రెండు శతాబ్దాలకుపైగా శిలాజ ఇంధనాలను భారీగా వినియోగించాయి. ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అదే అభివృద్ధి అవకాశాన్ని పరిమితం చేయాలని కోరడం సమానత్వ సూత్రానికి విరుద్ధం.

*భారత్ ప్రస్తుతం ప్రపంచంలోని ప్రధాన వార్షిక కార్బన్ ఉద్గార దేశాల్లో ఒకటి. 2024లో ప్రపంచ కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాల్లో భారత వాటా సుమారు 8.27 శాతం. కానీ 1751 నుంచి 2024 వరకు ప్రపంచ చారిత్రక కార్బన్ ఉద్గారాల్లో భారత మొత్తం వాటా కేవలం 3.57 శాతమే. ఈ వ్యత్యాసం వాతావరణ న్యాయ చర్చలో అత్యంత ముఖ్యమైనది. అంటే ప్రస్తుత ఉద్గారాలను మాత్రమే చూపించి చారిత్రక బాధ్యతను పక్కన పెట్టడం సమగ్ర దృక్పథం కాదు. పారిశ్రామికీకరణ ద్వారా సంపదను కూడబెట్టిన అభివృద్ధి చెందిన దేశాలు రెండు శతాబ్దాలకుపైగా శిలాజ ఇంధనాలను భారీగా వినియోగించాయి.*

తలసరి ఉద్గారాలను పరిశీలించినప్పుడు ఈ అసమానత మరింత స్పష్టమవుతుంది. భారతీయుడి తలసరి కార్బన్ ఉద్గారం అభివృద్ధి చెందిన దేశాల ప్రజలతో పోలిస్తే చాలా తక్కువ. అధిక విద్యుత్ వినియోగం, వ్యక్తిగత వాహనాలు, పెద్ద ఇళ్లు, విమాన ప్రయాణాలు, అధిక వస్తు వినియోగం వంటి జీవనశైలులు సంపన్న దేశాల్లో తలసరి ఉద్గారాలను గణనీయంగా పెంచాయి. భారత ప్రజలకు కూడా మెరుగైన గృహం, నిరంతర విద్యుత్, రవాణా, పరిశ్రమలు, ఉపాధి, సౌకర్యవంతమైన జీవనం పొందే హక్కు ఉంది.

అయితే దీనర్థం భారత్ పర్యావరణ బాధ్యత నుంచి తప్పుకోవచ్చని కాదు. భారత్ ఇప్పటికే కీలక చర్యలు చేపట్టింది. 2030 నాటికి స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 40 శాతం శిలాజేతర వనరుల నుంచి సాధించాలన్న తన పారిస్ ప్రతిజ్ఞను 2021 నవంబరులోనే నెరవేర్చింది. అప్పటికి శిలాజేతర ఆధారిత సామర్థ్యం 156.83 గిగావాట్లకు చేరి మొత్తం స్థాపిత సామర్థ్యంలో 40.1 శాతంగా నమోదైంది——లక్ష్యానికి దాదాపు తొమ్మిదేళ్ల ముందుగానే.భారత్ 2070 నాటికి నెట్ జీరో లక్ష్యాన్ని కూడా ప్రకటించింది. పునరుత్పాదక విద్యుత్, విద్యుత్ వాహనాలు, గ్రీన్ హైడ్రోజన్, ఇంధన సామర్థ్యం, అటవీ విస్తరణ వంటి మార్గాల్లో మార్పు అవసరం. అదే సమయంలో ఆర్థికాభివృద్ధి, పేదరిక నిర్మూలన, కోట్లాది కుటుంబాల జీవన ప్రమాణాల పెంపు కూడా కొనసాగాలి. అందుకే వాతావరణ బాధ్యతను ఒక్క ప్రమాణంతో కొలవకూడదు. ప్రస్తుత ఉద్గారాలు, చారిత్రక ఉద్గారాలు, తలసరి ఉద్గారాలు, దేశ ఆర్థిక సామర్థ్యం, అభివృద్ధి అవసరాలు——ఈ అంశాలన్నింటినీ కలిపే చూడాలి. అభివృద్ధి చెందిన దేశాలు తమ చారిత్రక బాధ్యతను గుర్తించి మరింత వేగంగా ఉద్గారాలను తగ్గించాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు శుభ్రమైన సాంకేతికత, తక్కువ వ్యయ ఆర్థిక సహాయం, వాతావరణ నిధులు అందించాలి. అదే సమయంలో భారత్ వంటి దేశాలు కూడా తక్కువ కార్బన్ మార్గంలో అభివృద్ధిని వేగవంతం చేయాలి.

వాతావరణ న్యాయం అంటే ప్రతి దేశానికి ఒకే భారాన్ని మోపడం కాదు. ఎవరు ఎంత కాలుష్యం చేశారు, ఎవరి తలసరి వినియోగం ఎంత, ఎవరి ఆర్థిక సామర్థ్యం ఎంత, ఎవరి అభివృద్ధి అవసరాలు ఎంత అన్నదాన్ని గుర్తించి బాధ్యతను పంచుకోవడం. భూమిని కాపాడాలంటే ఉద్గారాలు తగ్గాలి; కానీ ఆ తగ్గింపు న్యాయంగా, బాధ్యతాయుతంగా జరగాలి.



సి. హెచ్.ప్రతాప్
77938 00743

## విమానాశ్రయానికి బాపూజీ పేరు

మంత్రి పదవి చేతిలో ఉండగానే తెలంగాణ కోసం ఆ పదవినే త్యజించిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతమైన వేళ మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ఆకాంక్ష వైపు నిలిచిన ఆయన త్యాగం రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టం. పదవిని కాపాడుకోవడం సులువు.. పదవినే వదిలి ప్రజల కోసం నిలవడం అసలైన నాయకత్వం. అందుకే వరంగల్ మామునూరులో రూపుదిద్దుకోనున్న విమానాశ్రయానికి బాపూజీ పేరు పెట్టాలన్న ప్రతిపాదనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలే విమానాశ్రయానికి పేరు సూచించాలని కోరడం ప్రజాస్వామిక అవకాశం. రూ.295 కోట్లతో భూసేకరణ పూర్తి చేసి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు భూమి అప్పగించిన నేపథ్యంలో వరంగల్ మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కొత్త ద్వారం కానుంది. పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు మెరుగైన రవాణా అనుసంధానం దోహదపడితే.. ఆ ద్వారం పేరు కూడా తెలంగాణ చరిత్రను ప్రపంచానికి పరిచయం చేసేలా ఉండాలి.

రుద్రమ, కాకతీయ, సమ్మక్కసారలమ్మ పేర్లు తెలంగాణ చరిత్రకు గర్వకారణమే. కానీ బాపూజీ పేరు ఆధునిక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తుంది. 1942 క్విట్ ఇండియా ఉద్యమం నుంచి నిజాం వ్యతిరేక పోరాటం, 1952 నాన్ముల్కీ ఉద్యమం, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ఆయన ప్రజా జీవితంలో పోరాటమే ప్రధానంగా కనిపిస్తుంది. ముఖ్యంగా అధికారం చేతిలో ఉన్నప్పుడే దానిని వదిలిన త్యాగమే ఆయన పేరుకు ప్రత్యేక ముద్ర.

పద్మశాలి కుటుంబంలో జన్మించిన బాపూజీ ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదు. బీసీ వర్గాల సామాజిక గౌరవం, హక్కుల కోసం కూడా ఆయన కృషి చేశారు. అందువల్ల ఆయన పేరును వరంగల్ మామునూరు విమానాశ్రయానికి పెట్టడం ఒక వ్యక్తిని స్మరించుకోవడమే కాదు.. వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన నాయకత్వం తెలంగాణ చరిత్రను నిర్మించిందనే సందేశాన్ని కొత్త తరానికి అందించడం కూడా అవుతుంది. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న బీసీ వర్గాలకు ఇది ఆత్మగౌరవ భావనను కలిగించే గుర్తింపుగా నిలవవచ్చు.

రేవంత్ రెడ్డి ముందుంచిన ఈ పేరు సూచనను కేవలం నామకరణ ప్రక్రియగా చూడాల్సిన అవసరం లేదు. ప్రజల ఆకాంక్ష, చరిత్ర, సామాజిక ప్రాతినిధ్యం, ప్రాంతీయ అభివృద్ధి——ఈ నాలుగింటినీ కలిపే నిర్ణయంగా మలచవచ్చు. బాపూజీ పేరుకు ప్రజల్లో విస్తృత ఆదరణ లభిస్తే అది సామాజికంగా ప్రభుత్వానికి మరింత అనుబంధాన్ని పెంచే అంశంగా మారవచ్చు. అయితే తుది నిర్ణయం ప్రజాభిప్రాయం, చారిత్రక ప్రాముఖ్యత, ప్రభుత్వ విధానాలను పరిగణనలోకి తీసుకుని ఉండాలి.



వరంగల్ -మామునూరు విమానాశ్రయానికి “కొండా లక్ష్మణ్ బాపూజీ అంతర్జాతీయ విమానాశ్రయం”గా నామకరణం చేయాలి. పదవి కోసం తెలంగాణను వదలకుండా, తెలంగాణ కోసం పదవినే వదిలిన మహోన్నత నాయకుడికి అంతకంటే సముచితమైన గౌరవం ఏముంటుంది?

ఆ విమానాశ్రయం నుంచి ప్రతి విమానం ఆకాశంలోకి ఎగిరినప్పుడూ బాపూజీ త్యాగం, తెలంగాణ ఆత్మగౌరవం ప్రపంచానికి పరిచయం కావాలి.



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9133947176

# భయం వద్దు — అవగాహన ముద్దు

కాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు సెప్టెంబర్ 22 న ప్రపంచ క్యాన్సర్ రోగుల సంక్షేమ దినంగా జరుపుకుంటారు.'ఇంటర్నేషనల్ యూనియన్ ఎగెనెస్ట్ క్యాన్సర్ సంస్థ ప్రజలలోకి క్యాన్సర్ అవగాహనను తీసుకెళ్లేందుకు కృషి ప్రారంభించింది. ఆ సంస్థలో మొత్తం 100 దేశాలు, క్యాన్సర్ వ్యాధి మీద యుద్ధం చేస్తున్న 350 సంస్థలు సభ్యత్వం కలిగి ఉన్నాయి. వీరందరూ మీడియా ద్వారా క్యాన్సర్ వ్యాధి ప్రమాదాన్ని ప్రచారం చేయాలని పాలనా విధానాలలో క్యాన్సర్ వ్యతిరేక చర్యలు చేపట్టేల ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవటం కూడా వారు చేస్తున్న పని. అసలు క్యాన్సర్ అంటే ఏమిటి సాధారణంగా మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో నియంత్రించబడతాయి. కొన్ని సందర్భాలలో కణాల పెరుగుదలలో నియంత్రణ లేనందువల్ల కణాలు చాలా వేగంగా అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయి. ఈ కణ సమూహాలను 'కంతి' (టూమర్, tumor) అంటారు. అటువంటి కొన్ని ప్రమాదకరమైన వాటిని కేన్సర్ అని వ్యవహరిస్తారు. ఈ రకమైన పెరుగుదలకు ఒక స్పష్టమైన విధి ఉండదు. కేన్సర్ గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'ఆంకాలజీ' (Oncology) అంటారు. క్యాన్సర్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యాధి. క్యాన్సర్ మహమ్మారి ఏటా రూ.41, 17,000 కోట్లు హరిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మూడింట రెండొంతుల క్యాన్సర్ మరణాలు పేద, మధ్య తరగతి దేశాల్లోనే సంభవిస్తున్నాయి. అందులో ఎక్కువ భాగం ముందుగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా నయంచేయొచ్చని డబ్ల్యూహెచ్ఒ(WHO) వెల్లడించింది. క్యాన్సర్ అనేది ఏ వయస్సు వారి కైనా రావచ్చును. ఆడవారికి మగవారికి కూడ రావచ్చును. శరీరములో నోరు, గొంతు, ఎముకలు, రొమ్ము, చర్మము మున్నగు ఏ భాగానికి అయినా రావచ్చును.

శరీరంలో ఏదైనా అవయవానికి కేన్సర్ సోకితే తొలి దశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధరణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసు కోవడం సాధ్యం కాదు. క్యాన్సర్ అంటువ్యాధి కాదు. అలాగే వంశపారం పర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే. అయితే, రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు జన్యు పరంగా సంక్రమిస్తాయి. కుటుంబంలో ఎవరికైనా ఈ క్యాన్సర్లు వస్తే వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్ను తొలి దశలో గుర్తించక పోతే ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు సైతం



ఏమాత్రం తగ్గుముఖం పట్టవు. కాబట్టి దీనిపై అవగాహనతో ఎదుర్కొవాలి. కేన్సర్ కు కారణాల్లో ఆధునిక జీవన శైలి ప్రధానమైంది. మద్యం, పొగతాగడం, ఆహార పదార్థాల్లో రంగులు వినియోగం, రసాయనాలు వాడటం, హార్మోన్లు అధికంగా వాడటం, అధిక బరువు, కాలుష్యం, క్రిమిసంహారకాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాదవశాత్తు రేడియేషన్ కు గురికావడం, తరచూ వేధించే ఇన్ఫెక్షన్లు.. ఇవన్నీ క్యాన్సర్ కు కారకాలు. కొన్ని రకాల కేన్సర్లను రాకుండా వ్యాక్సిన్ వేసుకోవచ్చు. వాటిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కు ప్రధాన కారణం హెచ్ పీవీ వైరస్. కాబట్టి దీనికి వ్యాక్సిన్ వేసుకుని నివారించ వచ్చు. 9 ఏళ్లు పైబడిన బాలికల నుంచి 40 ఏళ్ల మహిళల వరకు ఈ వ్యాక్సిన్ వేయించు కోవచ్చు. అలాగే అండాశయం, గొంతు క్యాన్సర్ రాకుండా కూడా ఇది అడ్డుకుంటుంది.

క్యాన్సర్ కణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. కేన్సర్ను తొలి దశలోనే గుర్తించడం, దానికి ఇతర అవయవాలకు విస్తరించే గుణం ఉందా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. సర్జరీ, మందులు, థెరపీలు కూడా దీనిపైనే ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్ను జయించడం, త్వరగా గుర్తించడంతో పాటు ఆ కణితులు పరిమాణం, దశ, గ్రేడింగ్ కూడా చాలా ముఖ్యం. కాన్సర్ కు వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారూ దీని బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్లను చాలా వరకు పూర్తిగా నయం చేయగలిగినవే. అయితే, వయస్సు పెరిగేకొద్దీ కేన్సర్స్ వచ్చే ముప్పు ఎక్కువ. ఈ సమయంలో వచ్చే కేన్సర్ల తీవ్రత

*శరీరంలో ఏదైనా అవయవానికి కేన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధరణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసు కోవడం సాధ్యం కాదు. క్యాన్సర్ అంటువ్యాధి కాదు. అలాగే వంశపారం పర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే.*

చాలా ఎక్కువగా ఉంటుంది.

అందుకే కేన్సర్ చికిత్సను కూడా వయస్సును బట్టి నిర్ధరిస్తారు. క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేయడానికి కీమో థెరపీ, రేడియో థెరపీలతో పాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే కీహోల్ సర్జరీలు కూడా నేడు అందుబాటులో ఉన్నాయి. సర్జరీ తర్వాత రేడియో, కీమో, హార్మోన్ థెరపీ లాంటివి చేసినా, లేక థెరపీల తర్వాత సర్జరీ చేసినా చికిత్స అంతటితో అయి పోయిందని భావించరాదు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించు కోవాలి. క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడుందనే విషయం తెలుసు కోవడం కష్టం. ఏ అవయవానికి సోకిందనే అనుమానం ఉంటే దానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, యఫ్ యన్ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్ రే, సీటీ స్కాన్, యంఆర్ఐ, పీఈటీ స్కాన్ వంటివి అవసరాన్ని బట్టి చేస్తారు. అయితే సర్వైకల్ క్యాన్సర్ను పాప్ స్మియర్ ద్వారా ముందుగా గుర్తించవచ్చు.

ప్రభుత్వాలు చర్యలలో భాగంగా పొగాకు వాడకంపై యుద్ధం ప్రకటించడం, సిగరెట్ తయారీ కంపెనీలు వ్యాపార ప్రకటనలు ఇవ్వటాన్ని నిషేధించాయి. అదే విధంగా బీడీ కట్టల మీద పుర్రె గుర్తు ముద్రణతో క్యాన్సర్ భయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్ళ గలిగారు. మత్తు పానీయ ప్రకటనల మీద నిషేధం తీసుకు వచ్చారు. మన దేశంలో నోటి క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవటానికి కారణం గుట్కా వాడకమే. భారత దేశంలో 80 శాతం మందికి క్యాన్సర్ ముందుగా గుర్తు పట్టలేక పోతున్నారు. క్యాన్సర్ పై అవగాహన పెరగాలి. లేటు వయస్సు వారికి ఎక్కువగా క్యాన్సర్ వస్తున్నది. నేడు లైఫ్ స్టైల్ మారింది. పొగాకు సంబంధిత వస్తువులు వాడటం వల్ల 40శాతం మందికి క్యాన్సర్ వస్తున్నదని తెలుస్తున్నది.చికిత్సకు సంబంధించి నిర్ణయాలు మూడు విషయాలపై ఆధారపడి వుంటాయి. శరీర సాధారణ స్థితి, ఇతర జబ్బులు, కాన్సరు దశ, రోగి కోరిక, సమ్మతి. తొలిదశలో వున్న కాన్సర్లలో 70 నుంచి 90 శాతం కేసుల్లో నయం అయ్యే అవకాశం వుంది. కాన్సరు చికిత్సలో 19వ శతాబ్దం చివరిదశలో కాన్సరుకు శస్త్ర చికిత్స ప్రారంభమైంది. అయితే కాన్సరుకు శస్త్ర చికిత్స రానురాను వయస్సు పెరిగిన కొద్దీ తగ్గిపోతున్నది. రేడియేషన్ చికిత్స ఎక్స్రేను కనుగొన్న 1895 నుండి జరుప బడుతున్నది. వృద్ధుల్లో కాన్సరు జబ్బుకు రేడియేషన్ చికిత్సను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కాన్సరుకు మందులతో చికిత్స 1950 నుండి ప్రారంభమైంది. వృద్ధుల్లో కాన్సరు చికిత్సకు మందులను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

క్యాన్సర్ కష్ట నష్టాల గురించి ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పిచాలి , కాన్సర్ వ్యాధిని నయం చేయడానికి శస్త్ర చకిత్స, రేడియేషన్, కీమోథెరపీ అవసరం. ఆరోగ్యపు అలవాట్లను, ఆహారపు అలవాట్లను 30 నుంచి 40 ఏళ్ల వయస్సు నుంచే ప్రారంభించాలి. తొలిదశలోనే కాన్సరును గుర్తించి చికిత్స పొందాలి. ధూమపానం, సురాపానం, గుల్కా, జర్దా కిళ్లీలు మానాలి. పండ్లు, కూరగాయలు పీచు పదార్థం ఎక్కువగానూ, కొవ్వు తక్కువగానూ వుండే ఆహారాన్ని తీసుకోవాలి. కాన్సరు బారినుండి శరీరా



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు

అడివి బాపిరాజు (అక్టోబరు 8, 1895 సెప్టెంబరు 22, 1952) బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, కళాకారుడు, నవలాకారుడు, కవి, కథకుడు, గాయకుడు, నాటక కర్త. చిత్ర లేఖకుడు, కళాదర్శకుడు, జర్నలిస్ట్, న్యాయవాది. చిన్న తనం నుంచే సాహిత్యంపై ఆసక్తి చూపేవాడు. బాపిరాజు పశ్చిమ గోదావరి జిల్లా లోని భీమవరంలో అక్టోబర్ 8, 1895 న ఒక నియోగి బ్రాహ్మణ కుటుంబములో కృష్ణయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించాడు. భీమవరం హైస్కూలులో చదివి, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ లో బి.ఏ చదివి, మద్రాస్ లా కాలేజ్ లో బి.ఎల్ పట్టం పొంది, కొంతకాలం న్యాయవాద వృత్తి నిర్వహించిన తరువాత తన ఇతర వ్యాసంగాలలో కృషిని సాగించడానికి ఆ పనిని విరమించాడు. 1922 లో భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అరెస్టయినాడు. తన జైలు జీవితానుభవాలను తొలకరి అనే నవలలో పొందుపరచాడు. చిత్రకళా విద్యార్థిగా ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రమోదకుమార ఛటోపాధ్యాయ శిష్యత్వం పొందాడు. తెలుగు దినపత్రిక మీజాన్ సంపాదకునిగా పనిచేశాడు. త్రకళను నేర్పడానికి గుంటూరులో ఒక ఫౌండేషన్ ప్రారంభించాడు. భీమవరంలో న్యాయవాద వృత్తి చేస్తూ నారాయణరావు అనే సాంఘిక నవల రాశాడు. ఈ నవలకు ఆంధ్రవిశ్వకళా పరిషత్తు వారి బహుమతి లభించింది. 1934 నుంచి 1939 వరకు బందరు జాతీయ కళాశాల ప్రధానాచార్యుడిగా పనిచేశాడు. అదే సమయంలో కథలు రాశాడు. 1939 లో సినీరంగ ప్రవేశం చేసి అనసూయ, ధ్రువ విజయం, మీరాబాయి లాంటి సినిమాలకు కళాదర్శకత్వం చేశాడు. 1944 నుంచి 1947 వరకు హైదరాబాదు నుండి వెలువడే మీజాన్ పత్రికకు సంపాదకత్వం వహించాడు. ఆ సమయంలో తుఫాను, గోనగన్నారెడ్డి, కోనంగి నవలలు రచించాడు. అడవి బాపిరాజు రచనలలో ఆధునిక తెలంగాణ ప్రాంతాలుగా పరిగణనకు గురవుతున్న ప్రాంతాలు అధికంగా ఆయన చారిత్రక నవల 'గోనగన్నారెడ్డి' లో, కథలు 'నేల', 'వడగళ్ళు' 'బండరాళ్ళు'



లోనూ కనిపిస్తాయి. అడవి బాపిరాజు 'మీజాన్' పత్రిక సంపాదకుడిగా హైదరాబాదులో నివసించడం వల్ల ఆయన కథలలో హైదరాబాదు పరిసర ప్రాంతాలు అధికంగా ప్రదర్శితమయ్యాయి. ఈ సమయంలో ఆయన తెలంగాణ ప్రాంత ప్రజల మనస్తత్వాలను, జీవన విధానాన్ని, వారి కష్టాల స్వరూపాన్ని ఆకళింపు చేసుకున్నారు. తెలుగు దేశమంతటా విస్తృతంగా ప్రచారం లోనున్న "బావా బావా పన్నీరు" పాట ఈయన వ్రాసిందే. ఒకనాడు ఆకాశవాణి కేంద్రం ద్వారా తరుచుగా వినిపించిన పాడకే నా రాణి, బాలవే నీవెపుడూ పాటలను ప్రసిద్ధ గాయకుడు ఎమ్మెస్ రామారావు పాడి రికార్డు చేశారు. ఇలాంటి పాటలు బహుళ ప్రాచుర్యం పొందాయి. సన్నిహితులు, సమకాలీన సాహితీ వేత్తలు ఆయన్ని ముద్దుగా "బాపి బావ" అని పిలిచేవారు. 1934లో ఆంధ్ర విశ్వకళా పరిషత్ నిర్వహించిన నవలా పోటీలో 'నారాయణరావు' నవలకు కవి సామ్రాట్ విశ్వనాథ “వేయి పడగలు”తో పాటు ప్రథమ బహుమతి లభించడం విశేషం. ఆయన చిత్రించిన చిత్రాలలో సముద్ర గుప్తుడు, తిక్కన ప్రసిద్ధమయ్యాయి. విశ్వనాథ సత్యనారాయణ గేయ సంపుటి కిన్నెరసాని పాటలు బాపిరాజు చిత్రాలతో వెలువడింది. బాపిరాజు చిత్రించిన శబ్ద బ్రహ్మ అనే చిత్రం డెన్మార్కు ప్రదర్శనశాలలో ఉంది. భాగవత పురుషుడు, ఆనంద తాండవం మొదలగు చిత్రాలు తిరువాన్కూరు మ్యూజియం లో ఉన్నాయి. 1951లో అప్పటి మద్రాసు ప్రభుత్వం కోరికపై సింహళంలోని సిగిరియా కుడ్య చిత్రాల ప్రతికృతులను చిత్రించారు. సెప్టెంబరు 22, 1952 న బాపిరాజు మరణించాడు.



# జాతీయం-అంతర్జాతీయం





## భారత్, న్యూజిలాండ్ మధ్య ఒప్పందాలు

భారత్, న్యూజిలాండ్‌ల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టిఎ) అధికారికంగా ఆమోదించాయని న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖ మంత్రి టాడ్ మెక్‌క్లే తెలిపారు. ఎఫ్‌టిఎ కోసం చట్టపరమైన ప్రక్రియలు పూర్తయ్యాయని ధృవీకరిస్తూ భారత్, న్యూజిలాండ్ దేశాలు సోమవారం లాంఛనంగా దౌత్య పత్రాలను మార్చుకున్నాయి. న్యూజిలాండ్ పార్లమెంటులో మెక్‌క్లే, న్యూజిలాండ్‌లోని భారత హైకమిషనర్ మువాన్‌పుయి సయావిలు అధికారిక పత్రాలను మార్పిడి చేసుకున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ ఒప్పందం ఒక "చారిత్రాత్మక" ముందడుగుగా మెక్‌క్లే అభివర్ణించారు.

ఈ ఒప్పందం 2026, అక్టోబర్ 20 నుండి అమల్లోకి వస్తుందని అన్నారు. ఈ ఒప్పందం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటైన భారతదేశంలోకి న్యూజిలాండ్ వాణిజ్యానికి సమాన అవకాశాలు కల్పించి, ప్రవేశాన్ని సులభతరం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లలో అనిశ్చితి పెరుగుతున్నందున, న్యూజిలాండ్ ఎగుమతిదారులు తమ వ్యాపారాలను విస్తరించడం,కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని అన్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)పై ఇరు దేశాలు ఈ ఏడాది ఏప్రిల్ 27న సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, భారత్ నుండి దిగుమతి అయ్యే అన్ని వస్తువులపై న్యూజిలాండ్ సుంకాలను పూర్తిగా తొలగించనుంది. న్యూజిలాండ్ నుండి దిగుమతులలో 95శాతం వస్తువులపై భారత్ సుంకాలను తొలగించవచ్చు లేదా తగ్గించవచ్చు. ఈ నెల ప్రారంభంలో న్యూజిలాండ్ పార్లమెంట్ ఎఫ్‌టిఎను అమలు చేసే చట్టాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే.

## రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

- మాస్కో చరిత్రలోనే అతిపెద్ద డ్రోన్ ఎటాక్
- ఇద్దరు మృతి, 20 మందికిపైగా గాయాలు

**మాస్కో:**
రష్యా ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. పార్లమెంటర్ ఎన్నికలు జరుగుతున్న వేళ రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ విరుచుకుపడింది. మునుపెన్నడూ లేని స్థాయిలో రాత్రికిరాత్రే వందలాది డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. పలు భవనాలు, చమురు శుద్ధి కర్మాగారాలు దెబ్బతిన్నాయి. మరోవైపు, ఉక్రెయిన్ ప్రయోగించిన చాలా డ్రోన్లను తమ బలగాలు మార్గమధ్యంలోనే అడ్డుకున్నాయని రష్యా ప్రకటించింది.

మాస్కో ఆయిల్ రిఫైనరీలో పెద్దఎత్తున మంటలు ఉక్రెయిన్ దాడుల కారణంగా మాస్కో ఆయిల్ రిఫైనరీలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో సమీప ప్రాంతాల్లో భారీగా పొగ వ్యాపించింది. పలు నివాసాలు దెబ్బతిన్నాయి. మాస్కో చరిత్రలోనే అతిపెద్ద డ్రోన్ దాడి ఇదేనని అధికారులు తెలిపారు. మాస్కో వైపు దూసుకొచ్చిన 450కుపైగా డ్రోన్లను అడ్డుకున్నట్టు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. అటు రష్యా ఆక్రమిత క్రిమియాపైనా ఉక్రెయిన్ పెద్దఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలను, విద్యుత్తు వ్యవస్థల్ని స్తంభింపజేసేలా తాజా దాడులు జరిపింది. వీటి కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. దీంతో పలు విమాన సర్వీసులు రద్దుకాగా మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి.

మరోవైపు, ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యాలో తొలిసారిగా పార్లమెంటర్ ఎన్నికలు జరుగుతున్నాయి. అధ్యక్షుడు పుతిన్ విధానాలను వ్యతిరేకించే ప్రతిపక్షం దాదాపుగా లేకుండా సాగుతున్న ఈ ఎన్నికల ద్వారా క్రెమ్లిన్ ఆధిపత్యం మరింత సుస్థిరం కానుంది. అయితే రష్యా ఆక్రమిత ప్రాంతాల్లో కూడా పోలింగ్ నిర్వహించడాన్ని కీవ్ తీవ్రంగా తప్పుబట్టింది. రష్యా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించేందుకే ఉక్రెయిన్ తాజా దాడులకు పాల్పడిందని, అయితే ఆ కుట్రలో శత్రువులు విఫలమయ్యారని రష్యా పేర్కొంది. ఉక్రెయిన్ డ్రోన్‌లను సమర్ధవంతంగా కూల్చివేశాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. రష్యా రాజధాని వైపు వస్తున్న 450 డ్రోన్‌లను మార్గమధ్యంలో ధ్వంసం చేశారని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు.ఇదిలా ఉండగా, రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై దాదాపు నాలుగేండ్లు గడుస్తుంది. అయినప్పటికీ ఇరుపక్షాల సైనికులు ప్రతిదాడులతో విరుచుకుపడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ సైనిక డ్రోన్ సాంకేతికతలో ప్రపంచ అగ్రగామిగా నిలిచింది. రష్యా లోపలికి చొచ్చుకెళ్లి దాడులు చేయడానికి, దేశీయంగా ఉత్పత్తి చేసిన సుదూర డ్రోన్‌లతో పాటు క్షిపణులను కూడా మోహరిస్తోంది. అయితే, ఉక్రెయిన్ డ్రోన్ సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాలను, రక్షణ పరికరాల తయారీదారులను ఆకట్టుకుంది. శాంతి ఒప్పందం కోసం చర్చలు జరపాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తేవాలని కీవ్ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, యుద్ధాన్ని ఆపే ఉద్దేశం ఉన్నట్టు పుతిన్ ఇప్పటి వరకు ఎలాంటి సంకేతాలు చూపలేదు. దీంతో యుద్ధ ముగింపుపై తీవ్ర సందిగ్ధత నెలకొంది.ఈ దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. రష్యా చమురు, లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసినట్టు ఎక్స్ వెల్లడించారు. ఈ దాడుల్లో రష్యా చమురు కర్మాగారం దెబ్బతిన్నట్టు తెలిపారు. ఇందుకు గానూ, తమ సైనిక సిబ్బంది, గూఢచర్య విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో రష్యా యుద్ధయంత్రాంగాన్ని నడిపిస్తున్న బిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇకనైనా మాస్కో యుద్ధాన్ని ముగించి, శాంతి దిశగా అడుగులు వేయాలని కోరుకుంటున్నట్టు జెలెన్‌స్కీ తెలిపారు.



### ఉమర్‌ఖలీద్, షార్జిల్ ఇమామ్‌ల బెయిల్ పిటిషన్‌లపై

## విచారణ వాయిదా



**న్యూఢిల్లీ :**
మాజీ జెఎన్‌యు నేత ఉమర్‌ఖలీద్, సామాజిక కార్యకర్త షార్జిల్ ఇమామ్‌ల బెయిల్ పిటిషన్‌లపై విచారణను ఢిల్లీహైకోర్టు సో...వారం వాయిదా వేసింది. అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు అనారోగ్యం కారణంగా హాజరుకాకపోవడంతో, ప్రాసిక్యూషన్ వాయిదా వేయాల్సిందిగా అభ్యర్థించింది. దీంతో ఈ పిటిషన్‌లపై విచారణను సెప్టెంబర్ 30కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ ప్రతిభా ఎం.సింగ్, జస్టిస్ దినేష్ భట్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. తమకు బెయిల్ నిరాకరిస్తూ ఈ ఏడాది జుల్‌లో ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఉమర్ ఖలీద్, షార్జిల్ ఇమామ్‌లు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ అల్లర్ల కేసులో 2020 సెప్టెంబర్‌లో ఖలీద్‌ను,

2020 ఆగస్టులో ఇమామ్‌లను యుఎపిఎ చట్టం కింద అరెస్ట్ చేశారు.

## సామాన్యుడిపై పెరుగుతున్న భారం

- రష్యా చమురుపై వందశాతం కొరడా
- ఇప్పడున్న పన్నులకు ఇది అదనం
- ట్రంప్‌నకు మోడీ సాష్టాంగం
- భయపెడుతున్న ద్రవ్యోల్బణం

**భారత్‌పై అమెరికా సుంకాల ప్రభావం**

**వాషింగ్టన్, న్యూఢిల్లీ :**
రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలను కఠినతరం చేసే 2026 యాక్ట్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చట్టబద్ధత కల్పించారు. రష్యా నుంచి చమురు దిగుమతులు కొనసాగించే దేశాలపై 100 శాతం వరకు అదనపు దిగుమతి సుంకాలు విధిస్తామని ఆ చట్టంలో ఉంది. ఈ ప్రభావం రష్యా చమురును భారీగా దిగుమతి చేసుకుంటున్న భారత్‌పై తీవ్రంగా పడనుంది. ఫలితంగా దేశ ఎగుమతులు, ఇంధన భద్రత, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**రష్యాపై ఆంక్షలు ఎందుకు?**

రష్యాఉక్రెయిన్ యుద్ధం జరుగుతున్న క్రమంలో రష్యాకు లభిస్తున్న ఆర్థిక వనరులను తగ్గించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. రష్యా నాయకత్వం, ఆ దేశ ఇంధనాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్న దేశాలపై ఆంక్షలు విధించడం ద్వారా యుద్ధానికి అందుతున్న ఆర్థిక బలాన్ని అడ్డుకోవాలని అమెరికా భావిస్తోంది. తర్వాత చట్టం పేరులో ఇరాన్‌ను కూడా చేర్చారు. ఇరాన్‌పై ఆంక్షలను మరో ఐదేండ్లు.. అంటే 2031 వరకు కొనసాగించేలా నిబంధనలను సవరించారు.

**రష్యా చమురు కొనుగోళ్లపై వంద శాతం సుంకం**

భారత్‌కు అత్యంత కీలకమైన నిబంధన రష్యా నుంచి చమురు దిగుమతులు చేసుకునే దేశాలపై విధించే సుంకాలకు సంబంధించినది. చట్టం అమల్లోకి వచ్చిన 30 రోజుల తరువాత.. రెండు ప్రమాణాల్లో ఏదో ఒకదానికి సరిపడే దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 100 శాతం వరకు సుంకం విధించే అవకాశం అమెరికాకు ఉంటుంది. ఇందులో మొదటి ప్రమాణం ప్రకారం.. చట్టం అమలులోకి రాకముందు 12 నెలల కాలంలో రష్యా నుంచి ముడి చమురు లేదా సహజవాయువును అత్యధికంగా దిగుమతి చేసుకున్న ఐదు దేశాల్లో ఒకటిగా ఉండటం. అలాగే, 30 రోజుల గడువు అనంతరం కూడా రష్యా నుంచి చమురు లేదా గ్యాస్ దిగుమతులను కొనసాగించడం. రష్యా ముడి చమురును అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశాల్లో చైనా, భారత్ ముందువరుసలో ఉన్నాయి. కాబట్టి ఈ నిబంధన భారత్‌కు ప్రత్యేకంగా ప్రాధాన్యంగా మారింది. ఈ ఏడాది జులైలో భారత్ దిగుమతి చేసుకున్న ముడి చమురులో రష్యా వాటా 51 శాతానికి మించిపోయింది.

హార్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాకు పరిమితులు కొనసాగుతున్న సమయంలో.. కేవలం 30 రోజుల్లో రష్యా దిగుమతులను గణనీయంగా తగ్గించడం భారత్‌కు సవాలుగా మారుతుంది. ఇక రెండో ప్రమాణం ప్రకారం...రష్యా చమురుపై విధించిన ఆంక్షలను తప్పించుకునేందుకు సహకరించిన దేశాల్లో... చట్టం అమలుకు ముందు 12 నెలల కాలంలో మొదటి ఐదు దేశాల్లో ఒకటిగా ఉండటం. భారతీయ చమురు మార్కెటింగ్ సంస్థలు తాము కొనుగోలు చేసిన చమురు ఆంక్షలను ఉల్లంఘించకుండా సేకరించినట్టు కథనాలను బట్టి తెలుస్తోంది. అందువల్ల ఈ రెండో ప్రమాణం కింద భారత్‌కు వచ్చే ప్రమాదం తక్కువగా ఉండవచ్చని విశ్లేషకులు అంటున్నారు.

**ఇప్పటికే ఉన్న సుంకాలకు అదనంగా మరో 100 శాతం**

కొత్త చట్టం కింద విధించే సుంకాలు ఇతర దిగుమతి సుంకాలకు అదనంగా ఉంటాయని చట్టంలోని నిబంధన పేర్కొంటోంది. అమెరికా వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301, సెక్షన్ 232 కింద విధించే సుంకాలు కూడా ఇందులోకి వస్తాయి. భారత్ ఇప్పటికే కొన్ని ఉత్పత్తులపై అమెరికా సుంకాలను ఎదుర్కొంటోంది. స్టీల్, అల్యూమినియం, రాగి, వాటి సంబంధిత ఉత్పత్తులపై సెక్షన్ 232 కింద సుంకాల రేటు 50 శాతానికి పెరిగింది. ఈ సుంకాలకు అదనంగా మరో 100 శాతం సుంకం విధిస్తే.. అమెరికా మార్కెట్లో భారతీయ ఉత్పత్తుల ధరలు పెరిగి, ఎగుమతిదారుల పోటీతత్వం దెబ్బతినే అవకాశం ఉంటుంది. చట్టం అమలైన వెంటనే సుంకాలు విధించాల్సిన అవసరం లేదు. రష్యా నుంచి చమురు, గ్యాస్ దిగుమతులను దేశాలు కొనసాగిస్తున్నాయా లేదా అనే విషయాన్ని నిర్ణయించేందుకు 30 రోజుల గడువు ఉంటుంది. ఆ తరువాతే చట్టం కింద సుంకాలు విధించే అవకాశం ఉంటుంది.

**భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం**

కొత్త చట్టం వల్ల భారత్‌పై పడే ప్రభావాన్ని రెండు విధాలుగా చెప్పొచ్చు. మొదటిది.. రష్యా చమురు కొనుగోళ్లు కొనసాగించి, సుంకాలను భరించడం. 2025 ఆగస్టు నుంచి 2026 ఫిబ్రవరి వరకు 50 శాతం సుంకాలు అమల్లో ఉన్న సమయంలో చోటు చేసుకున్న పరిణామాలను ఉదాహరణగా తీసుకోవచ్చని విశ్లేషకులు చెప్తున్నారు. 2025 ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో అమెరికాకు భారత వస్తువుల ఎగుమతులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 18 శాతం పెరిగాయి. భవిష్యత్ సుంకాలను దృష్టిలో ఉంచుకుని ఎగుమతిదారులు ముందుగానే సరుకులు పంపడం కూడా ఈ పెరుగుదలకు ఒక కారణమైంది. అయితే 2025 ఏప్రిల్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు మొత్తం కాలాన్ని పరిశీలిస్తే ఎగుమతుల వృద్ధి 3.8 శాతానికి పరిమితమైంది. సుంకాలు అమల్లోకి వచ్చిన తరువాత ఎగుమతుల వేగం తగ్గింది.ఇక రెండోది... రష్యా చమురు దిగుమతులను తగ్గించడం. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను గణనీయంగా తగ్గిస్తే, ప్రత్యామ్నాయ సరఫరాదారుల నుంచి చమురు కొనుగోలు చేయాల్సి రావచ్చు. అంతర్జాతీయ చమురు ధరలు పెరిగిన సమయంలో ఇది దిగుమతి వ్యయాన్ని పెంచే అవకాశం ఉంది. హార్మూజ్ జలసంధిలో రవాణా పరిమితులు కొనసాగుతున్న పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ వనరుల నుంచి చమురు పొందడం మరింత ఖరీదైనదిగా మారుతుంది. దీని ప్రభావం దేశీయ ఇంధన ధరలు, రవాణా వ్యయాలు, ద్రవ్యోల్బణం, వాణిజ్య లోటుపై పడే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. ఇది అంతర్జాతీయ చమురు ధరలు, దిగుమతుల ప్రత్యామ్నాయాలు, రూపాయి మారకం విలువ, ప్రభుత్వ ధరల విధానం వంటి అంశాలపై కూడా ఆధారపడి ఉంటుంది.

**'జీ హుజూర్..' అంటేనే సుంకాల నుంచి మినహాయింపు**

ఈ చట్టంలో సుంకాల మినహాయింపుకు సంబంధించిన నిబంధన ఉంది. అమెరికా అధ్యక్షుడు మినహాయింపు ఇవ్వాలంటే.. అది అమెరికా జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉందని ధృవీకరించే లిఖితపూర్వక ప్రకటనను కాంగ్రెస్‌కు సమర్పించాలి. అలాగే, ఆ ధృవీకరణకు ఆధారమైన కారణాలను వివరిస్తూ ఒక నివేదికను కూడా అందించాలి. దీనిని బట్టి చూస్తే సుంకాల మినహాయింపు అనేది క్లిష్టమైందే.

**రష్యా-ఉక్రెయిన్ శాంతి ఒప్పందం మరో మార్గం!**

రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరితే ఆంక్షల పరిస్థితిలో మార్పు రావచ్చని విశ్లేషకులు వివరిస్తున్నారు

. రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడం, ఉక్రెయిన్‌పై సైనిక చర్యలు నిలిపివేయడం, ఆ దేశ ప్రభుత్వాన్ని కూలదోయడం లేదా బలహీనపరచే చర్యలను ఆపడం వంటి షరతులు ఇందులో ఉండే అవకాశాలుంటాయని అంటున్నారు. అయితే శాంతి ఒప్పందం ద్వారా భారత్‌పై విధించే సుంకాలు రద్దవుతాయనే నిర్ధారణకు రాలేమని కూడా వారు వివరిస్తున్నారు.

## చైనా ఉపగ్రహాల ప్రయోగం సక్సెస్



**జియుక్వాన్ (చైనా) :**
షాన్సీ రాష్ట్రంలోని డాంగ్‌ఫెంగ్ వాణిజ్య ఆవిష్కరణల పైలట్ జోన్ నుంచి ఆదివారం మధ్యాహ్నం బీజింగ్ కాలమానం ప్రకారం 12.03 గంటలకు (బీజింగ్ సమయం) చైనా తొమ్మిది ఉపగ్రహాలను విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రయోగించింది. ఉపగ్రహాల సమూహం పీశాట్ - 2 13 - 16ను అంతరిక్షంలోకి తీసుకెళ్లిన లిజియాన్ - 1వై18 క్యారియర్ రాకెట్ వాటిని ముందుగా నిర్దేశించిన ప్రణాళికాబద్ధమైన కక్ష్యలలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది.

ఈ ప్రయోగం లాంగ్ మార్చ్ క్యారియర్ రాకెట్ శ్రేణిలో 668వది. రెండు దశల ద్రవ ప్రయోగ వాహనమైన ఈ రాకెట్ 700 కిలోమీటర్ల సూర్య - సమకాలీన కక్ష్య (భూమి చుట్టూ ఉండే ప్రత్యేకమైన అంతరిక్ష కక్ష్య. ఈ కక్ష్యలో తిరిగే ఉపగ్రహం భూమిపై ఉన్న ఏ ప్రాంతం మీదుగా వెళ్లినా ప్రతి రోజూ ఒకే స్థానిక సౌర సమయానికి ఆ ప్రాంతాన్ని దాటుతుంది)లో 1.3 టన్నుల బరువును మోయగలదు. రాకెట్‌లో బీజింగ్‌కు చెందిన ప్రయివేటు ఉపగ్రహ తయారీ సంస్థ గెలాక్సీస్పేస్ అభివృద్ధి చేసిన నాలుగు సింథటిక్ అపర్చర్ రాడార్ (ఎస్ఏఆర్) ఉపగ్రహాలు ఉన్నాయి.

## ఇరాన్‌కు వెళ్లొద్దు.. అమెరికా హెచ్చరిక



**వాషింగ్టన్:**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా తన పౌరులకు కీలక హెచ్చరిక జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్‌కు ప్రయాణించవద్దని సూచించింది. ఇప్పటికే ఇరాన్‌లో ఉన్న అమెరికన్లు వెంటనే దేశం విడిచి వెళ్లాలని కోరింది. ఇరాన్‌లో భద్రతా పరిస్థితులు సంక్లిష్టంగా మారుతున్నాయని అమెరికా వర్చువల్ ఎంబసీ ఇన్ ఇరాన్ తెలిపింది. విమాన సర్వీసులు రద్దు కావడం, గగనతలం మూసివేయడం, సరిహద్దుల వద్ద ఆంక్షలు విధించడం వంటి పరిణామాలు అకస్మాత్తుగా చోటుచేసుకోవచ్చని హెచ్చరించింది.ఇరాన్‌లో ఉన్న అమెరికన్లు నిరసనలు, భారీ జన సమూహాలకు దూరంగా ఉండాలని సూచించింది. వైమానిక దాడులు జరిగే పరిస్థితుల్లో కిటికీలు, అద్దాల తలుపులకు దూరంగా ఉండాలని, కూలిన భవనాల శిథిలాల వద్దకు వెళ్లవద్దని పేర్కొంది.

అత్యవసర పరిస్థితుల్లో దౌత్య అధికారులను సంప్రదించేందుకు **స్మార్ట్ ట్రావెలర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రోగ్రామ్ (STEP)**లో నమోదు చేసుకోవాలని సూచించింది. పశ్చిమాసియాలో ప్రయాణించే అమెరికన్లు విమాన సర్వీసులు, గగనతల మార్గాల్లో ఆకస్మిక మార్పులు, రద్దులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

## బ్యాంకుల్లో మరోసారి సమ్మె సైరన్




**న్యూఢిల్లీ :**
బ్యాంకుల్లో మరోసారి సమ్మె సైరన్ మోగనుంది. తమ డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 28 నుండి 30 వరకు మూడురోజుల పాటు సమ్మె చేపట్టనున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) సోమవారం స్పష్టం చేసింది. సెప్టెంబర్ 26, 27 తేదీలు వరుసగా నాలుగవ శనివారం, ఆదివారం కావడంతో, వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంక్ సేవలు నిలిచిపోనున్నాయి.

2024లో హామీ ఇచ్చిన వారానికి ఐదు రోజుల పనిదినాల విధానం అమలు సహా నాలుగు ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11న యుఎఫ్‌బియు ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే.

ఎస్‌బిఐ తమ వినియోగదారులకు ఒక సూచనను జారీ చేసింది. సమ్మె సమయంలోనూ అత్యవసర బ్యాంకింగ్ సేవలను అందించడానికి అన్ని విధాలా కృషి చేస్తామని తన ఎస్‌బిఐ తన ఎక్స్ ఖాతాలో పేర్కొంది. అత్యవసర నగదు లావాదేవీల కోసం ఏటీఎంలు, ఎడిడబ్ల్యుఎంలను వినియోగించాలని సూచించింది. అలాగే, కస్టమర్ సర్వీస్ పాయింట్లు (సిఎస్‌పిఎస్)లు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపింది. వారానికి ఐదు రోజుల పని విధానం, పెన్షన్ల సవరణ, పెన్షనర్లందరికీ ఒకే విధమైన కరువు భత్యం (డిఎ) విధానాన్ని అమలు చేయాలని యుఎఫ్‌బియు డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్లను గతంలో కూడా పలుమార్లు లేవనెత్తారు. ప్రభుత్వం, బ్యాంక్ యాజమాన్యాలు ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరకపోవడం వల్లే ఉద్యోగులు సమ్మె మార్గాన్ని ఎంచుకున్నారని యుఎఫ్‌బియు పేర్కొంది.

## కృత్రిమ మేధ కట్టడికి చైనా ముందస్తు చర్యలు

- సాంకేతిక భద్రత, ప్రభుత్వ పర్యవేక్షణకు ప్రాధాన్యం
- స్వతంత్ర ఎఐ ఏజెంట్లపై *భద్రతా ప్రమాణాల రూపకల్పన

**బీజింగ్ :**
మానవ నియంత్రణను దాటి కృత్రిమ మేధ (ఏఐ) స్వతంత్రంగా వ్యవహరించే ప్రమాదాలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ.. చైనా ముందస్తు భద్రతా చర్యలపై దృష్టి సారిస్తోంది. ఏఐ తనకు తానే నకళ్లను సృష్టించుకోవడం, వనరులను సమీకరించడం, మానవ నియంత్రణకు సవాలు విసరడం వంటి భవిష్యత్తు ప్రమాదాలను చైనా ఇప్పటికే తన ఏఐ భద్రతా విధానాల్లో గుర్తించింది. సాంకేతిక ప్రమాణాలు, ప్రభుత్వ పర్యవేక్షణ, భద్రతా పరీక్షల ద్వారా ఈ ముప్పులను నియంత్రించేందుకు బీజింగ్ చర్యలు చేపడుతోంది. అత్యాధునిక ఏఐ అభివృద్ధిలో అమెరికా, చైనా ప్రపంచంలోని రెండు ప్రధాన శక్తులుగా ఉన్నాయి. ఏఐ విధానాలు, పరిశ్రమల ఆచరణల విషయంలో ఇరు దేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల చివర్లో జరగనున్న ద్వైపాక్షిక చర్చల్లో ఏఐ భద్రత అంశం కీలకంగా మారనుంది. అమెరికాకు చెందిన ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్ పరిశోధకులు శక్తిమంతమైన ఏఐ మోడళ్లు మానవ నియంత్రణ నుంచి తప్పించుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ హెచ్చరికలు చైనాలోనూ ఏఐ భద్రతపై జరుగుతున్న చర్చలకు ప్రాధాన్యం పెంచాయి.

మానవాళికి అంతిమ ముప్పు కాదు

అత్యాధునిక ఏఐ మానవాళి ఉనికికే ముప్పుగా మారుతుందా? అనే ప్రశ్నపై అమెరికాలో చర్చ ఎక్కువగా సాగుతోంది. దీనికి భిన్నంగా చైనా విధానకర్తలు ఏఐని శక్తిమంతమైనప్పటికీ నియంత్రించగల సాంకేతిక పరిజ్ఞానంగా పరిగణిస్తున్నారు. బీజింగ్, సింగపూర్ కేంద్రంగా పనిచేసే ఏఐ భద్రత, పాలన పరిశోధనా సంస్థ కాంకోర్డియా ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ బ్రియాన్ త్సే ప్రకారం.. చైనా, అమెరికా నిపుణులు ఏఐ ప్రమాదాల విషయంలో ఎక్కువగా ఏకీభవిస్తున్నారు.

చైనా సైబర్‌స్పేస్ నియంత్రణ సంస్థ, ఆర్థిక ప్రణాళిక సంస్థ, పరిశ్రమ మంత్రిత్వ శాఖలు మేలో విడుదల చేసిన విధానంలో ఏఐ ఏజెంట్ల నియంత్రణ కోల్పోయే ప్రమాదాన్ని గుర్తించాయి. సాధారణ చాట్‌బాట్లతో పోలిస్తే ఏఐ ఏజెంట్లు అనేక దశలతో కూడిన పనులను స్వతంత్రంగా ప్రణాళిక రూపొందించి నిర్వహించగల వ్యవస్థలు. ఉదాహరణకు.. ఒక లక్ష్యాన్ని అందించినప్పుడు సమాచారాన్ని సేకరించడం, నిర్ణయాలు తీసుకోవడం, ఇతర డిజిటల్ వ్యవస్థలను ఉపయోగించడం వంటి పనులను అవి నిర్వహించగలవు. చైనా ఏఐ ఏజెంట్ల భద్రతకు సంబంధించి తప్పనిసరి జాతీయ ప్రమాణాన్ని రూపొందించే ప్రక్రియను ప్రారంభించింది. కాంకోర్డియా ఏఐకి చెందిన బ్రియాన్ త్సే అభిప్రాయం ప్రకారం.. ఈ ప్రమాణం ప్రపంచంలోనే ఈ తరహాలో తొలి జాతీయ ప్రమాణం కావచ్చన్నారు.

అమెరికా ఏఐ మోడళ్లపై చైనా ఆందోళనలు

చైనా ప్రభుత్వ భద్రతా మంత్రి చెన్ యిక్సిన్ రాసిన ఓ కథనంలో.. ఆంత్రోపిక్‌కు చెందిన మిథోస్, ఓపెన్‌ఏఐకి చెందిన జీపీటీ5.5 సైబర్ వంటి అత్యాధునిక అమెరికా ఏఐ మోడళ్లు చైనా కీలక సమాచార మౌలిక వసతులకు తీవ్రమైన ప్రమాదాలను కలిగించవచ్చని పేర్కొన్నారు. ఏఐ భద్రతను సమగ్రంగా బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే దీనిపై ఆంత్రోపిక్, ఓపెన్‌ఏఐ స్పందించాల్సి ఉంది. ఏఐ మోడళ్లను పరిశీలించేందుకు, మార్చేందుకు వీలుండటం సైబర్ భద్రతా పరిశోధనలకు ఉపయోగపడుతుందని చైనా డెవలపర్స్ చెప్తున్నారు.

## టీవీ పూల్ నుంచి సీఎన్ఎన్‌ను తొలగించిన వైట్‌హౌస్

**వాషింగ్టన్ :**
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సీఎన్ఎన్, ఎంఎస్ నౌ, పొలిటికోలను వైట్‌హౌస్ నుంచి నిషేధిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో వివాదం మరింత తీవ్రమైంది. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం కోసం ట్రంప్ న్యూయార్క్ పర్యటనను కవర్ చేసేందుకు టెలివిజన్ పూల్ ప్రతినిధిగా వ్యవహరించాల్సిన సీఎన్ఎన్‌ను వైట్‌హౌస్ ఆ బాధ్యత నుంచి తొలగించింది. ఇప్పటికే ఆ మూడు సంస్థల జర్నలిస్టుల ప్రెస్ బ్యాడ్జ్‌లను నిష్క్రియం చేసి, కొందరిని వైట్‌హౌస్ ప్రాంగణంలోకి అనుమతించలేదని సమాచారం. ఈ చర్యలను వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ విమర్శించింది. తమపై ఆంక్షలు ఉన్నప్పటికీ ప్రభుత్వ వార్తా కవరేజీ కొనసాగుతుందని సీఎన్ఎన్ తెలిపింది. ఈ వ్యవహారాన్ని మూడు మీడియా సంస్థలు న్యాయస్థానంలో సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు.. 28 మంది మృతి..!

అఫ్గానిస్థాన్‌పై సోమవారం పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 28 మంది ఉగ్రవాదులు మరణించినట్లు పాక్ ప్రకటించగా.. ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారని అఫ్గాన్ వెల్లడించింది. గత కొన్ని నెలలుగా ఈ రెండు దేశాల మధ్య జరుగుతోన్న ఘర్షణల్లో ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తాజా వైమానిక దాడులు అఫ్గానిస్థాన్‌లోని కునార్, పక్తికా, ఖోస్త్ ప్రావిన్సులను లక్ష్యంగా చేసుకున్నాయని కాబూల్ అధికారులు వెల్లడించారు. దాడుల్లో పలు నివాసాలు ధ్వంసమయ్యాయన్నారు.

పాక్ వైమానిక దాడులను తాలిబన్ ప్రధాన ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. రోజురోజుకూ ఇస్లామాబాద్ దురాక్రమణలు పెరిగిపోతున్నాయని దుయ్యబట్టారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. ఇటీవల పాక్‌లో జరిగిన పలు ఉగ్రదాడులకు ప్రతిస్పందనగా.. అఫ్గాన్‌పై దాడులు చేపడతామని ఆ దేశ సమాచార మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే దాడులు చోటుచేసుకున్నాయి.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సూపర్ స్పెషాలిటీ పనులను వేగంగా పూర్తి చేయాలి



– ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియాన

వరంగల్ సిటీ, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించేందుకు తెలంగాణ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తూ సోమవారం హనుమకొండకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆమెకు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాన్ని సందర్శించి జరుగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సంబంధిత శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



– జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ములుగు, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):

ఈనెల 23న నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, పోలీసు అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో నిమజ్జన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. నిమజ్జన ప్రాంతాల్లో నీటి లోతు, ప్రవాహాన్ని అంచనా వేసి బారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా క్రేన్లు, గజఈతగాళ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలి. విద్యుత్, పారిశుద్ధ్యం, విద్యుత్ లైన్లను ముందస్తుగా పరిశీలించి, నిమజ్జనం పూర్తయ్యే వరకు అంతరాయం లేకుండా చూడాలి. నిమజ్జనం పూర్తయిన వెంటనే చెత్తను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. శాంతిభద్రతలు, ఊరేగింపులు నిర్దేశిత మార్గాలు, సమయాల్లో జరిగేలా ఉత్సవ కమిటీలకు సూచించాలి. జనసమ్మర్ధాన్ని నివారించేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి. మండల స్థాయిలో సమీక్ష: అన్ని మండలాల్లో మంగళవారం ప్రత్యేక అధికారులు సమావేశాలు నిర్వహించి, ప్రజాప్రతినిధుల సహకారంతో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. లోటుపాట్లకు తావు లేకుండా రెవెన్యూ, పోలీస్, విద్యుత్, పంచాయతీ, వైద్యారోగ్య తదితర అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్. మహేందర్ జి, సంపత్‌రావు, ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి



– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):

ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలకు అధికారులు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సోమవారం రోజున జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోం తో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులతో పాటు పాత పెండింగ్ అర్జీలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 481 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూ సమస్యల రద్దు, హద్దుల సర్వే, దారి కబ్జాల నివారణ తదితర అంశాలపై బాధితులు విన్నపాలు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో బలరామ రావు, డీఆర్డీఓ భాస్కర్, సీపీఓ చినకోట్యా నాయక్ ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాములు నాయక్ తండా రాళ్ల చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు?

**అనుమతులు లేకుండానే మెరం తరలిస్తున్నారంటూ స్థానికుల ఆరోపణలు.**
**ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని ఆందోళన.**
**అధికారుల తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్.**
**అనుమతులు లేవని ఎమ్మార్వో వెల్లడి..**
**చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ.**

వరంగల్ జిల్లా నర్సంపేట వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 21.








నర్సంపేట పట్టణం 13వ వార్డు రాములు నాయక్ తండా పరిధిలోని రాళ్లచెరువులో అనుమతులు లేకుండా మెరం (మట్టి) తవ్వకాలు జరుగుతున్నా విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. చెరువు ప్రాంతంలో కొంతకాలంగా మట్టి తవ్వకాలు చేపట్టి, టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు పరిధిలో మట్టిని పెద్ద ఎత్తున తవ్వడం వల్ల భవిష్యత్‌లో చెరువు నీటి నిల్వ సామర్థ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అనుమతులు, నిబంధనలను పాటించకుండా తవ్వకాలు జరుగుతున్నట్లయితే వాటిని వెంటనే నిలిపివేయాలని వారు కోరుతున్నారు. మట్టి తవ్వకాల కోసం యంత్రాలను ఉపయోగిస్తున్నారని, రాత్రి వేళల్లో కూడా తరలింపు జరుగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో చెరువు స్వరూపం దెబ్బతిందంతో పాటు, పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు అంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములు లేదా ఇతర ఆదాయాలు సమకూరకుండా మట్టి తరలిస్తే ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏది?**

రాళ్లచెరువు ప్రాంతంలో జరుగుతున్న మట్టి తవ్వకాలపై సంబంధిత రెవెన్యూ, మైనింగ్, నీటిపారుదల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తవ్వకాలకు సంబంధించి అనుమతులు ఉన్నాయా? ఎంత మేరకు తవ్వకాలకు అనుమతి ఇచ్చారు? అనుమతించిన పరిమితులను మించి తవ్వకాలు జరుగుతున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమంగా తరలించిన మట్టికి సంబంధించిన ప్రభుత్వ రుసుములు, జరిమానాలను వసూలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ రాములు నాయక్ తండా రాళ్లచెరువులో మట్టి తవ్వకాలపై అధికారులు వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. చెరువు భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని, ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**ఎమ్మార్వో వివరణ:**

రాళ్లచెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలపై ఎమ్మార్వో (తహసీల్దార్)ను 'వుదయం' ప్రతినిధి వివరణ కోరగా... చెరువులో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న వారిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## న్యాయ వ్యవస్థ మనుగడ న్యాయవాదుల భుజాలపైనే ఉంది





– టీఎస్ బార్ కౌన్సిల్ మెంబర్ సహోదర్ రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి) :

న్యాయ వ్యవస్థ మనుగడ, పటిష్టత పూర్తిగా న్యాయవాదుల బాధ్యతాయుతమైన సేవలపైనే ఆధారపడి ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్, సీనియర్ న్యాయవాది ముద్దసాని సహోదర్ రెడ్డి పేర్కొన్నారు. హనుమకొండలోని పోస్టల్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'యం.ఏ. లీగల్ సర్వీస్' కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో న్యాయ వ్యవస్థ పటిష్టంగా నిలబడాలంటే న్యాయవాదులు నిస్వార్థంగా సేవలందించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా న్యాయవాద వృత్తిలోకి కొత్తగా వస్తున్న యువ న్యాయవాదులు చట్టాలపై సమగ్ర అవగాహన పెంచుకుంటూ వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చకిలం ఉపేందర్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవాదులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని, సమాజ శ్రేయస్సుకు, అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని అన్నారు. యం.ఏ. లీగల్ సర్వీస్ స్థాపకులు, సీనియర్ న్యాయవాది మహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ... న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనదని, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ బాధితులకు సరైన న్యాయం అందించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో హన్మకొండ బార్ మాజీ ప్రధాన కార్యదర్శి కొత్త రవి, హనుమకొండ జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గజ్జెల్లి శ్రీరాములుతో పాటు పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు కుమార్, రాజ్‌కుమార్, దినేష్, నిఖిల్ పాల్గొన్నారు.

## సూపర్ స్పెషాలిటీ పనులను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియాన



**పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు.**

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 21

వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జె. చోంగ్తూ, ఐఏఎస్, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ వాణి సోమవారం వరంగల్‌లోని నూతనంగా నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులోకి రానున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సంబధిత శాఖల సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 26న కంబాలపల్లి వద్ద 'ప్రపంచ పర్యాటక దినోత్సవం'



– జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి) :

జిల్లాలోని కంబాలపల్లి పెద్ద చెరువు వద్ద సెప్టెంబర్ 26న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు. జిల్లాలోని ప్రకృతి సౌందర్యం, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదేశాలను వెలుగులోకి తెచ్చి, మహబూబాబాద్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. కంబాలపల్లి చెరువుతో పాటు బయ్యారం చెరువు, గుంజేడు ముసలమ్మ దేవాలయం,కురవి వీరభద్రస్వామి ఆలయం, భీమునిపాదం జలపాతం వంటి ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి సుందరీకరించనున్నట్లు వెల్లడించారు. పర్యాటక అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి, కళాకారులు మరియు వ్యాపారులకు ఆర్థిక అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాధాన్యతపై అవగాహన, జిల్లా వైభవాన్ని చాటే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు

## నష్టపరిహారం ఇచ్చేవరకు రోడ్డు నిర్మాణం పనులు ఆపాలి బాధితులు కలెక్టర్ కు వినతి



యాదాద్రి భువనగిరి జిల్లా. 21 సెప్టెంబర్ 2026 .

ఈ రోజు nh 930p గౌరెల్లీ భద్రాచలం రోడ్డులో భూములు కోల్పోయిన పోచంపల్లి మరియు వలిగొండ మండల రైతులతో కలెక్టర్ ఆఫీస్ లో ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు గారు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రైతులు తమకు జరిగిన అన్యాయాని కలెక్టర్ కు విన్నవించడం జరిగింది.సరైన నష్టపరిహారం ఇవ్వకుండా పోచంపల్లి మండలంలో రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్నారు కాబట్టి మాకు సరైన నష్టపరిహారం మరియు ఆర్బిట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేంత వరకు రోడ్డు నిర్మాణం పనులు ఆపాలని కలెక్టర్ ను కోరడం జరిగింది. ఈ విషయం పై ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ వారం లోపు ఆర్బిట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టి కలెక్టర్ వచ్చిన తర్వాత గ్రామాల వారీగా రైతులను పిలిపించి నష్టపరిహారం పెంపు పై నిర్ణయం తీసుకుంటారని హామీ ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డు కు ఇచ్చిన పరిహారం కంటే ఎక్కువ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేయడం జరిగింది.ఈ రోజు nh 930p గౌరెల్లీ భద్రాచలం రోడ్డులో భూములు కోల్పోయిన పోచంపల్లి మరియు వలిగొండ మండల రైతులతో కలెక్టర్ ఆఫీస్ లో ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రైతులు తమకు జరిగిన అన్యాయాని కలెక్టర్ కు విన్నవించడం జరిగింది. సరైన నష్టపరిహారం ఇవ్వకుండా పోచంపల్లి మండలంలో రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్నారు మాకు సరైన నష్టపరిహారం మరియు ఆర్బిట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేంత వరకు రోడ్డు నిర్మాణం పనులు ఆపాలని కలెక్టర్ ని కోరడం జరిగింది.ఈ విషయం పై ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ వారం లోపు ఆర్బిట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టి కలెక్టర్ గారు వచ్చిన తర్వాత గ్రామాల వారీగా రైతులను పిలిపించి నష్టపరిహారం పెంపు పై నిర్ణయం తీసుకుంటారని హామీ ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డు కు ఇచ్చిన పరిహారం కంటే ఎక్కువ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేయడం జరిగింది.

భూబాధితుల జాక్ కన్వీనర్ వారాల శేఖర్ రెడ్డి అఖిలపక్ష నాయకులు పాక మల్లేశ్ యాదవ్ ,సామ మధుసూదన్ రెడ్డి ,కోట రామచంద్ర రెడ్డి ,సామ రవీందర్ రెడ్డి ,సుర్కంటి వెంకట్ రెడ్డి తనేషా ,నోముల జంగా రెడ్డి ,ఇట్టమోని మహేశ్,మలిగ రవీందర్ , గూడూరు బుచ్చి రెడ్డి ,సుమారు 200 మంది రైతులు సరైన నష్టపరిహారం చెల్లించే వరకు e యొక్క ఆందోళన కార్యక్రమం విరమించేదిలేదని తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రాల నియామక ప్రక్రియ ధృవపత్రాల పరిశీలన



సిడిపిఓ రాధికా రెడ్డి

భూపాలపల్లి, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి) :

అంగన్‌వాడీ కేంద్రాల నియామక ప్రక్రియ ధృవపత్రాల పరిశీలన చేసినట్లు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మహాదేవపూర్ సిడిపిఓ రాధికా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మహదేవ్‌పూర్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల నియామక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు మొత్తం

180 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించగా, 117 మంది అభ్యర్థులు హాజరై తమ ధృవపత్రాల పరిశీలన చేయించుకున్నారు అని తెలిపారు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాలేకపోయిన మిగిలిన అభ్యర్థులు ఈనెల 24వ తేదీన హాజరై తమ ధృవపత్రాల పరిశీలన చేయించుకోవచ్చు అని అన్నారు అదేవిధంగా తాడిచర్ల1, తాడిచర్ల2, తాడిచర్ల4,తాడిచర్ల7 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన అభ్యర్థులు ఈనెల 22వ తేదీన హాజరై ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు సంబంధిత ధృవపత్రాల అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు అవసరమైన ఇతర సంబంధిత పత్రాలతో పరిశీలన చేయించుకోవలసిందిగా తెలియజేయడమైనది అభ్యర్థులందరూ నిర్ణీత సమయంలో తప్పనిసరిగా హాజరై సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకోవలసిందిగా కోరారు

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**ప్రజావాణి పోర్టల్‌లో ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి**
**ఈరోజు వచ్చిన దరఖాస్తులు 98**

సూర్యాపేట, సెప్టెంబర్ 21: వుదయం ప్రతినిధి

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి. జిల్లా, మండల స్థాయి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలి. పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్ ఉన్నవాటిపై ప్రత్యేక చొరవ చూపాలి. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి, లేనిపక్షంలో చర్యలు తప్పవు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలి. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు.

98 దరఖాస్తులు స్వీకరణ:

సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. వీటిలో భూ, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 56, డిపిఓ 4, డి డబ్ల్యు ఓ 7, మున్సిపల్ 4, ఆర్డీవో లు 6, మిగిలిన 21 వివిధ శాఖలకు చెందినవి. వీటిని పరిష్కారానికి శాఖల వారీగా పంపించడం జరిగిందన్నారు. అనంతరం కోదాడ జాబ్ మేళాలో పనిచేసిన అదనపు కలెక్టర్, డి ఆర్ డి ఓ, సీఈవో జెడ్పి, జిఎం ఇండస్ట్రీస్, డిపిఓ, డిపిఆర్ఓ, డి ఐ ఈ ఓ ఫైర్, ట్రాన్స్‌పోర్ట్, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో లు తదితర శాఖల అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డి ఆర్ డి ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డి ఆర్ డి ఏ పిడి సన్యాసయ్య, డి ఎం హెచ్ ఓ వెంకటరమణ, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డీఎస్ఓ మోహన్ బాబు, డి డబ్ల్యు ఓ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 243 దరఖాస్తులు




**సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి.**
**సంబంధిత శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం.**

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 21.

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వినతులు అందాయి. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, డీఆర్వో విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 243 దరఖాస్తులు అందగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 60, జీడబ్ల్యూఎంసీకి 84, హౌసింగ్ శాఖకు 35, ఇతర శాఖలకు సంబంధించి 64 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజలు తమ వినతులను అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గణేష్ మాట్లాడుతూ ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ, డీఆర్డీఓ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసి, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రజావాణి ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలకు సంబంధించిన వినతులను అధికారులకు సమర్పించారు.

## చెత్తను నాలుగు రకాలుగా విభజించి సేకరించే విధానాన్ని అమలు చేయాలి



**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి**

జయశంకర్ భూపాలపల్లి: సెప్టెంబర్ 21(వుదయం జిల్లా ప్రతినిధి):

జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో చెత్తను నాలుగు రకాలుగా విభజించి సేకరించే విధానాన్ని అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వేస్ట్ మేనేజ్మెంట్ పై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సెగ్రిగేషన్‌ను నాలుగు అంశాలుగా జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలని తెలిపారు. నివాసాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లో చెత్త సేకరణను సక్రమంగా వేరు చేయకపోవడంతో వ్యర్థాల నిర్వహణ, షెడ్లలో కంపోస్టు తయారీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇకపై చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి నిర్దేశిత డస్ట్‌బిన్లలో వేయాలని సూచించారు. పచ్చ డస్ట్‌బిన్ తడి చెత్త, జీవ వ్యర్థాలు. నీలం డస్ట్‌బిన్: పొడి చెత్త, పునర్వినియోగానికి పనికివచ్చే వ్యర్థాలు.ఎరుపు డస్ట్‌బిన్: శానిటరీ వ్యర్థాలు, ప్యాడ్లు, డైపర్లు తదితరాలు.నలుపు డస్ట్‌బిన్: ఆసుపత్రి వ్యర్థాల చెత్తను విభజించాలి అని తెలిపారు విద్యార్థులకు చెత్త విభజనపై అవగాహన కల్పించడంతో పాటు, వారి ద్వారా తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించేలా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచే చెత్తను వేరు చేసి ఇవ్వాలని అధికారులు సూచించారు. ఆసుపత్రుల నుంచి వెలువడే వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి, నిర్దేశిత ఏజెన్సీల ద్వారా సురక్షితంగా తరలించేలా చర్యలు తీసుకోనున్నారు. వైద్య వ్యర్థాలను సాధారణ చెత్త సేకరణ వాహనాల్లో తరలించరాదని స్పష్టం చేశారు. నాలుగు రకాల చెత్త విభజన విధానం అమలుపై ప్రతి మూడు నెలలకు నివేదికలు ఇవ్వాలని సూచించారు.ఈ సమావేశంలో డిఆర్వో వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి



ఉచిత స్క్రీనింగ్ శిబిరాలలో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేపించుకోవాలి
రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. అశోక్ కుమార్
జయశంకర్ భూపాలపల్లి: సెప్టెంబర్ 21 (వుదయం జిల్లా ప్రతినిధి)

జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న ఉచిత స్క్రీనింగ్ శిబిరాలలో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేపించుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో టిబి పరీక్షలు నిర్వహణ, అనంతరం వైద్య సేవలు తదితర అంశాలపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ లక్షణాలను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించడంతో వ్యాధి వ్యాప్తిని పూర్తిగా అరికట్టవచ్చని అన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, తెమడలో రక్తం పడటం, ఛాతీ నొప్పి, ఆయాసం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, త్వరగా అలసిపోవడం, మెడ లేదా ఇతర శరీర భాగాల్లో వాపులు, గడ్డలు ఏర్పడటం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని తక్షణమే పరీక్షలు చేపించుకోవాలని సూచించారు. శరీరంలోని పలు అవయవాలకు టీబీ సోకే అవకాశం ఉన్నందున అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తల వెంట్రుకలు, గోర్లు తప్ప శరీరంలోని ఏ అవయవానికైనా టిబి సోకే అవకాశం ఉందని నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా చికిత్స, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో ఎంపిడిఓ నోడల్ అధికారిగా, మై భారత్ వాలెంటీర్లు సభ్యులుగా ఉంటారని ముఖ్యంగా సంక్షేమ, పంచాయతీ, మున్సిపల్, డిఆర్డీఓ, విద్యా, కార్మిక శాఖల సహకారం చాలా అవసరమని తెలిపారు. క్యాంపు మోడులో జరుగుతున్న టిబి స్క్రీనింగ్ పరీక్షలను ప్రతి ఒక్కరూ పరీక్షలు చేపించుకుని టిబి రహిత సమాజానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇది ఒకరి నుండి ఒకరికి సోకే వ్యాధి అని ప్రారంభంలోనే గుర్తించి వైద్య సేవలు తీసుకోవడం వల్ల పూర్తిగా నివారించడానికి అవకాశం ఉందని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, ఆర్డిఓ హరికృష్ణ అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



**రాజన్నసిరిసిల్ల జిల్లా.**

గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 19 ఫిర్యాదులు స్వీకరణ-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే. ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 19 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.....ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.

## త్వరలో రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ _ 2

- ఓసి కిలో 58 లక్షల షావల యంత్రం ప్రారంభం
- మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ

**మంచిర్యాల /రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 21(వుదయం ప్రతినిధి)**

మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (ఆర్కేపీ ఓసీపీ)లో రూ.58 లక్షల వ్యయంతో నూతనంగా సమకూర్చిన షావల్ యంత్రాన్ని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై యంత్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మకమైన రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టును అతి త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు ప్రారంభానికి అవసరమైన ముందస్తు సన్నాహక పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన భూమిని సమన్వయం చేయడంతో పాటు డంప్ యార్డ్‌కు సంబంధించిన పనులను వేగవంతం చేసేందుకు నూతనంగా సమకూర్చిన షావల్ యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు వివరించారు. ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల నిర్వహణలో షావల్ యంత్రాలు అత్యంత కీలకమైనవని జీఎం తెలిపారు. బొగ్గు పొరపై పేరుకుపోయిన భారీ మట్టి, రాతి పొరలను తొలగించడం (ఓవర్ బర్డెన్)లో ఈ యంత్రం ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పారు. అలాగే తవ్విన మట్టి, బొగ్గును భారీ డంపర్లలోకి వేగంగా లోడ్ చేయడానికి కూడా షావల్ యంత్రం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఆర్కేపీ ఓసీపీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే ముందు చేపట్టాల్సిన వివిధ పనులకు ఈ యంత్రం ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా డంప్‌యార్డ్ ఏర్పాటుతో పాటు ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతాల్లో అవసరమైన భూమిని సిద్ధం చేయడం, మట్టి తరలింపు వంటి పనుల్లో యంత్రం సేవలను వినియోగించనున్నట్లు చెప్పారు. నూతన యంత్రం అందుబాటులోకి రావడంతో ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ఫేస్ 2 పనులు ప్రారంభానికి ముందుగా చేపట్టాల్సిన పనులపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, డంప్‌యార్డ్, భూమి సమన్వయం తదితర పనులను దశల వారీగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నూతన షావల్ యంత్రం అందుబాటులోకి రావడంతో సంబంధిత పనులను



నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు మరింత అవకాశం ఏర్పడిందన్నారు. భారీ స్థాయిలో మట్టి, రాతి పొరలను తొలగించాల్సిన సందర్భాల్లో యంత్రాల వినియోగం ద్వారా పనుల సామర్థ్యం పెరుగుతుందని అధికారులు వివరించారు. ఆర్కేపీ ఓసీపీ భవిష్యత్ కార్యకలాపాలకు అవసరమైన సన్నాహకాల్లో ఈ యంత్రం కీలకంగా ఉపయోగపడనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏరియా ఇంజనీర్ (ఈఅండ్ఎం) పరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్‌షాప్) సంపత్, సూపరింటెండింగ్ ఇంజనీర్ (సిహెచ్‌పీ) చంద్రమౌళి, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ హరి రామకృష్ణ తదితరులతో పాటు ఆర్కేపీ ఓసీపీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నూతన షావల్ యంత్రం ప్రారంభంతో ఆర్కేపీ ఓసీపీ ప్రాజెక్టు పనులకు మరింత ఊతం లభించనుందని అధికారులు,సిబ్బంది పేర్కొన్నారు.

## భద్రతా చర్యలు - పోలీస్ బందోబస్తు



- జిల్లా ఎస్పీ నితికా పంత్.

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వినాయక నిమజ్జన రూట్ మ్యాప్స్,నిమజ్జన పాయింట్లు,ఆయా ప్రాంతాల నుంచి నిమజ్జనానికి తరలించే వినాయక విగ్రహాల సంఖ్య తదితర వివరాలను పోలీస్ అధికారులు, సంబంధిత సిబ్బంది అడిగి తెలుసుకున్నారు.అలాగే నిమజ్జన పాయింట్ వద్ద ఏర్పాటు చేయాల్సిన బారికేడింగ్, లైటింగ్,ట్రాఫిక్ నియంత్రణ,పోలీస్ బందోబస్తు,క్రేన్లు,అత్యవసర సేవలు తదితర ఏర్పాట్లపై సమీక్షించారు.వినాయక మండపాల నిర్వాహకులు,ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా ఎస్పీ మాట్లాడి, నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు,అవసరాలు,ఎదురయ్యే సమస్యలు,వారి సూచనలను తెలుసుకున్నారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా పోలీస్ శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, వాహనాల రాకపోకల నియంత్రణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.నిమజ్జన ప్రాంతాల వద్ద విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని,ప్రజలు మరియు ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

## నీటిపారుదల భూసేకరణ పనులు వేగవంతం

**పెద్దపల్లి, సెప్టెంబర్-21 (వుదయం ప్రతినిధి)**

- రైతులతో సంప్రదింపులు జరిపి నిబంధనల ప్రకారం, మార్కెట్ విలువకు సమీపంగా పరిహారం అందించాలి
- నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, సీఎస్



రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలోని అన్ని నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం-పునరావాస పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్) పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు .ఈ సందర్భంగా

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,**

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులకు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. రులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు,

**అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు.**

కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో ఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని భూసేకరణ పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు.

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,**

ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు జారీ చేసిన తరువాత కూడా చాలా కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ,**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో అధిక మొత్తంలో పరిహారం కోరుతున్న కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**కరీంనగర్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):**

మానకొండూర్ చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం మానకొండూర్ చెరువు వద్ద వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్‌తోపాటు మానకొండూర్ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు మానకొండూర్ చెరువుకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువు పరిసరాల్లో కాంతివంతమైన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు, భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అవసరమైన క్రేన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచాలని తెలిపారు. భక్తులు, వాహనాల రాకపోకల హనాలను దారి మళ్లించాలని పోలీసు అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు.రెవెన్యూ, పోలీసు, ఫైర్, విద్యుత్, ఇరిగేషన్,మున్సిపల్, వైద్యఆరోగ్య తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి కోరారు.

ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బండి రాజేశ్వరి, ఎంపీడీవో వీవీ వరలక్ష్మి, తహసీల్దార్ విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి వర్షిణి, ఎంపీవో సంతోష్ రావు, సీఐ శ్రీలత, మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, రేవెల్లి రాజలింగం, కిషన్ రావు, బుర్ర శ్రీధర్ గౌడ్, రామడుగు హరీష్, మీస సత్యనారాయణ, బొల్ల మురళీధర్, గొల్లెన కొమురయ్య, బండి మల్లేషం, సాయిరి దేవయ్య, తాళ్లపల్లి నరేష్, కొండ్ర నరేష్, ఇర్ఫాన్, మాతంగి సహదేవ్, బొంగోని సునిల్, ఎన్. బాపురావు, గుడాల మహేందర్, జేడీ శ్యామ్, ఏగోళం శ్రీనివాస్ గౌడ్, డి.శ్రీనివాస్, బి.రమేష్, నల్ల సూర్య,ముక్కెర సతీష్ కుమార్, అంజయ్య, తమిశెట్టి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వయో వృద్ధుల చట్టం పై అవగాహన సదస్సు



**జగిత్యాల సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల పోషణ రక్షణ సంక్షేమ చట్టం పై జిల్లా డివిజన్ మండలాల గ్రామాల వివిధ సంఘాల ప్రతినిధులకు జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అవగాహన కల్పించారు సోమవారం టాస్క జిల్లా సమావేశ మందిరంలో జరిగిన ఈ సదస్సులో హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ 2016 లో రిటైర్డ్ రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారి పి నర్సింహారావు రాష్ట్ర అధ్యక్షులుగా అప్పటి ముఖ్య మంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన తెలంగాణ అల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ 10 ఏళ్లుగా 33 జిల్లాల్లో నిరాధరణ గురైన వృద్ధ తల్లిదండ్రుల కేసుల పరిష్కారం కు కృషి చేస్తున్నామన్నారు వచ్చే డిసెంబర్ 11న దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా ప్రత్యేకఅతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు హాజరు కానున్నారని పేర్కొన్నారు అనేక సందర్భాల్లో వృద్ధ తల్లిదండ్రుల కొడుకులకు కోడళ్ళకు కౌన్సిలింగ్ ఇస్తూ వారి కేసులు పరిష్కరిస్తున్నామన్నారు వారు బొద్దింకల స్ఫూర్తితో తాబేలు ఉద్యమం చేపడుతామని వెల్లడించారు .

ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి హన్మంత్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి మాజీ మున్సిపల్ చైర్మన్ జీఆర్ దేశాయ్ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం ఉపాధ్యక్షులు బొల్లం విజయ్ పూసాల అశోక్ రావు ఎండి యాకూబ్ కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జల బుచ్చిరెడ్డి ధర్మపురి అధ్యక్షులు కండ్ల గంగాధర్ రాయికల్ అధ్యక్షులు ఏనుగంటి రాములు జగిత్యాల పట్టణ అధ్యక్షులు మానాల కిషన్ మహిళా కార్యదర్శులు రాధ కరుణ విజయలక్ష్మి మహిళా జేఏసీ జిల్లా అధ్యక్షురాలు జలజ యువజన సంఘాల జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దొనూరి భూమాచారి తదితరులు పాల్గొన్నారు

## గణేష్ నిమజ్జన ఏర్పాట్ల సమావేశం



- సమావేశంలో పాల్గొన్న బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు

**నిర్మల్ జిల్లా 21 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**

నిర్మల్: నిర్మల్ పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సమావేశంలో బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేలా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గారు సూచించారు.నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు, పట్టణ బీజేపీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## రాయపట్నంలో వైభవంగా సత్యనారాయణ వ్రతాలు

**ధర్మపురి, సెప్టెంబర్ 21(వు దయం ప్రతినిధి):**

మండలంలోని రాయపట్నం గ్రామంలోని శివాలయం నందు గణపతి నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం భక్తిశ్రద్ధలతో సామూహిక సత్య నారాయణ వ్రతాలు నిర్వహించారు.గణపతి నవరాత్రుల సందర్భంగా ఆలయ ప్రాంగణ మంతా శివనామ స్మరణతో పాటు వినాయక నామస్మరణతో మార్మోగింది. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో గ్రామస్థులు,భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సాహం గా పాల్గొని సత్య నారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు.లోకకల్యాణం కోరుతూ నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో దంపతులు భక్తిభావంతో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రుల య్యారు. మంత్రి అడ్లూరి.లక్ష్మణ్ గణపతిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రం ఇచ్చి ఆశీర్వచనాలు అందజేశారు.వారి వెంట సర్పంచ్ రాందేని.మొగిలి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుముల.లక్ష్మణ్,కమిటీ సభ్యులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో





ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ మాట్లాడుతూ గణపతి నవరాత్రుల వేళ గ్రామం లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించ డం వల్ల ప్రజల మధ్య ఐక్యత, సుఖ శాంతులు వెల్లివిరుస్తాయని తెలిపా రు.ప్రధాన అర్చకులు సురేష్ శర్మ వేదమంత్రోచ్చారణలతో,శాస్త్రోక్తంగా వ్రత విధులను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు.

## విమానాశ్రయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):**

ఆదిలాబాద్ జిల్లాలో నూతనంగా ఏర్పాటవుతున్న జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్టుకు ఈ ప్రాంత ముద్దుబిడ్డ, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేత రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బాపూజీ 14వ వర్ధంతిని నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.తెలంగాణ రాష్ట్ర సాధనతోపాటు మలిదశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర విశిష్టమైనదని బేత రమేష్ పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా బాపూజీ ఆశయాలు పూర్తి స్థాయిలో నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా నూతనంగా నిర్మించే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఈ నెల 27న బాపూజీ జయంతి



సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అధికారిక ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు జక్కుల సత్యనారాయణ, ఆశమ్మ, అనుముల ఉషన్న, కుర్ర రవీందర్, అడెల్లు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథునికి 51 రకాల నైవేద్యాలు సమర్పించిన భక్తులు



**బెజ్జూర్ సెప్టెంబర్ 21 (వుదయం ప్ర తినిధి )**

: బెజ్జూర్ మండల కేంద్రంలోని గణనాథునికి మహిళలు 51 రకాల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ఏర్పాటు చేసిన గణనాథునికి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళలు 51 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగేడి పల్లి మహేష్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల/ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీలతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి నాగయ్య తన కుమారుడు తన భూమిలోకి రాకుండా అడ్డుకొని భయపెడుతున్నాడని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ



అర్జీ సమర్పించారు. క్యాతన ర్ధుల ప్రకారం సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం కవ్వాల్ గ్రామ సర్పంచ్ తమ గ్రామపంచాయతీలో స్థానికంగా లేని కొంతమంది వ్యక్తులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంపై తగు విచారణ జరిపి ఓటరు జాబితా ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన జి. శైలజ తాను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఫిజిక్స్ గెస్ట్ టీచర్ గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులను అడ్డుకున్న క్వార్టర్ నివాసితులు

- తహసీల్దార్ ఫిర్యాదుతో మాజీ డ్రైవర్ కుటుంబ సభ్యులపై కేసు నమోదు

**నిజాంసాగర్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి) :**

జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్‌వీ) నిజాంసాగర్‌లో గతంలో డ్రైవర్‌గా పనిచేసిన టి. మహేందర్‌కు కేటాయించిన క్వార్టర్‌ను బదిలీ అయినప్పటికీ గడువు ముగిసిన తర్వాత కూడా ఖాళీ చేయకపోవడంతో అధికారులు చర్యలు చేపట్టారు. సంబంధిత హైకోర్టు ఉత్తర్వులు, అధికారుల ఆదేశాల మేరకు సెప్టెంబర్ 19న నిజాంసాగర్ తహసీల్దార్ సాయి భుజంగారావు, రెవెన్యూ అధికారులు, జేఎన్‌వీ సిబ్బంది, పోలీసు సిబ్బందితో కలిసి క్వార్టర్ వద్దకు వెళ్లారు. నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అధికారులు క్వార్టర్‌ను ఖాళీ చేయించేందుకు వెళ్లగా, టి. మహేందర్ భార్య క్వార్టర్‌ను ఖాళీ చేయడానికి నిరాకరించడంతో పాటు అధికారులను విధులు నిర్వహించకుండా అడ్డుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అధికారులతో దుర్భాషలాడుతూ, తనకు తాను హాని చేసుకుంటానని బెదిరించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, ఆమె పెద్ద కుమారుడు ఫోన్ ద్వారా అధికారులతో బెదిరింపు ధోరణిలో మాట్లాడి, కోర్టు ధిక్కరణ కేసులు పెడతామని హెచ్చరించినట్లు ఎస్ఐ తెలిపారు. అధికారులు నోటీసు అందజేయడానికి ప్రయత్నించగా, దానిని స్వీకరించేందుకు కూడా నిరాకరించినట్లు చెప్పారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, అధికారులను బెదిరించడం తదితర అంశాలపై టి. మహేందర్, ఆయన భార్య, పెద్ద కుమారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిజాంసాగర్ తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు. దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్&ఆర్ పనులను వేగవంతం విచేయాలి



**మహబూబ్ నగర్**

నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్&ఆర్ పనులను వేగవంతం విచేయాలి :: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిరాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం-పునరావాస పునరుద్ధరణ (ఆర్&ఆర్) పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబ్ నగర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులకు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

2026-27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విడుదలైన నిధుల్లో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని అన్నారు.

జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. నిధులు సరిపోకపోయినా, ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోయినా ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

విడుదలైన నిధులను అధికారుల వద్ద ఉంచి పనులను పెండింగ్‌లో పెట్టవద్దని స్పష్టం చేశారు.భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని భూసేకరణ పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు.రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు జారీ చేసిన తరువాత కూడా చాలా కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,101 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,504 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో అధిక మొత్తంలో పరిహారం కోరుతున్న కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని,భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని శాఖల సిబ్బంది ఎఫ్ఆర్ఎస్‌లో తప్పనిసరిగా నమోదు కావాలి

- **వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరైన వారికే వేతనాలు : కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 21 (వుదయం బ్యూరో):**



జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)లో తప్పనిసరిగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. మండల, డివిజన్, క్లస్టర్, గ్రామ స్థాయిల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగిని ఎఫ్ఆర్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని, సిబ్బంది నమోదు ప్రక్రియను ఈ నెలలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సోమవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయంతో కలిసి ముఖ హాజరు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల సిబ్బంది హాజరు, వాస్తవ సిబ్బంది సంఖ్యను ఖచ్చితంగా నిర్ధారించేందుకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కొన్ని శాఖల్లో సిబ్బంది ఇంకా ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు కాలేదని గుర్తించినట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ నమోదును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

శాఖల వారీగా పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, ఎఫ్ఆర్ఎస్‌లో నమోదైన ఉద్యోగుల సంఖ్యను పరిశీలించి నమోదు కాని వారిని వెంటనే పరిధిలోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన తదితర శాఖలు ఇప్పటికే తమ శాఖలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ వ్యవస్థలను వినియోగిస్తున్నాయని, మిగిలిన శాఖల సిబ్బంది అందుబాటులో ఉన్న ఈఎస్‌పిఎస్ ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థను ఉపయోగించి హాజరు నమోదు చేయాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్ నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురైతే ఈడీఎంతో సమన్వయం చేసుకుని పరిష్కరించుకోవాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు, హాజరు విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి శాఖ అధికారి బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని మరింత కఠినంగా అమలు చేయనున్నామని, ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదయ్యే హాజరుకు అనుగుణంగా వేతన చెల్లింపులపై చర్యలు చేపడతామని తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## జగ్గారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి,నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి

- **చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**సంగారెడ్డి వుదయం**



సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిని జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నిర్మలా జగ్గారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా ఏడు సంవత్సరాలకు పైగా సుదీర్ఘకాలం పని చేశారని తెలిపారు. ఆమె హయాంలో జిల్లా కేంద్రంలో ఏ విధంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించామో, అంతకంటే ఎక్కువగా చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. చంద్రశేఖర్ రెడ్డికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని జగ్గారెడ్డి సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

**సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు: చంద్రశేఖర్ రెడ్డి**

నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తనను డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.నిర్మలా జగ్గారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, ఆమె మాదిరిగానే అందరితో సమన్వయం చేసుకుంటూ పార్టీ కోసం పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

**అధిష్టానానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్యే సంజీవరెడ్డి**

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. తన తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డిపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చంద్రశేఖర్ రెడ్డి ఎంపికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

## టీబీ రహిత జిల్లాగా నారాయణపేట ను తీర్చిదిద్దాలి

- **జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**

**నారాయణపేట సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వారికి సకాలంలో పరీక్షలు నిర్వహించి, సరైన వైద్య చికిత్స అందించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయడమే టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ఆధ్వర్యంలో పీహెచ్‌సీలు, ఎంపీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలలో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మండల స్థాయిలోనూ పరీక్షలు విస్తృతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 54,684 మందికి ఛాతీ పరీక్షలు, ఎక్స్‌రే స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు.ప్రత్యేకంగా ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కార్మికులను గుర్తించి, వారికి తప్పనిసరిగా టీబీ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వంద శాతం స్క్రీనింగ్ పూర్తి చేసి, టీబీ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో అవసరమైన వాలంటీర్లను ఏర్పాటు చేసి, ప్రజలకు టీబీపై అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులను గుర్తించి వైద్య పరీక్షలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వైద్య, పంచాయతీ రాజ్, విద్య, కార్మిక తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్ర మోహన్, జిల్లా టీబీ అధికారి, డీవైఎస్ఓ, డీఈఓ, డీపీఓ, జిల్లా కార్మిక అధికారి తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యుక్తితో, నేర్పుగా వ్యవహరించాలి

- **ఆతిథ్య ఉపన్యాసంలో భారత-పశ్చిమ ఆసియా విధానంపై కల్నల్ రాజీవ్ అగర్వాల్**

**పటాన్చెరు (వుదయం):**



పశ్చిమ ఆసియాతో భారతదేశానికి ఉన్న అనుబంధం ఈనాటిది కాదని, ఎన్నో అంశాలతో ముడిపడి ఉన్న ఈ బంధాన్ని యుక్తితో, నేర్పుగా వ్యవహరించాలని న్యూఢిల్లీకి చెందిన చింతన్ రీసెర్చ్ ఫౌండేషన్ సీనియర్ రీసెర్చ్ కన్సల్టెంట్, కల్నల్ రాజీవ్ అగర్వాల్ (రిటైర్డ్) అన్నారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కే.ఎస్.పీ.పీ)లో 'ప్రాంతీయ సంఘర్షణ, విచ్ఛిన్నత నేపథ్యంలో భారత పశ్చిమ ఆసియా విధానాన్ని పున:సమీక్షించడం' అనే అంశంపై ఆతిథ్య ఉపన్యాసం చేశారు.సాంప్రదాయ సంబంధాల నుంచి ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడి, రక్షణ, అనుసంధానం, భద్రత, ప్రజల మధ్య సంబంధాలను కలిగి ఉన్న బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్యానికి జరిగిన మార్పును ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశం, కీలక పశ్చిమ ఆసియా దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక ఏకీకరణను, అలాగే నిఘా సమాచార మార్పిడి, సైబర్ భద్రత, అంతరిక్షం, డ్రోన్లు, సముద్ర భద్రత వంటి రంగాలలో అభివృద్ధి చెందుతున్న సహకారాన్ని ఆయన పేర్కొన్నారు.హోర్ముజ్ జలసంధి యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను కల్నల్ అగర్వాల్ ప్రస్తావిస్తూ, ప్రపంచ ఇంధన సరఫరాలో దాని కీలక పాత్రను, అలాగే ముడి చమురు, ఎల్.ఎన్.జి., ఎల్.పి.జి. కోసం పశ్చిమ ఆసియాపై దేశం గణనీయంగా ఆధారపడి ఉన్నందున, భారతదేశానికి కూడా ఇది ఎంతో కీలకమన్నారు. ఇంధన స్థితిస్థాపకత, అనుసంధానాన్ని బలోపేతం చేస్తూనే, భారత ప్రవాసులు, నావికుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.ఈ ఉపన్యాస ముగింపులో, కల్నల్ అగర్వాల్ పశ్చిమ ఆసియాతో భారతదేశ సంబంధాల కోసం షీల్డ్ ("SHIELD") ఫ్రేమ్‌వర్కును ప్రతిపాదించారు. అవి: భద్రత, మానవత్వమే ప్రథమం, మౌలిక సదుపాయాలు, అనుసంధానం, ఇంధన భద్రత, ఎదురు దెబ్బలను తట్టుకునే శక్తి, వాణిజ్యం, పెట్టుబడుల ద్వారా అనుసంధానాలు, దౌత్యం, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిగా ఆయన విశదీకరించారు. ఈ ఉపన్యాసానికి కె.ఎస్.పి.పి., గీతం విద్యార్థులతో పాటు కె.ఎస్.పి.పి. డీన్, మాజీ దౌత్యవేత్త సయ్యద్ అక్బరుద్దీన్ కూడా హాజరయ్యారు.

**గీతంలో జాతీయ పోషకాహార వారోత్సవాలు**

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ (జీఎస్ఎస్) హైదరాబాదులోని లైఫ్ సైన్స్ విభాగం 'ఆహార శుద్ధి సాంకేతికతల ద్వారా పోషకాహార భవిష్యత్తును తీర్చిదిద్దడం' అనే ఇతివృత్తంతో 'ఫుడ్ టెక్నో ఫెస్ట్ 2026'తో జాతీయ పోషకాహార వారోత్సవాలను జరుపుకుంది.

ఈ కార్యక్రమంలో, మైసూరులోని సీఎస్ఐఆర్‌సీఎఫ్టీఆర్ఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణ సింగ్, 'ఆహార శుద్ధి ద్వారా ప్రపంచ పోషకాహార అవసరాలను తీర్చడం' అనే అంశంపై ప్రసంగించారు. సమతుల్య పోషకాహారం, బాధ్యతాయుతమైన ఫుడ్ ప్రాసెసింగ్, ఆహార నిల్వ, ప్రత్యామ్నాయ ప్రోటీన్లు, విలువ జోడింపు, జీర్ణ వ్యవస్థ పనితీరు (గట్ హెల్త్) ప్రాముఖ్యతలను ఆమె వివరించారు. ఆహార నష్టాన్ని తగ్గించడానికి, ప్రపంచ పోషకాహార సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న ఆహార సాంకేతికతల సామర్థ్యాన్ని వివరించారు. హైదరాబాదులోని MANE టెక్నికల్ డైరెక్టర్ (పరిశోధన, అభివృద్ధి) దేబాశిష్ మొహంతి, 'వినియోగదారుల ఆధారిత ఉత్పత్తి వ్యూహాలు - విభజన, ప్రాధాన్యత విశ్లేషణ' అనే అంశంపై ప్రసంగించారు. వినియోగదారుల అంతర్దృష్టులు, ప్రాధాన్యతల విశ్లేషణ, విభజన, ఉత్పత్తి ధ్రువీకరణ అనేవి సందర్భోచితమైన, సుస్థిరమైన, వాణిజ్యపరంగా విజయవంతమైన ఆహార ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి ఎలా సహాయపడతాయో విడమరచి చెప్పారు.

తొలుత, గీతం విశిష్ట ఆచార్యుడు డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ స్వాగతోపన్యాసం చేసి, ఈ కార్యక్రమానికి నాంది పలికారు. జీఎస్ఎస్ విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్లు, నమూనాల తయారీ, వినూత్న ఆహార ఉత్పత్తి అభివృద్ధి పోటీల ద్వారా తమ సృజనాత్మకతను, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. తద్వారా ఆహార శాస్త్రం, వ్యవస్థాపకతలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, అవకాశాలపై ఆచరణాత్మక అవగాహన పొందారు. ఈ కార్యక్రమాన్ని కన్వీనర్ డాక్టర్ జి. నిహారిక, కోకన్వీనర్ డాక్టర్ ఎం. సురేంద్ర బాబు పర్యవేక్షణలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులు సమన్వయం చేశారు.


## వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు

**మహబూబ్ నగర్**



కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, మహబూబ్ నగర్ గారి ఆదేశానుసారము, జిల్లా వైద్యారోగ్య శాఖ నందు వివిధ విభాగలలో ఖాళీలు కలిగిన ఉద్యోగాలను ఒక సంవత్సరం కొరకు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయుటకు ప్రకటన జరిచేయడం జరిగింది. కావున అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తూ చేసుకొనుటకు మరియు ఇతర వివరాల కొరకు (https://mahabubngar.telangana.gov.in) వెబ్ సైట్ నందు పందుపర్చడమైనది. జిల్లా వైద్యారోగ్య karyalayam(IDOC), 2nd ఫ్లోర్, రూమ్ No.201,పాల్కొండ, మహబూబ్ నగర్ యందు దరఖాస్తూvu చేసుకొనుటకు తేది:22.09.2026 నుండి 26.09.2026 సాయంత్రం 5గంటల వరకు(అన్ని రోజులలో ) దరఖాస్థులు స్వీకరిచబడును.

## ఎస్ఐఆర్–2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి






- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**

**సిద్దిపేట, సెప్టెంబర్ 21 (వుదయం బ్యూరో)**

ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్-2026 కార్యక్రమంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సమీక్షలో సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఫారం6, ఫారం7, ఫారం8 దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి పెరగాలని, చివరి నిమిషం వరకు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. నోటీసులు జారీ చేయడం, డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించడం వంటి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి వారి పనితీరును పర్యవేక్షించాలని, ఎస్ఐఆర్-2026 పనులన్నింటినీ అక్టోబర్ 25 (25102026) లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చివరి 10 రోజులను ఆఖరి క్షణంలో వచ్చే సవరణల కోసం కేటాయించుకోవాలన్నారు. ఫారం6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని, ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. బీఎల్ఏల ద్వారా నోటీసులు పంపిణీ చేస్తే సంబంధిత బీఎల్ఓలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరఫున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హైమావతి మాట్లాడుతూ... సిద్దిపేట జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం6, ఫారం7, ఫారం8 దరఖాస్తులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. సీఈవో సూచించిన అక్టోబర్ 25 గడువును దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని, చివరి దశలో పనులు పేరుకుపోకుండా ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాలని తెలిపారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియను పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.




## ఎస్ ఐ ఆర్ పెండింగ్ హియరింగ్‌స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

**వనపర్తి సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి)**

ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్ హియరింగ్‌స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులకు(నో మాపింగ్, అనామోలీస్) సంబంధించిన పెండింగ్ హియరింగ్‌స్‌ను త్వరితగతిన పూర్తి చేసి, అర్హత కలిగిన ఓటర్ల వివరాలను తుది ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న SIR ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో SIR ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న హియరింగ్స్ వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరుకు సంబంధించిన విచారణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. విచారణకు హాజరైన ఓటర్ల నుంచి అవసరమైన పత్రాలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వివరాలను సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.అన్ని వివరాలు సక్రమంగా ఉన్న(అదర్స్ కేటగిరి) ఓటర్లకు సంబంధించి దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి తుది ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు.


అదేవిధంగా, ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో స్వీకరించిన ఫారం6, ఫారం7, ఫారం8 దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం6, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించిన ఫారం7, ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలకు సంబంధించిన ఫారం8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, ఎలాంటి పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు.

సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామిని పూజించడం అశేష ఫలితాలను పొందుతారు

- **శ్రీ చాకరిమెట్ల ఆలయ చైర్మన్ ప్రసన్న ఆంజనేయ శర్మ.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 21.....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టుక్ల గ్రామ పరిధిలోని దట్టమైన అడవి ఎత్తైన కొండలు చక్కటి వాతావరణం పక్కనే నర్సాపూర్ తూప్రాన్ ప్రధాన రహదారి అనుకొని స్వయంభుగా వెలసిన శ్రీ సహకార ఆంజనేయ స్వామినికి నేడు భాద్రపద మాసం మంగళవారం పురస్కరించుకొని చేయవలసిన పూజల గురించి వేద పండితులు శ్రీ చాకలిమెట్ల ఆలయ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ ప్రసన్న ఆంజనేయ శర్మ ఇలా వివరించారు.హిందూ సంప్రదాయంలో భాద్రపద మాసం మంగళవారం ఆంజనేయ స్వామిని పూజించడానికి అత్యంత విశిష్టమైన రోజు. ఈ మాసంలో వచ్చే మంగళవారాల్లో వాయుపుత్రుడిని ఆరాధించడం వల్ల కుజదోషాలు, శనిదోషాలు తొలగిపోవడమే కాకుండా, ధైర్యం, ఆయురారోగ్యాలు మరియు అప్పుల బాధల నుండి విముక్తి లభిస్తుందని నమ్ముతారు. స్వామి వారి అనుగ్రహం కోసం ఇంట్లో లేదా ఆలయంలో చేయవలసిన ప్రత్యేక పూజా విధానం మరియు నివేదించాల్సిన నైవేద్యాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

**పూజకు ముందస్తు సిద్ధాంతాలు**

సమయం: వీలైతే సూర్యోదయానికి ముందే (బ్రహ్మ ముహూర్తంలో) నిద్ర లేచి, శుచిగా స్నానం ఆచరించాలి.
దుస్తులు: పూజ చేసే సమయంలో ఎరుపు లేదా నారింజ (కేసరి) రంగు దుస్తులు ధరించడం హనుమంతునికి ఎంతో ప్రీతికరం.

**నియమాలు: ఈ రోజున వి పూర్తిగా ఉపవాసం**

ఉండటం లేదా కేవలం శాకాహార భోజనం మాత్రమే తీసుకోవడం చేయాలి. మద్యపాన, మాంసాహారాలకు ఖచ్చితంగా దూరంగా ఉండాలి.

**ప్రత్యేక పూజ విధానం.**

ఆంజనేయ స్వామి విగ్రహం లేదా పటం ముందు ఆవు నెయ్యి లేదా నువ్వుల నూనెతో దీపం వెలిగించాలి. స్వామివారికి ఎరుపు రంగు పువ్వులు మందారాలు లేదా గులాబీ దండలను సమర్పించాలి. ఆంజనేయ స్వామికి అత్యంత ప్రీతికరమైన తమలపాకుల పూజ చేయడం వల్ల కార్యసిద్ధి కలుగుతుంది. అలాగే స్వామివారికి సింధూరం మరియు జాస్మిన్ మల్లె నూనె సమర్పించడం వల్ల జాతక దోషాలు తొలగిపోతాయి. పూజా సమయంలో కుదురుగా కూర్చుని ఒకటి నుండి మూడుసార్లు హనుమాన్ చాలీసా పఠించాలి. వీలైతే సుందరకాండలోని కొన్ని శ్లోకాలు లేదా హనుమాన్ దండకం పఠించడం వల్ల విశేష ఫలితాలు ఉంటాయి. భాద్రపద మంగళవారం నాడు ఆంజనేయస్వామికి మీ శక్తి కొలది మినపపప్పుతో చేసిన వడలను మాలగా చేసి స్వామి వారికి వేయడం. 5 అరటి పనులను మరియు చిన్న బెల్లం ముక్కను నైవేద్యంగా పెట్టడం చాలా సులువైన మరియు ప్రీతికరమైన మార్గం. జాతకములో శని ప్రభావం లేదా కుజదోషం అంగాకర దోషం ఉన్నవారు ఈరోజు సాయంత్రం సమీపంలోని హనుమాన్ ఆలయానికి వెళ్లి ఐదు ప్రదక్షిణలు చేసి ఆవనూనె లేదా నెయ్యి దీపం వెలిగించి రావడం వల్ల పీడలు తొలగిపోయి ప్రశాంతత లభిస్తుంది అని వారు చక్కగా వివరించారు.

## పిడుగుపాటుకు రైతుకు తీవ్ర గాయాలు.. ఎద్దు మృతి

- **అకాల వర్షా లతో తాండూరు మండలంలో ఘటన.. ఆందోళనలో రైతులు**

**తాండూరు సెప్టెంబర్ 21 వుదయం ప్రతినిధి**



తాండూరు మండల పరిధిలో సోమవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షాలతో పిడుగుపాటు సంభవించి ఓ రైతుకు తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. మరోచోట పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. తాండూరు మండలం చంద్రవంచ గ్రామానికి చెందిన జ్ఞానంకాడి నాగప్ప తనకు చెందిన ఎద్దులను వ్యవసాయ భూముల్లో మేపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం అకాల వర్షాలు కురవడంతో పిడుగుపాటుకు గురై నాగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అదేవిధంగా మిట్టబాసుపల్లి గ్రామానికి చెందిన అమృతప్ప కు చెందిన ఎద్దు కూడా పిడుగుపాటుకు గురై మృతి చెందింది. సుమారు రూ.40 వేల విలువైన ఎద్దు మృతి చెందడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్నామని, పశువు మృతి చెందడంతో మరింత నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేశాడు.ప్రభుత్వ అధికారులు స్పందించి పిడుగుపాటు ఘటనలో గాయపడిన రైతుకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, మృతి చెందిన ఎద్దుకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**నర్సంపేట మున్సిపల్ చైర్మన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్.**

**నర్సంపేట వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 21.**



వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని నర్సంపేట మున్సిపల్ చైర్మన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ సూచించారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ అధికారుల సూచనలు, భద్రతా నిబంధనలు పాటించాలని ఆమె కోరారు. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 23న నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ప్రజల భద్రతకు మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్య చర్యలు, రహదారుల శుభ్రత, విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ప్రజలు నిమజ్జనానికి వెళ్లే సమయంలో చిన్నారులు, వృద్ధులు, మహిళల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, చెరువులు, నీటి ప్రాంతాల్లో ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని చైర్మన్ సూచించారు. ఈత రాని వారు నీటిలోకి దిగకూడదని, పిల్లలను ఒంటరిగా నీటి సమీపానికి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా నిమజ్జన ఊరేగింపులో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు, మున్సిపల్ అధికారులు సూచించిన మార్గాల్లోనే విగ్రహాలను తరలించాలని కోరారు. డీజేలు, భారీ శబ్దాలతో ఇతరులకు ఇబ్బంది కలగకుండా నిబంధనలను పాటించాలని, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణనాథుడి నిమజ్జనం భక్తి, ఆనందంతో జరుపుకునే పండుగగా నిలవాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా పూర్తి చేయాలని పెండెం శ్రీలక్ష్మి రామానంద్ ఆకాంక్షించారు. ప్రజలు మున్సిపల్ అధికారులు, పోలీసుల సూచనలకు సహకరించి నర్సంపేటలో వినాయక నిమజ్జనాన్ని సురక్షితంగా, విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

## చౌటపల్లి పీఏసీఎస్‌కు నూతన పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ

**పి ఐ సి కమిటీ చైర్మన్‌గా అత్తి కుమారస్వామి నియామకం**

**పర్వతగిరి , సెప్టెంబర్ 21 ( వుదయం ప్రతినిధి ):**



వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం, చౌటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం నూతన నాన్‌అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ (పీఐసీ) కమిటీని నియమించింది. తెలంగాణ సహకార సంఘాల చట్టం-1964లోని సెక్షన్ 32(7)(a) ప్రకారం ఈ నియామకం చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతన పీఐసీ కమిటీ చైర్మన్‌గా అత్తి కుమారస్వామి నియమితులయ్యారు. డైరెక్టర్లుగా మాసాని యాకూబ్, పల్లెపాటి రామచంద్రరావు, ఓరుగంటి శ్రీనివాస్, గడ్డం శంకరయ్య, ముక్కెర నర్సమ్మ, పెరుమాల దేవేందర్, లింగంపల్లి కుమార్, చౌద రాఘవులు, బానోతు రవి, కందుల లావణ్య, బేతన్ కుమార్ స్వామి, గరికపాటి రామారావులను నియమించారు.

నూతన కమిటీ ఆరు నెలల పాటు లేదా సొసైటీకి సాధారణ ఎన్నికలు జరిగే వరకు లేదా ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు—ఏది ముందైతే అది వరకు కొనసాగనుంది. పీఏసీఎస్ పరిధిలోని రైతులకు ఎరువుల పంపిణీ, వ్యవసాయ రుణాలు, ధాన్యం కొనుగోలు తదితర సేవల్లో అంతరాయం కలగకుండా సొసైటీ రోజువారీ కార్యకలాపాలను నిర్వహించేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. చౌటపల్లి పీఏసీఎస్ వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో రైతులకు సేవలు అందిస్తోంది. నూతన కమిటీ నియామకంతో సొసైటీ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని స్థానికులు పేర్కొన్నారు.

## హసన్ పర్తి పిఎసిఎస్ చైర్మన్ గా పింగిళి వెంకట్రామ్ నరసింహా రెడ్డి

**హసన్ పర్తి సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):**

హనుమ కొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ నూతన చైర్మన్ గా పింగళి వెంకట్రామ్ నర్సింహ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిసి అధ్యక్షుడు పింగళి వెంకటరామ్ రెడ్డి, హాజరై మాట్లాడుతూ, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రైతు పక్షపాత ప్రభుత్వమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతు సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని వ్యవసాయ రంగంలో సహకార సంఘాల పాత్ర అత్యంత కీలకమైనదని నూతనంగా ఎన్నికైన చైర్మన్ పింగిలి వెంకట్రాం నరసింహా రెడ్డి నేతృత్వంలోని పాలకవర్గం హసన్ పర్తి పరిధిలోని ప్రతి రైతుకు సకాలంలో రుణాలు ఎరువులు అందేలా చూస్తూ రైతులకు నమ్మకమైన వేదికగా నిలవాలని క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ గ్రీన్ మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక మాట్లాడుతూ..., పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించి మార్కెట్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు జరపడమే లక్ష్యంగా హసన్ పర్తి పిఎసిఎస్ నూతన పాలకవర్గం గ్రీన్ మార్కెట్ కమిటీతో సమన్వయం చేసుకుంటూ స్థానిక రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ రైతుల ముఖాల్లో ఆనందం కలగజేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల ప్రోత్సాహకాలను నూతన కమిటీ క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.



అనంతరం చైర్మన్ పింగిలి వెంకట్ రామ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ..., రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు, ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం ఒక గొప్ప బాధ్యత అని ఆయన అన్నారు. రైతుల సంక్షేమమే సొసైటీ అభివృద్ధి, ప్రజల సమస్యల కోసం చిత్తశుద్ధితో పని చేస్తానని అన్నారు.

పిఎసిఎస్ ద్వారా రైతులకు అందాల్సిన సేవలు మరింత పారదర్శకంగా సమర్థవంతంగా అందేలా కృషి చేస్తానని అలాగే ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను విని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు అనేవి గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు నేరుగా సేవలు అందించే అత్యంత కీలకమైన సహకార సంస్థలు ఒక రైతుకు విత్తనం వేసే దగ్గర నుండి పంటను అమ్ముకునే వరకు, గ్రామీణ ప్రజల అత్యవసర ఆర్థిక అవసరాలకు పిఎసిఎస్ ఒక సెంటర్‌గా ఉపయోగపడుతుందని, మీ అందరి సహకారం, సూచనలు, ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నానని తెలిపారు. డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన రామంచ ప్రభాకర్, గోలి వెంకటరంగా రెడ్డి, వట్టే శ్రీనివాస్ రెడ్డి, వెన్నపు రెడ్డి రాయప్ రెడ్డి, గడ్డం శ్రీధర్, నేదునూరి రాధమ్మ, జనగాని నవీన్ కుమార్, సాయిని రామరాజు, జనగాని దయాకర్, గొర్రె మల్లికాంబ, బిగుల్లా లింగయ్య, పాలకుర్తి రాములు కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హసన్ పర్తి మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## పర్వ త గిరి ఏసీఎస్ పాలకవర్గం రద్దు

**నూతన PIC కమిటీ ఏర్పాటు..**

**గురువారం ప్రమాణస్వీకారం**

**ఛైర్‌పర్సన్‌గా పిన్నింటి అనిల్‌రావు**

**పర్వతగిరి, సెప్టెంబర్ 21 ( వుదయం ప్రతినిధి ):**



పర్వతగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (PACS) పాత పాలకవర్గాన్ని తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. సొసైటీ నిర్వహణలో పరిపాలనా లోపాలు, రుణాల వసూళ్లలో నిర్లక్ష్యం తదితర అంశాలపై నిర్వహించిన విచారణ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు G.O.Rt.No.522, ద్వారా 13 మంది సభ్యులతో కూడిన నూతన ప్రత్యామ్నాయ నాన్‌అఫీషియల్ పర్సన్ ఇన్ ఛార్జ్ (PIC) కమిటీని నియమించింది. సహకార సంఘాల చట్టం1964లోని సెక్షన్ 32(7)(a) ప్రకారం నూతన కమిటీ ఆరు నెలల పాటు లేదా తదుపరి పాలకవర్గ ఎన్నికలు జరిగే వరకు బాధ్యతలు నిర్వహించనుంది. రైతుల నుంచి రాబట్టాల్సిన బకాయిలను వసూలు చేయకపోవడం, డిఫాల్టర్ల జాబితా రూపొందించి ప్రచురించడంలో వైఫల్యం, సొసైటీ అధ్యక్షుడు స్వయంగా యస్‌ఏఓ రుణం చెల్లించకుండా డిఫాల్టర్‌గా మారడం, డిఫాల్టర్ల నుంచి నిధుల రికవరీలో వైఫల్యం వంటి అంశాలను విచారణలో గుర్తించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నూతన PIC కమిటీ

కల్లెడ పిఏసియస్ ఛైర్‌పర్సన్ గా పిన్నింటి అనిల్‌రావు సభ్యులుగా ఏలికట్టే వెంకటేశ్వర్లు, నరెడ్ల సూరయ్య,ముదురుకోళ్ల లక్ష్మి, ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, మోటపోతుల సుదర్శనం,నీలం శ్రీనివాస్,ఆబర్ల రవి,బొబ్బాల లింగారెడ్డి,బొట్ల మహేంద్ర,కత్తుల శ్రీనివాస్,దారవత్ సేత్ రామ్, గుగులోతు సుధాకర్ లు నియమితులైయ్యారు. నూతన కమిటీకి పర్వతగిరి PACS పరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఉత్తర్వుల ప్రతులను జిల్లా సహకార అధికారి (DCO) ద్వారా సంబంధిత అధికారులు, నూతన కమిటీ సభ్యులకు అందజేశారు. నూతన ఛైర్‌పర్సన్ పిన్నింటి అనిల్‌రావు మాట్లాడుతూ... రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం రైతులకు,ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం ఒక గొప్ప బాధ్యత అని ఆయన అన్నారు.రైతుల సంక్షేమమే సొసైటీ అభివృద్ధి ప్రజల సమస్యల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని అన్నారు.

పిఎసిఎస్ ద్వారా రైతులకు అందాల్సిన సేవలు మరింత పారదర్శకంగా సమర్థవంతంగా అందేలా కృషి చేస్తానని అలాగే ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను విని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు అనేవి గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు నేరుగా సేవలు అందించే అత్యంత కీలకమైన సహకార సంస్థలు ఒక రైతుకు విత్తనం వేసే దగ్గర నుండి పంటను అమ్ముకునే వరకు, గ్రామీణ ప్రజల అత్యవసర ఆర్థిక అవసరాలకు పి ఎ సి ఎస్ ఒక సెంటర్‌గా ఉపయోగపడుతుది.మీ అందరి సహకారం,సూచనలు,ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్ధన్నపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నానని పిన్నింటి అనిల్ రావు తెలిపారు,

## భక్తిశ్రద్ధలతో మహా అన్నదాన కార్యక్రమం

**ప్రారంభించిన లక్ష్మీ నరసింహ బిల్డింగ్ మెటీరియల్స్ నిర్వాహకులు**

**కాజీపేట (వుదయం ప్రతినిధి):**

హన్మకొండ మండలం 49వ డివిజన్ ప్రకాష్‌రెడ్డిపేట దర్గా రోడ్డులో మహా అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన 'లక్ష్మీ నరసింహ బిల్డింగ్ మెటీరియల్స్' నిర్వాహకులు అన్నదానాన్ని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "మానవ సేవే మాధవ సేవ"అనే ఉన్నతమైన నినాదంతో ప్రకాష్‌రెడ్డిపేట ప్రజలు, స్థానిక యువత అందరూ కలిసికట్టుగా ఈ భారీ అన్నదానాన్ని విజయవంతం చేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. సమాజంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సోదరభావం పెంపొందుతుందని పేర్కొన్నారు.

నిర్వాహకులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడంతో భక్తులందరూ ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## మండలం గ్రామ అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం

**ధర్మసాగర్ సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):**

ఈరోజు ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్ నిర్వహించిన ధర్మసాగర్ మండల, గ్రామ, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం మరియు మండల విస్తృత స్థాయి సమావేశానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ధర్మసాగర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మండల పార్టీ కార్యాలయాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన మండల కమిటీ కార్యవర్గ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులను శాలువాలతో సత్కరించి కొత్తగా మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ సారథులుగా ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... మనందరి ఏకైక ఎజెండా అభివృద్ధి, సంక్షేమ పథకాలను పేద ప్రజలకు చేర్చడం, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మనతో కలిసి రావడానికి ఇష్టంగా ఉన్న ఇతర పార్టీల నాయకులను పార్టీలోకి ఆహ్వానించాలని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల మధ్యలో ఉంటూ పార్టీ కోసం పని చేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ



జెండా ఎగిరే విధంగా మనందరం కలిసి కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. ఏ కార్యకర్తకు ఏ అవసరం ఉన్నా నేరుగా నన్ను కలువవచ్చని, మీ పనిలో న్యాయం ఉంటే తప్పకుండా చేసేందుకు పూర్తి స్థాయిలో ప్రయత్నిస్తానని వెల్లడించారు. నియోజకవర్గంలో ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి రావాలి, రేవంత్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని అందుకు ప్రతీ కార్యకర్త కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఓర్వలేక పోతున్నాయని ఆరోపించారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసే దాడిని గట్టిగా తిప్పికొట్టాలని సూచించారు. బీజేపీ ప్రభుత్వం 12ఏళ్లలో తెలంగాణకు ఏం ఇచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక 1000 కోట్ల ప్రాజెక్టు ఇవ్వలేదని, ఒక జాతీయ సంస్థను మంజూరు చేయలేదని అన్నారు. కులతత్వ, మతతత్వ రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెట్టడం తప్ప పేద ప్రజల సంక్షేమాన్ని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోడీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీజేపీకి ప్రజలపై, రాజ్యాంగంపై నమ్మకం లేదని, దళితులు, మైనారిటీలు, పేద ప్రజలు అంటే గిట్టదని అన్నారు. బీజేపీ నాలుగవసారి అధికారంలోకి రావాలని చూస్తోందని, బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే మన హక్కులు పోతాయని అన్నారు. భారత దేశ మనుగడకు, రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీని బలపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై పని గట్టుకొని విష ప్రచారాలు చేస్తున్నాయని బిఆర్ఎస్, బీజేపీల దాడిని తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. అందుకు మనమందరం కలిసి కట్టుగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ డిసిసి అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెసరు రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

**ధర్మసాగర్, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):**

ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిపేట గ్రామ శివారులో, వేలేరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మూరావత్ లక్ష్మణ్ నాయక్ పై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు మీడియాకు విడుదల చేశారు. పాత కక్షలు మరియు రాజకీయ విభేదాల నేపథ్యంలో పథకం ప్రకారం ఇనుప రాడ్డుతో దాడి చేసి హత్య చేయడానికి యత్నించడం.వేలేరు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూరావత్ లక్ష్మణ్ నాయక్ పై రాజకీయ ఎదుగుదల, పార్టీ పదవులు మరియు ఎస్సీ, ఎస్టీ కేసు విషయాల పట్ల పగ పెంచుకున్న ప్రధాన నిందితుడు ఎండి సద్దాం హుస్సేన్ అతడిని అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నాడు. ఇందులో భాగంగా బైరి అనిల్, అందె కృపాసాగర్, కురసపల్లి హరీష్‌లతో కలిసి లక్ష్మణ్ నాయక్‌పై హత్యాయయత్నానికి



కుట్ర పన్నారు.పథకం ప్రకారం, సెప్టెంబర్ 17న హనుమకొండ నుండి ద్విచక్ర వాహనంపై వేలేరుకు వస్తున్న లక్ష్మణ్ నాయక్‌ను సాయిపేట శివారులో కాపుకాచి మోటర్ సైకిల్‌పై వెంబడించి వెనుకనుండి తలపై ఇనుప రాడ్డుతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. బాధితుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో సి ఆర్. నంబర్ 249/2026, యు/సెక్షన్ 109 బి ఎన్ ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అరెస్ట్ చేయబడిన నిందితులు: ఎ1 ఎండి. సద్దాం హుస్సేన్ (36), తండ్రి: రాజ్ మహమ్మద్, వృత్తి: వ్యాపారం, R/o వేలేరు గ్రామం & మండలం, హన్మకొండ జిల్లా. ఎ2 బైరి అనిల్ (36), తండ్రి: మొగిలి, వృత్తి: చికెన్ షాప్, R/o వేలేరు గ్రామం & మండలం, హన్మకొండ జిల్లా. ఎ3 అందె కృపాసాగర్ (27), తండ్రి: విద్యసాగర్‌ఉ,ప్పరపల్లి (వేలేరు శివారు), హన్మకొండ జిల్లా.

ఎ4 కురసపల్లి హరీష్ (22), తండ్రి: ఎల్లయ్య, (వేలేరు శివారు), హన్మకొండ జిల్లా. పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి నిందితులు నలుగురిని ఈరోజు అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన ఆధారాలను సేకరించడం జరిగింది. చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ట్రస్ట్ చే ఆయుర్వేదం దినోత్సవం సందర్భంగా సన్మానం

**వరంగల్ టౌన్, సెప్టెంబర్21(వుదయం విలేకరి):**

రామన్నపేట లోని డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ వెలాసిటీ నాగేందర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్ తర్వాత మన వరంగల్లో ప్రాచుర్యం పొందిన ఆయుర్వేదిక్ హాస్పిటల్ సూపర్నెంట్ గారైన ధర్మరాజును ఘనంగా శాలువా మరియు బొకేతో సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతంలో కన్నా ఇప్పుడు అన్ని రకాల మందులు ప్రజలకు అందుబాటులో ఉంచు వారి యొక్క సేవను గుర్తిస్తూ ఈ సన్మానం చేయడం జరిగినది అన్నారు. ఇంకా ప్రజలకు అందుబాటులో మీ సేవలు అందుబాటులో ఉంచుతూ అందరి మన్ననలను పొందాలని అన్నారు. అలాగే ఆయుర్వేదం పై



మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంతో శ్రద్ధగా చూస్తూ అభివృద్ధి చేయాలని చేస్తున్న కృషిని అభినందనీయమైనది అన్నారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా అలోపతికి వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి కానీ ఆయుర్వేదం ద్వారా ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్స్ ఉందని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేదం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చు అని అన్నారు. సూపర్డెంట్ ధర్మరాజు మాట్లాడుతూ ఈరోజు మమ్ములను సన్మానించడం మా పై గురుతర బాధ్యత, ఆయుర్వేదన అభివృద్ధి చెందడంలో ప్రోత్సహించడంలో ముందుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజ్ ట్రస్టీ డాక్టర్. ఏ .రాజేంద్రప్రసాద్ తో పాటు ఆర్గనైజర్ శ్రవణ్, నల్ల సత్యనారాయణ, పి .రాజు ఆఫీస్ సూపర్డెంట్, దేవిక మరియు ఆఫీస్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ ప్రపంచంలో వేగం కంటే అప్రమత్తత ముఖ్యం

**సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు**

**భూపాలపల్లి: సెప్టెంబర్ 21(వుదయం విలేకరి):**

మహాదేవపూర్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జన్ను విజయకుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజు, మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజు మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్ ద్వారా ఓటీపీ , ఎటిఎం పిన్ , యూపీఐ, పిన్, పాస్‌వర్డ్ లేదా ఇతర వ్యక్తిగత వివరాలను అడగరని తెలిపారు. ఎవరైనా ఫోన్ చేసి ఇటువంటి వివరాలను అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. అలాగే జిమెయిల్ ,వాట్సాప్,సోషల్ మీడియా ఖాతాలకు (2FA) తప్పనిసరిగా యాక్టివేట్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులను ఉద్దేశించి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతూ,సాంకేతికత మనకు శక్తి అప్రమత్తత మనకు రక్షణ అని అన్నారు. ఉచిత ఆఫర్లు, లాటరీలు, రీఛార్జ్‌లు, పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే సందేశాలు, వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తెలియని ఫ్రెండ్ రిక్వెస్టులు, మనీ రిక్వెస్టులకు స్పందించవద్దని, అత్యాశకు లోనుకావద్దని తెలిపారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు అవతలి వ్యక్తి చెప్పిన విషయాలను నమ్మకుండా ప్రశ్నించాలని సూచించారు. పెట్టుబడులపై తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే ప్రకటనలు, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నకిలీ మెసేజ్‌లు, ఈమెయిల్లు, అనుమానాస్పద లింకుల ద్వారా వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ సమాచారం దొంగిలించే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.సైబర్ మోసం జరిగినట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ముఖ్యంగా మోసం జరిగిన వెంటనే స్పందించడం ద్వారా లావాదేవీని నిలిపివేయడానికి లేదా డబ్బును తిరిగి పొందే అవకాశాలను పెంచుకోవచ్చని తెలిపారు. అవసరమైనప్పుడు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. సైబర్ ప్రపంచంలో జాగ్రత్తే మనకు తొలి కవచం. అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలం అని సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అలాగే కాళేశ్వరం దేవస్థానం పరిధిలో జరిగిన సరస్వతీ పుష్కరాలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గ్రామంలోని ఇండ్లవద్ద బావుల వద్ద కరెంటు అంతరాయం లేకుండా చేయాలి

**విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏడీని కలిసిన సర్పంచ్.**

**ఖానాపురం, సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):**



మండలంలోని కొత్తూరు గ్రామంలోని విద్యుత్ అంతరాయం లేకుండా గ్రామంలోని, వ్యవసాయ బావుల వద్ద కరెంటుఅంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఏడి రాజేష్‌ను గ్రామసర్పంచ్ జాటోత్వినోద్ కుమార్ కలిసి గ్రామ వ్యవసాయ బావుల మోటార్ల సమస్యలను ఏడికి వివరించారు. ఇట్టి విషయాలను విన్న ఏడి సానుకూలంగా స్పందించి త్వరలోనే విద్యుత్ అంతరాయం లేకుండా గ్రామంలోని ఇండ్ల వద్ద బావుల వద్ద నిరంతరం ఉండే విధంగా చేస్తామని తెలిపినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ మంగమ్మ, ఉప సర్పంచ్ ఆరె సంపత్ కుమార్, వార్డు సభ్యుడు జాటోత్ బాలు, రైతులు దుడ్డు విజేందర్, మజ్జిగ రవి, లైన్ మెన్ దేవేందర్ ం పాల్గొన్నారు.

## పాదదర్శకంగా భూ సర్వే రైతులు సహకరించాలి

**తహసిల్దార్ ముప్పకృష్ణ**

**నల్లబెల్లి, సెప్టెంబర్ 21( వుదయం):**



మండల పరిధిలోని అర్షణపల్లి గ్రామంలో సోమవారం భూముల రీసర్వే ప్రక్రియను అధికారులు అధికారికంగా ప్రారంభించారు. నల్లబెల్లి మండల తహశీల్దార్ ముప్పు కృష్ణ, రెవెన్యూ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని సర్వే పనులను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి, వివాద రహిత రెవెన్యూ సేవలందించేందుకే ప్రభుత్వం పారదర్శకంగా ఈ రీసర్వే చేపడుతోందని తెలిపారు. ప్రతీ రైతు భూమికి సంబంధించి సరిహద్దులను పక్కాగా నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రికార్డులను భద్రపరుస్తామని పేర్కొన్నారు. రైతులు తమ వద్ద ఉన్న భూమి పత్రాలతో సర్వే బృందాలకు సహకరించి ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, విఆర్వోలు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 7 అర్జీల స్వీకరణ



**నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు ఆర్డీఓ ఆదేశం.**

**పరకాల, సెప్టెంబర్ 21 (వు దయం ప్రతినిధి):**

పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) అధ్యక్షతన సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరకాల డివిజన్ స్థాయి అధికారులు, వివిధ మండలాల అధికారులు హాజరై ప్రజల నుంచి సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం 7 అర్జీలు స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించిన ఆర్డీఓ, ప్రజల సమస్యలను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సత్వర సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ ఆదేశించారు.

## నూతన సీఐకి బీఆర్ఎస్ నాయకుల ఘన స్వాగతం

**సంజీవరావు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కారం**

**వర్ధన్నపేట సెప్టెంబర్ 21 (వుదయం ప్రతినిధి):**



ఇటీవల జరిగిన పోలీసు శాఖ బదిలీల్లో భాగంగా వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ సంజయ్‌రావును వర్ధన్నపేట మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

వర్ధన్నపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంలో నూతన సీఐ కీలకంగా వ్యవహరించాలని నాయకులు ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేలా పోలీసు యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ జెడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ బిక్షపతి, మున్సిపల్ కౌన్సిలర్లు సిల్వర్ కుమారస్వామి, తుమ్మల శ్రీధర్, సీనియర్ జిల్లా నాయకుడు తుమ్మల యాకయ్య, సర్పంచ్ మాలోత్ వెంకన్న, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా తిరుపతి, భూక్య రాజేందర్ రాథోడ్, రాజరాజేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఏరుకొండ వేణుగోపాలరావు, డివిజన్ అధ్యక్షుడు భూక్యా గోరా పాల్గొన్నారు.

## కబడ్డీ, ఖోఖోలో అదరగొట్టిన జెడ్‌పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల క్రీడాకారులు

**జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు.**

**క్రీడాకారులను అభినందించిన నర్సంపేట మున్సిపల్ చైర్మన్ పెండెం శ్రీలక్ష్మి.**

**నర్సంపేట వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 21.**




70వ ఎస్‌జీఎఫ్ఐ నర్సంపేట జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన జెడ్‌పీహెచ్ఎస్ బాలుర పాఠశాల క్రీడాకారులను మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ అభినందించారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో గురజాల ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో అండర్ 14 బాలుర కబడ్డీలో ప్రథమ స్థానం, అండర్14 బాలుర, బాలికల ఖోఖోలో ద్వితీయ స్థానాలు,

అండర్17 బాలికల ఖోఖోలో ద్వితీయ స్థానం సాధించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలని చైర్‌పర్సన్ ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లిక్కి రమేష్ కుమార్ క్రీడాకారులను అభినందించారు.

## క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న రిటైర్డ్ హెడ్మాస్టర్

**భూపాలపల్లి: సెప్టెంబర్ 21 (వుదయం విలేకరి)**




క్రీడాకారులను రిటైర్డ్ హెడ్మాస్టర్ గుంటుక సత్యం ప్రోత్సహిస్తున్నారని వ్యాయామ ఉపాధ్యాయులు గురుసింగ పూర్ణిమ తెలిపారు సోమవారం ఆమె మాట్లాడుతూ ఎస్. జి. ఎఫ్ మహాదేవపూర్ స్థాయి క్రీడలు ఘనంగా జరిగాయని అన్నారు క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా మహాదేవపూర్ మండల టోర్నమెంట్ కు బహుమతుల దాతగా రిటైర్డ్ హెడ్మాస్టర్ గుంటుక సత్యం క్రీడల మీద ఉన్నటువంటి మక్కువతో క్రీడాకారులను ప్రోత్సహించుట కొరకు మహాదేవపూర్ మండల ప్రాంతంలో క్రీడాకారులని వెలికి తీసే లో భాగంగా ఈ బహుమతుల ప్రధాన దాతగా నిలిచారు అని తెలిపారు గుంటుక సత్యం కు ఉపాధ్యాయులు సిరంగి రమేష్ అన్వర్, సమ్మయ్య, కార్తీక్, సులోచన, రాంబాబు, అజయ్ మిగతా పేటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

# చక్కని ఆరోగ్యం

# పరగడుపునే కీరా తినొచ్చా..!?

చవకగా దొరికేది అన్ని వేళలా లభించే కీరా దోసకాయతో కలిగే లాభాలు అన్ని ఇన్ని కావని చెబుతున్నారు ICAR–నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (CEO) డా. ఆదర్శ గౌడ. అందరికి దొరికే కీరాను పరగడుపున తింటే చాలామంచిదని చెబుతున్నారు. ముఖ్యంగా ఈ సమ్మర్ ఉష్ణోగ్రతలకు ఇది ఎంతో పోషకవంతమైనదని అన్నారు. దీన్ని ఉదయమే అల్పాహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఏంతో మేలని తెలిపారు. అంతేగాదు దీనిలో ఉండే పోషక విలులు, ఉపయోగాలు గురించి సవివరంగా వెల్లండించారు. ప్రతిరోజు ఉదయం పరగడుపునే కీరా దోసకాయ లేదా కీరా జ్యూస్ తీసుకుంటే శరీరంలోని వ్యర్థాలన్నీ బయటకి వెళ్లిపోయి మలబద్ధకం సమస్య తగ్గుతుందని చెబుతున్నారు. ముఖ్యంగా వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుందని అన్నారు. అధిక బరువుతో బాధపడే వాళ్లకు ఎంతో మేలని అంటున్నారు. ముఖ్యంగా పొట్ట భాగంలో ఉన్న కొవ్వు ఇట్టే కరిగిపోతుందని చెబుతున్నారు. ముఖ్యంగా వేసవి తాపాన్ని తగ్గిస్తుంది, వడదెబ్బ బారిన పడకుండా కాపాడుతుందని చెబుతున్నారు.

అలాగే మధుమేహులు దీన్ని తీసుకోవడం వల్ల చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగ్గుఉంటుందని అన్నారు. కీరలక్ష అధికంగా ఉండే ఫైబర్ జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గిస్తుందని అన్నారు. దీనిలో ఉండే విటమిన్ సీ ఇమ్యూనిటీని పెంచి వ్యాధులు దరిచేరకుండా చేస్తుందని చెబుతున్నారు.



శరీరానికి తేమ: కీరాలో సుమారు 95% నీరు ఉండటం వల్ల ఉదయాన్నే శరీరాన్ని డిహైడ్రేషన్ నుంచి కాపాడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకం సమస్యను నివారించి, ప్రేగు కదలికలను మెరుగుపరుస్తుంది. కేలరీలు చాలా తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి అల్పాహారం. రోగనిరోధక శక్తి: దీనిలోని విటమిన్ సీ, ఇతర యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే ఫైబ్రాయిడ్లు లేదా ఈస్ట్రోజెన్ ఆధిపత్యాన్ని ఎదుర్కొంటున్న మహిళలకు, ఇందులోని ఫైటోన్యూట్రియెంట్లు తేలికపాటి యాంటీ–ఈస్ట్రోజెనిక్ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటే..రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయని చెబుతున్నారు. చర్మం, కళ్ళు, జుట్టు ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. రక్తపోటుని తగ్గిస్తుంది, చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుంది కూడా.

దోసకాయ చల్లబరిచే ప్రభావాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల ఇది శరీరంలో కఫ దోషాన్ని తీవ్రతరం చేస్తుంది. తరచుగా జలుబు, దగ్గు, శ్లేష్మం, సైనస్ సమస్యలు, ఉబ్బసం లేదా కఫంతో బాధపడేవారు కీరాను పూర్తిగా నివారించాలి. ఇరిటబుల్ బోవల్ సిండ్రోమ్ (IBS), జీర్ణ సమస్యలు ఉన్నవారికి మంచిది కాదు. కీళ్ల నొప్పులు ఉంటే తినకపోవడమే మేలు

మూత్ర విసర్జనకి సంబంధించిన సమస్యలతో బాధపడుతుంటే వైద్యులను సంప్రదించే తీసుకుంటే మంచిది. గ్లూకోజ్‌ని తగ్గించే మందలు ఉపయోగించే వాళ్లు కూడా వైద్యులను సంప్రదించే తీసుకోవాలని చెబుతున్నారు.

# ఛాతీలో మంట వేధిస్తుందా? అయితే ఇలా చేయండి!

ఏం తిన్నా ఛాతీలో మంట వేధిస్తుంటే దాన్ని అసిడిటీగానే పరిగణించాలి. అయితే ఈ సమస్యను అధిగమించగలిగే యోగాసనాలు ఉన్నాయి. అవేంటంటే.... వెన్ను, పొత్తికడుపు మీద ప్రభావం చూపించే ఆసనమిది.



జీర్ణవ్యవస్థకు రక్తప్రసరణను పెంచి, జీర్ణసంబంధ అవయవాలకు ఈ ఆసనంతో వ్యాయామం దక్కుతుంది. సున్నితమైన మర్దన జరిగి జీర్ణవ్యవస్థ క్రమబద్ధమై, అసిడిటీ నుంచి విముక్తి లభిస్తుంది. ఈ ఆసనం ఎలా వేయాలంటే.....

చేతులు, మోకాళ్ల మీద బల్ల ఆకారంలో నేల మీద కూర్చోవాలి. ఈ భంగిమలో మోకాళ్లు అరడుగు దూరంలో, చేతులు నిటారుగా నేల మీద ఆనించి ఉంచాలి. ఊపిరి పీల్చుతూ, తలను నెమ్మదిగా పైకి లేపి వెనక్కి వాల్చాలి. ఇలా చేస్తూ వీపును పైకి లేపి విల్లు ఆకారంలో వంగాలి. ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, నెమ్మదిగా వెన్ను వంచుతూ, ఊపిరి వదులుతూ పూర్వ స్థితికి రావాలి. ఆ ఆసనంలో శరీర బరువు చేతులు, కాళ్లపై పడుతుంది. ఈ ఆసనంతో పొత్తికడుపులోకి ప్రాణవాయువు వెళ్లి అసిడిటీ అదుపులోకి వస్తుంది. ఈ ఆసనం వేయడం కూడా సులువే! దీన్ని ఎలా వేయాలంటే.... చేతులు, కాళ్ల ఆసరాతో శరీరాన్ని బల్ల ఆకారంలో వంచాలి. ఊపిరి వదులుతూ నడుమును పైకి లేపి, చేతులు, కాళ్లు నిటారుగా ఉంచాలి. చేతులు, భుజాలకు, కాళ్లు, తుంటికి సమాంతరంగా ఉండాలి. కాలి బొటనవేళ్లు ముందుకు ఉండాలి. ఇప్పుడు చేతులు నేల మీద బలంగా తాకిస్తూ, తలను వంచాలి. ఈ భంగిమలో చెవులు చేతులను తాకాలి. ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, మోకాళ్లను వంచి, శరీరాన్ని పూర్వ స్థితికి తీసుకురావాలి. ఈ ఆసనం శరీరానికి స్వాంతన కలిగించి, జీర్ణవ్యవస్థకు విశ్రాంతిని అందిస్తుంది. ఫలితంగా అసిడిటీ తగ్గుతుంది. ఈ ఆసనం వేసినప్పుడు జీర్ణసంబంధ అవయవాలకు మర్దన జరిగి, బలపడతాయి. ఈ ఆసనం ఎలా వేయాలంటే.... మెకాళ్ల మీద, రెండు పాదాల బొటన వేళ్లు ఒకదానికొకటి తగిలేలా కాళ్లను వెనక్కి వాల్చి కూర్చోవాలి. నడుము పైభాగాన్ని ముందుకు వంచి, పడుకోవాలి. చేతులు రెండూ ముందుకు చాపి, మోకాళ్లకు సమాంతరంగా నేల మీద ఆనించాలి. భుజాలు రెండూ కిందకు వాల్చాలి. ఈ భంగిమలో 30 సెకన్లపాటు ఉండి, నెమ్మదిగా పైకి లేవాలి.

# పుల్లపుల్లటి ఆమ్లాతో వంటలు

రుచిగానూ ఉంటాయి, ఔషధంగానూ పని చేస్తాయి. ఉసిరితో ఊరగాయ, రోటిపచ్చడి, జామ్, జ్యూస్, మిఠాయి, సబ్జీ, రసం, రైతా, క్యాండీ, ఫ్రైస్, పులిహోర, చాయ్.. ఇలా ఎన్నెన్నో చేయొచ్చు. మీ కోసం మరికొన్ని వెరైటీలు.. కావలసినవి: ఉసిరికాయలు – అర కిలో, అల్లం – 200 గ్రాములు, పంచదార పొడి – 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి తగినంత, మిరియాల పొడి – స్పూన్, ఛాట్ మసాలా – 2 స్పూన్లు, తయారీ: నాణ్యమైన, పెద్ద ఉసిరికాయలను ఎంచుకోవాలి. వాటిని కడిగి, తడి లేకుండా తుడిచి తురమాలి. అల్లం పొట్టు తీసి సన్నగా, పొడుగ్గా ముక్కలు కోసి.. ఉసిరి తురుములో కలపాలి. అందులో ఉప్పు, పంచదార పొడి, మిరియాల పొడి, ఛాట్ మసాలా జతచేసి కలియబెట్టాలి. ఈ పాత్రకు మూత పెట్టేసి.. రాత్రంతా అలా ఉంచేయాలి. ఉదయం వాటిని తీసి పళ్లెంలో పరిచినట్టుగా అమర్చి.. బాగా ఎండ తగిలేచోట ఉంచాలి. అవసరమైతే మర్నాడు కూడా ఎండబెట్టాలి. అంతే.. ‘ఆమ్లా ముఖ్వాస్’ తయారైపోతాయి. కావలసినవి: ఉసిరికాయలు – పావు కిలో, బెల్లం – పావు కిలో, మిరియాల పొడి, వాము – స్పూన్ చొప్పున, జీలకర్ర పొడి – 2 స్పూన్లు, ఉప్పు – రుచికి తగినంత, ఇంగువ – అర స్పూన్, ఆమ్‌చూర్ పౌడర్ – ముప్పావు స్పూన్, పంచదార పొడి – 2 స్పూన్లు, తయారీ: ఉసిరికాయల్లో కొన్ని నీళ్లు పోసి.. కుక్కర్‌లో రెండు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. మిగిలిన నీళ్లను వార్చేసి.. గింజలు తీయాలి. వాటిని మిక్సీజార్‌లో వేసి.. మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ ఉసిరి ముద్దను కడాయిలో వేసి.. కొన్ని నీళ్లు, బెల్లం చేర్చి వేడిచేయాలి. రెండు మూడు నిమిషాల తర్వాత.. మిరియాల పొడి, వాము, జీలకర్ర పొడి, ఉప్పు, ఇంగువ, ఆమ్‌చూర్ పౌడర్ జోడించాలి. అడుగంటకుండా కలియతిప్పుతూ చిక్కబడే వరకూ ఉంచి.. సెగ తీసేయాలి. చల్లారాక.. చిన్న ఉండల్లా చేయాలి. వాటి మీద పంచదార పొడి చల్లితే ఒకదానికొకటి అంటుకోవు. ఇవి చిన్నా పెద్దా అందరికీ నచ్చేస్తాయి. కావలసినవి: ఉసిరికాయలు – అర కిలో, తేనె – మూడు కప్పులు, కుంకుమ పువ్వు – కొద్దిగా, ఉప్పు – చిటికెడు, మిరియాల పొడి – ముప్పావు స్పూన్, డ్రై జింజర్ పౌడర్, యాలకుల పొడి – అర స్పూన్ చొప్పున, తయారీ: పక్వానికి వచ్చిన మంచి ఉసిరికాయలను కడిగి, తుడిచి.. ఫోర్క్‌తో దగ్గరదగ్గరగా, లోతుగా రంధ్రాలు చేసి.. పది నిమిషాలు ఉడికించాలి. ఆ నీళ్లు వార్చేసి.. ఐదు గంటలు ఎండబెట్టాలి. వాటిని తడి లేని సీసాలో వేసి.. తేనె పోయాలి. అందులో మిరియాల పొడి, కుంకుమ పువ్వు, ఉప్పు, డ్రై జింజర్ పౌడర్, యాలకుల పొడి జోడించాలి. సీసా మూత పెట్టేసి.. వస్త్రం చుట్టి ఎండలో ఉంచాలి. సాయంత్రం లోనికి తెచ్చి.. మర్నాడు మళ్లీ ఎండలో ఉంచాలి. ఇలా పది రోజులు ఎండబెడితే.. ‘ఆమ్లా మురబ్బా’ తయారవుతుంది. ఉసిరికాయలు ఉబ్బుతాయి కనుక.. లోపల కొంత ఖాళీ ఉండేలా పెద్ద సీసాను తీసుకోవాలి. కావలసినవి: ఉసిరికాయల తరుగు – 2 కప్పులు, ఎండుమిర్చి – 25 నుంచి 30 వరకూ, ఉప్పు – రుచికి తగినంత, శనగపప్పు – ఒక కప్పు, మినపప్పు – అర కప్పు, ఎండుకొబ్బరి తురుము – 2 కప్పులు, కరివేపాకు – ముప్పావు కప్పు, పసుపు – స్పూన్, నూనె – 3 స్పూన్లు, ఆవాలు – ఒకటిన్నర స్పూన్, జీలకర్ర – స్పూన్, ఇంగువ – పావు స్పూన్, తయారీ: ఉసిరి తురుమును అందులో ఉన్న చెమ్మ పోయే వరకూ సన్న సెగ మీద వేయించాలి. శనగపప్పు, మినప్పప్పు, ఎండుమిర్చి, కొబ్బరి, కరివేపాకులను విడివిడిగా వేయించాలి. పూర్తిగా చల్లారాక.. మిక్సీ జార్‌లో వేసి.. గ్రైండ్ చేయాలి. అందులో ఉసిరి తురుము, ఉప్పు, పసుపు వేసి కలపాలి. కడాయిలో నూనె వేడయ్యాక ఆవాలు.. అవి చిటపటలాడుతున్నప్పుడు జీలకర్ర, ఇంగువ వేయాలి. ఈ తాలింపును గ్రైండ్ చేసిన మిశ్రమంలో వేసి కలియబెట్టాలి. అంతే.. రుచికరమైన ‘ఉసిరి కారం’ సిద్ధం. దీన్ని తడి లేని సీసాలో భద్రం చేసుకోవాలి. వేడన్నంలో కాస్తకారం, కొద్దిగా నెయ్యి వేసు కుని తింటే సూపర్‌గా ఉంటుంది. కావలసినవి: ఉసిరికాయలు – ముప్పావు కిలో, ఉప్పు – రుచికి తగినంత, బెల్లం – అర కిలో, డ్రై జింజర్ పౌడర్ – ఒకటిన్నర స్పూన్, కారం, మిరియాల పొడి – స్పూన్ చొప్పున, నిమ్మరసం – ముప్పావు స్పూన్, తయారీ: ఉసిరికాయలను ఉడకబెట్టాలి. చల్లారాక.. గింజలు తీసేసి, తొనల్లా కోయాలి. బెల్లంలో పావు కప్పు నీళ్లు పోసి మరిగించాలి. అందులో ఉసిరి తొనలు జతచేసి.. సన్న సెగ మీద ఉడికించాలి. ఐదు నిమిషాల తర్వాత... డ్రై జింజర్ పౌడర్, కారం, మిరియాల పొడి, నిమ్మరసం జోడించి కలియతిప్పాలి.



# మామిడిపండుతో మొటిమలా?!

మామిడి పండ్ల సీజన్‌లో వాటిని చూస్తూ తినకుండా ఎవరైనా ఉన్నారంటే– వాళ్లు కచ్చితంగా టీనేజీ అమ్మాయిలే. వాటిని తినడం వల్లే మొటిమలు వచ్చాయనీ, వేడి చేసిందని చెబుతూ... ఎంత ఇష్టమున్నా కొందరు వాటిని తాకను గాక తాకరు. నిజమే, ఈ కాలంలో కొందరిలో మొటిమలు ఎక్కువ కావొచ్చు. కానీ ఆ పాపం మామిడి పండుది కాదు అంటున్నారు నిపుణులు. దాన్ని సరైన పద్ధతిలో తీసుకోకపోవడమే. మామిడి గుజ్జులో చక్కెర, పాలు కలిపి ఐస్‌క్రీమ్, డెజర్ట్‌లు చేసుకుని తింటుంటారు. అలాగే వీటితోపాటు నూనెపూరిత స్నాక్స్ కూడా ఎక్కువగా తింటుంటారు. ఇవన్నీ కలిసి ఇన్‌ఫ్లమేషన్, మొటిమలకు కారణమవుతాయి. అదే నేరుగా మామిడి పండును తినడం వల్ల ఏ సమస్యా ఉండదు. అయితే కొందరికి మామిడి తొక్కలోని ఉరుషియోల్ అనే రెజిన్ పదార్థం వల్ల అలర్జీ వస్తుంది. జీడిగింజ తొక్కల్లోనూ ఎక్కువగా ఉండే ఈ పదార్థం మామిడి ఆకులు, కాడలు, తొక్కలో కొద్దిపాళ్లలో ఉంటుంది. కానీ గుజ్జులో ఉండదు. దీనివల్ల నోరు, ముఖం, చేతులమీద దురదతో కూడిన దద్దుర్లు వస్తాయి. వీటినే మొటిమలుగా పొరబడుతుంటారు. కానీ ఇది మ్యాంగో డెర్మటైటిస్.. ఇది రాకుండా ఉండాలంటే అలర్జీ ఉన్నవాళ్లు తినే ముందు కాయనూ, తొక్క తీశాక చేతుల్నీ శుభ్రంగా కడగడం... వంటివి పాటించాలి. సాధారణంగా హార్మోన్ల మార్పులు, జిడ్డు చర్మం, నిద్రలేమి, ఒత్తిడి, డీహైడ్రేషన్, సరైన చర్మ సంరక్షణ తీసుకోకపోవడంతోపాటు జన్యు కారణాల వల్ల మొటిమలు వస్తుంటాయి. అంతేతప్ప మామిడి పండు వల్ల రావు. ఇంకా చెప్పాలంటే, మామిడిపండు చర్మ ఆరోగ్యానికి ఎంతో మేలు. వాటిల్లో ఎ, సి విటమిన్లు, ఇతరత్రా యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం. కాబట్టి మామిడి పండ్లను హాయిగా ఆస్వాదించవచ్చు.



# రుచికరమైన సోల్కడి

చెయ్యని కుండ, పొయ్యని నీళ్లు– అనగానే తియ్యటి కొబ్బరి నీళ్లని అర్థమైపోతుంది కదా! ఆ నీళ్లు తాగేశాక.. కొబ్బరితో ‘సోల్కడి’ చేసి చూడండి. రుచిగానూ ఉంటుంది, ఆరోగ్యం కూడా.


ఇందుకోసం కొబ్బరికాయ – 1, వంగ మామిడి పండ్లు (పర్పుల్ మ్యాంగోస్టీన్) – 2, వెల్లుల్లి రెబ్బలు – 2, అల్లం – అరంగుళం ముక్క, పచ్చిమిర్చి – 1, బీట్‌రూట్ – 1, జీలకర్ర పొడి – చెంచా, ఛాట్ మసాలా – అర చెంచా, ఉప్పు – చిటికెడు, కొత్తిమీర తరుగు – 2 చెంచాలు తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. కొబ్బరిని చిన్న ముక్కలుగా కోయాలి. బీట్‌రూట్ చెక్కు తీసి సన్నగా తరగాలి. వంగ మామిడి ముక్కలను వేడి నీళ్లలో 20 నిమిషాలు నానబెట్టాలి. మిక్సీజార్‌లో కొబ్బరి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, అల్లం, పచ్చిమిర్చి, బీట్‌రూట్, జీలకర్ర పొడి, ఛాట్ మసాలా, ఉప్పు, నానిన వంగ మామిడి ముక్కలు వేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పల్చని వస్త్రంతో వడకట్టాలి. మిగిలిన పిప్పిలో కొన్ని నీళ్లు పోసి.. మరోసారి వడకట్టి.. కొత్తిమీర తరుగు చల్లితే రుచీ ఆరోగ్యాల ‘సోల్కడి’ తాగి ఆనందించవచ్చు. ఇది ఊబకాయం రానివ్వదు, ఒంట్లో వేడిని తగ్గించి చలవ చేస్తుంది.



# ముత్యంలాంటి మెరిసే ముఖం కోసం..

ముత్యాలు అలంకారానికే కాదు, మేనిని మెరిపించడానికీ ఉపయోగపడతాయని ప్రపంచానికి పరిచయం చేసింది చైనా. క్రీస్తుశకం ఏడో శతాబ్దికి చెందిన చైనా మహారాణి వు జెషియన్ అందం కోసం ముత్యాల పొడిని వాడేది. రసాయనాలతో కాకుండా సహజసిద్ధంగా తయారుచేసే ఈ పొడిని ముఖానికి రాసుకోవడం వల్ల చర్మం సహజంగా మెరుస్తుంది. ముఖంపై ముడతలు రాకుండా కాపాడుతుంది. ఒకప్పుడు కేవలం రాజకుటుంబీకులకే పరిమితమైన ఈ ప్రాచీన పద్ధతి, ప్రస్తుతం ఆధునిక చర్మ సంరక్షణ పరిశ్రమలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందుతోంది. నేడు అనేక ప్రముఖ బ్యూటీ బ్రాండ్లు తమ ఉత్పత్తులలో ఈ ముత్యాల పొడిని ఉపయోగిస్తూ, పురాతన చైనా అందాల రహస్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.

సిల్కీప్రో స్ట్రెయిట్ అత్యాధునిక ‘ఎయిర్ పవర్డ్’ టెక్నాలజీతో పనిచేస్తుంది. ఇది వేడికి బదులుగా గాలి ప్రవాహం ద్వారా జుట్టును స్ట్రెయిట్ చేస్తుంది. దీనివల్ల జుట్టు దెబ్బతినకుండా ఉంటుంది. ఈ పరికరం అందరికీ అనుకూలంగా ఉంటుంది. కర్లీ, కాయిల్డ్, టెక్స్చర్డ్ హెయిర్ ఉన్నవారు కూడా కేవలం నిమిషాల వ్యవధిలోనే మృదువైన, పిన్–షార్ప్ స్ట్రెయిటనింగ్ పొందవచ్చు. దీనికోసం ప్రత్యేకమైన ఇంటర్‌చేంజబుల్ కోంబ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. అలాగే ఇంటిగ్రేటెడ్ హీట్ సెన్సర్ ఉంటుంది. అంటే ఇది సెకనుకు వెయ్యిసార్లు టెంపరేచర్‌ని పర్యవేక్షిస్తూ, జుట్టుకు నష్టం కలగకుండా ఆటోమేటిక్‌గా అడ్జస్ట్ చేస్తుంది. స్నానం చేసిన వెంటనే తడి జుట్టుపై కూడా దీనిని నేరుగా ఉపయోగించవచ్చు. ఇది జుట్టును ఆరబెట్టడంతో పాటు స్ట్రెయిటెనింగ్ కూడా చేస్తుంది. ఖరీదైన క్రీములు మేనిని మెరిపిస్తాయని అనుకుంటుంటారు. కాని, మేని మెరుపు కేవలం మార్కెట్‌లో దొరికే ఉత్పత్తులతోనే సాధ్యం కాదు. మనం పాటించే జాగ్రత్తలతోనే మేని మెరుపును కాపాడుకోవచ్చు. చాలా మంది ఇంటి నుంచి బయలుదేరే ముందు సన్‌స్క్రీన్ రాసుకుని వదిలేస్తారు. చెమట వల్ల అది త్వరగా పోతుంది. అందుకే ప్రతి మూడు గంటలకోసారి సన్ స్క్రీన్ రాసుకోవడం మర్చిపోవద్దు. చాలామంది గంటల తరబడి ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని మాట్లాడుతుంటారు. దీని వల్ల వేడి పెరిగి చర్మంపై మొటిమలు వచ్చే అవకాశం ఉంది. వీలైనంత వరకు హెడ్‌సెట్ వాడటం మేలు. తాత్కాలిక మెరుపు కోసం వాడే ఉత్పత్తులు దీర్ఘకాలంలో మీ చర్మానికి హాని చేయవచ్చు. ముఖం పదేపదే కడగడం వల్ల చర్మంపై ఉండే రక్షణ పొర దెబ్బతిని, చర్మం త్వరగా కమిలిపోతుంది. అలసట పోవడానికి వేడి నీళ్ల స్నానం హాయిగానే ఉన్నా, అది మీ చర్మంలోని తేమను హరిస్తుంది. దీనివల్ల చర్మం త్వరగా పొడిబారిపోయి ముడతలు వస్తాయి.



# వేసవిలో జిమ్‌కు వెళ్లేటప్పుడు ఈ పొరపాట్లు చేయకండి

వేసవిలో జిమ్ చేయడం ఆరోగ్యానికి మంచిదే అయినా, కొన్ని జాగ్రత్తలు పాటించకపోతే అది ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. చిన్న తప్పులు కూడా శరీరంపై తీవ్ర ప్రభావం చూపవచ్చు, ముఖ్యంగా గుండెపై ఒత్తిడి పెంచే ప్రమాదం ఉంటుంది. ఇప్పుడు వేసవిలో జిమ్‌కి వెళ్లేవారు తప్పక నివారించాల్సిన కొన్ని పొరపాట్లు చూద్దాం.. వేసవిలో ఎక్కువసేపు ట్రెడ్‌మిల్‌పై పరుగెత్తడం లేదా అధిక తీవ్రతతో కార్డియో చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత వేగంగా పెరుగుతుంది. దీని వల్ల గుండెపై అదనపు ఒత్తిడి పడుతుంది. ఇప్పటికే రక్తపోటు లేదా గుండె సమస్యలు ఉన్నవారికి ఇది మరింత ప్రమాదకరం. తగినంత నీరు తాగకపోవడం వేడిలో ఎక్కువగా చెమట పడటం వల్ల శరీరంలో నీరు, ఎలక్ట్రోలైట్లు తగ్గిపోతాయి. వ్యాయామం సమయంలో సరైన పరిమాణంలో నీరు తాగకపోతే డీహైడ్రేషన్ వచ్చే అవకాశం ఉంది. ఇది రక్తప్రసరణను ప్రభావితం చేసి గుండెపై ఒత్తిడిని పెంచుతుంది. బరువు తగ్గాలనే ఉద్దేశంతో కొంతమంది ఏమీ తినకుండా జిమ్‌కు వెళ్తారు. కానీ ఇలా చేయడం వల్ల శరీరానికి శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా తల తిరగడం, అలసట, తక్కువ రక్తపోటు వంటి సమస్యలు రావచ్చు. వ్యాయామానికి ముందు వార్మప్ చేయకపోతే శరీరంపై అకస్మాత్తుగా ఒత్తిడి పడుతుంది. ఇది గుండె వేగంగా కొట్టుకునేలా చేస్తుంది. అందుకే కనీసం 10 నిమిషాల వార్మప్ చేయడం చాలా అవసరం. త్వరగా ఫలితాలు రావాలనే ఉద్దేశంతో కొంతమంది ప్రొటీన్, ప్రీ–వర్కౌట్ సప్లిమెంట్లు ఎక్కువగా తీసుకుంటారు. వీటిలో ఉండే కెఫిన్ వంటి పదార్థాలు గుండె స్పందనను పెంచవచ్చు. అందుకే వేసవిలో జిమ్‌కి వెళ్లేవారు ఈ పొరపాట్లను తప్పించుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, గుండె సంబంధిత ప్రమాదాలను తగ్గించుకోవచ్చు.



# అల్లం షర్బత్ క్షణాల్లో..

ఎండాకాలం ఇంటికెవరైనా వస్తే షర్బత్‌తో ఆతిథ్యం మొదలవుతుంది. అప్పటికప్పుడు నిమ్మరసం తీసి పానీయం చేయాల్సిన అవసరం లేకుండా ఇలా లెమన్ జింజర్ కాన్‌సన్ట్రేట్ చేసి ఉంచితే.. క్షణాల్లో కలిపి ఇవ్వొచ్చు..

కావలసినవి: నిమ్మరసం – కప్పు, అల్లం – 100 గ్రాములు, తేనె – ఒకటిన్నర కప్పులు, బెల్లం పొడి – అర కప్పు, ఉప్పు – రుచికి తగినంత, మిరియాల పొడి – అర స్పూన్, నిమ్మ తొక్క తురుము (లెమన్ జెస్ట్) – స్పూన్

తయారీ: అలాన్ని శుభ్రంగా కడిగి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ అల్లం ముద్దను అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో వేసి.. నిమ్మరసం, బెల్లం జతచేసి సన్న సెగ మీద కలుపుతూ ఉడికించాలి. తర్వాత స్టవ్ ఆఫ్ చేయాలి. చల్లారిన తర్వాత తేనె, ఉప్పు, మిరియాల పొడి, నిమ్మ తొక్క తురుము వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన, గాలి చొరబడని గాజు సీసాలోకి తీసి రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకుంటే నెల రోజులు నిలవుంటుంది. తాగదలచినప్పుడు.. గ్లాసు నీళ్లలో రెండు స్పూన్ల కాన్‌సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. నాలుగు పుదీనా ఆకులు, ఐస్ క్యూబ్స్ జోడిస్తే అల్లం షర్బత్ ఇంకా రుచిగా ఉంటుంది. బెల్లం ఇష్టం లేకుంటే పంచదార వేసుకోవచ్చు.



## యాపిల్‌లో రెండోసారి లేఆఫ్‌లు..!

ప్రముఖ టెక్ సంస్థ యాపిల్ మరోసారి లేఆఫ్‌లు ప్రకటించినట్లు సమాచారం. రెండు నెలల వ్యవధిలో రెండోసారి ఉద్యోగాలకు కోతపెట్టినట్లు కథనం వెల్లడించింది. ఈసారి ఫిట్‌నెస్+ ఆడియో బృందంలోని పలువురిని తొలగించినట్లు పేర్కొంది. గతవారమే ఈ లేఆఫ్‌లు ఇచ్చినట్లు వెల్లడించింది. నడిచేటప్పుడు వినడానికి, రన్నింగ్ అలవాటును మెరుగుపరుచుకోవడం కోసం డిజైన్ చేసిన టైమ్ టు వాక్, టైమ్ టు రన్ కంటెంట్‌పై పనిచేసే ఉద్యోగులు ఇందులో ఉన్నారు. ప్రస్తుతానికి ఈ ఫీచర్లను పూర్తిగా నిలిపివేయలేదు. ఆగస్టులో యాపిల్ సంస్థ 200 మందికి పైగా ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే. అప్పుడు సిరి, విజన్ ప్రో, ఇంటెలిజెంట్ సిస్టమ్స్ ఎక్స్‌పీరియన్స్ బృంద సభ్యులను తొలగించింది.




# లాభాల్లో ముగిసిన సూచీలు..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, ప్రపంచ బాండ్ల రాబడులు బలహీనపడటం మార్కెట్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. దేశీయ ఈక్విటీ షేర్లలో విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడమూ కలిసొచ్చింది. దీంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,535.18 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,294.96) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 700 పాయింట్ల వరకు ఎగబాకిన సూచీ.. చివరికి 564.03 పాయింట్ల లాభంతో 74,858.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 67.90 పాయింట్లు పెరిగి 23,414.30 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.80గా ఉంది. సెన్సెక్స్30లో భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు మాత్రమే నష్టాలను చవిచూశాయి. మిగతా కంపెనీల షేర్లన్నీ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 101.36 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,350.74 డాలర్ల వద్ద కొనసాగుతోంది.


# దగ్గు మందు సీసాలపై హెచ్చరిక!




ఇప్పటివరకు సిగరెట్లు, గుట్కా, మద్యం సీసాలపై ముద్రిస్తున్న 'ఆరోగ్యానికి హానికరం' అనే హెచ్చరికల తరహాలోనే దగ్గుమందు సీసాలపైనా 'నాలుగేళ్ల లోపు చిన్నారుల ఆరోగ్యానికి ప్రమాదకరం' అంటూ ఎర్ర అక్షరాలతో ముద్రించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని సమాచారం. 2025 అక్టోబరులోనే డైరెక్టరేట్ ఆఫ్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) హెచ్చరికలు చేసినా కూడా, చిన్నారులకు దగ్గు మందు వాడకం కొనసాగుతోందని గమనించినందునే.. ఔషధ నియంత్రణ సంస్థ తాజా చర్యలకు ఉపక్రమించనుందని తెలుస్తోంది. వైద్యులు ప్రిస్క్రైబ్ చేయకుండానే, ఔషధ దుకాణాల్లో కొనుగోలు చేసి, దగ్గు మందును చిన్నారులకు వాడటమూ మనదేశంలో ఎక్కువే. ఈ నేపథ్యంలోనే పలు చర్యలు తీసుకుంటున్నారు. శిశువులు, తప్పటడుగులు వేసే చిన్నారులకు దగుమందు ఇవ్వడాన్ని నిరుత్సాహపరిచేలా 'సీసాలపై ఉండే లేబుళ్లలో మార్పులు చేయాలనే' ప్రతిపాదనను భారత ఔషధ నియంత్రణ సంస్థ పరిశీలిస్తోంది. పాఠశాల వయస్సు పిల్లల చిత్రాన్ని దగ్గుమందు సీసా ప్యాకేజింగ్‌పై ముద్రించడం ద్వారా, అంతకంటే చిన్నపిల్లలకు వాడొద్దనే సందేశాన్ని స్పష్టంగా తెలియజేయాలని భావిస్తోంది. 'నాలుగేళ్ల లోపు చిన్నారులకు వాడొద్దంటూ' ఎరుపు రంగులో హెచ్చరిక ముద్రించాలన్నదీ ప్రణాళిక. తద్వారా ఈ ఉత్పత్తి పెద్ద పిల్లల కోసం ఉద్దేశించినదని తెలియ చేయొచ్చన్నది యోచిస్తున్నారు. ఈ ప్రతిపాదనను పరిశీలన కోసం డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీకి సమర్పించారు. ఇందుకోసం 1945 నాటి డ్రగ్స్ రూల్స్‌లోని 96 నిబంధనావళిలో మార్పులు చేయాలని ప్రతిపాదించారు. ఈ ఏడాది జూన్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఔషధ నిబంధనావళిలో మార్పులు చేసింది. దగ్గు మందుతో పాటు సిరప్ రూపంలో ఉండే మందులను ఓవర్-ది-కౌంటర్ (ఓటీసీ) విభాగం నుంచి తొలగించింది. ఈ మందులను కొనుగోలు చేయాలంటే వైద్యుడి ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అని ప్రకటించింది.


## పండగ సీజన్‌కు ధరల ఊరట!

వాతావరణం, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల చక్కెరతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. అయితే పండగ సీజన్‌లో మాత్రం తమ ఉత్పత్తుల ధరలను స్థిరంగా ఉంచాలని ఎఫ్ఎంసీజీ కంపెనీలు భావిస్తున్నట్లు సమాచారం. వినియోగం మెరుగ్గా ఉండేలా చూసేందుకు, విక్రయాల వృద్ధిని కొన



సాగించేందుకు సంస్థలు ఈ నిర్ణయానికి వచ్చాయని తెలుస్తోంది. ముడి సరుకుల వ్యయాల భారాన్ని కొంత తగ్గించుకునేందుకే కంపెనీలు జూన్ త్రైమాసికంలోనే తమ ఉత్పత్తుల ధరలను 3-5% పెంచాయి. ఇప్పుడు కూడా లాభాల మార్జిన్లపై ఒత్తిడి ఉన్నా, పండగ సీజన్ ముగిసే వరకు ఉత్పత్తుల ధరలను మరింత పెంచే అవకాశం లేదని పరిశ్రమ ఎగ్జిక్యూటివ్‌లు పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న భౌగోళిక రాజకీయ అవాంతరాలు, సరఫరా ఆందోళనలు, వర్షాభావం నేపథ్యంలో చక్కెర ధరలు కొత్త గరిష్ఠ స్థాయికి చేరాయి. వంట నూనెలు, కాఫీ, కోకో, ప్యాకేజింగ్‌లో వినియోగించే ముడి చమురు వంటి కీలక ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో.. ఎఫ్ఎంసీజీ రంగం మళ్లీ వ్యయ ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. చాలా కంపెనీలు వ్యయ నియంత్రణ చర్యలు, పోర్ట్‌ఫోలియో నిర్వహణ ద్వారా ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటున్నాయి. మార్జిన్లపై ఒత్తిడి ఉన్నా, విక్రయ పరిమాణ వృద్ధిని కాపాడుకోవడంపైనే దృష్టి సారిస్తున్నట్లు కంపెనీల ఉన్నతాధికారులు తెలిపారు. వ్యయాలు పెరుగుతున్నా, పండగ సీజన్ అంతా తమ కంపెనీ ఉత్పత్తుల ధరలను యథాతథంగా ఉంచుతామని ఐటీసీ ఫుడ్స్ డివిజన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హేమంత్ మాలిక్ తెలిపారు.

## సింగపూర్ ఎయిర్‌లైన్స్ టాప్..



ప్రపంచంలోనే అత్యుత్తమ విమానయాన సంస్థగా సింగపూర్ ఎయిర్‌లైన్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఖతార్ ఎయిర్‌వేస్, కాథే పసిఫిక్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ మేరకు స్కైట్రాక్స్ వార్షిక జాబితాను విడుదల చేసింది. భారత్‌కు చెందిన ఎయిరిండియా సంస్థ 57వ స్థానంలో నిలవగా.. ఇండిగో 61వ స్థానం సాధించింది. 2025 సెప్టెంబర్ 25 నుంచి 2026 ఆగస్టు మధ్య 300 విమానయాన సంస్థలకు సంబంధించి ప్రయాణికుల నుంచి స్వీకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను స్కైట్రాక్స్ రూపొందించింది. 2025లో రెండో స్థానంలో ఉన్న సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఈ సారి అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. అదే సమయంలో ఖతార్ ఎయిర్‌వేస్ మొదటి స్థానం నుంచి రెండో స్థానానికి పడిపోయింది. కాథే పసిఫిక్ మాత్రం తన స్థానాన్ని నిలుపుకొంది. భారత్ తరఫున ఎయిరిండియా 57వ స్థానంలో నిలిచింది. 2025తో పోలిస్తే 25 స్థానాలను మెరుగుపరుచుకుంది. ఇండిగో గతేడాదితో పోలిస్తే 22 స్థానాలు కోల్పోయి 61వ స్థానానికి దిగజారింది. భారత్, దక్షిణాసియా ప్రాంతీయ ర్యాంకింగ్స్‌నూ స్కైట్రాక్స్ ప్రకటించింది. ఇందులో ఎయిరిండియా, ఇండిగో ఒకట్రెండు స్థానాల్లో నిలిచాయి. ఆకాశ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్, స్పైస్‌జెట్, బియాండ్, బిమన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్, పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్, మాల్దీవియన్ విమాన సంస్థలు టాప్-10 స్థానాల్లో ఉన్నాయి.

# టాటా సన్స్ వివాదం కోర్టుకెక్కితే..



కార్పొరేట్ దిగ్గజం టాటా సన్స్‌లో బోర్డురూమ్ వివాదం రోజురోజుకీ ముదురుతోంది. ఈ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్.చంద్రశేఖరన్‌ను మరో అయిదేళ్ల కాలానికి తిరిగి నియమిస్తూ బోర్డు తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని, అది చెల్లదని మెజారిటీ వాటాదారు అయిన టాటా ట్రస్ట్స్ పేర్కొంది. దీంతో ఈ వివాదం కోర్టుకెక్కే అవకాశాలు కన్పిస్తున్నాయి. మరి పరిష్కారం కోసం న్యాయస్థానానికి వెళితే ఆ ఖర్చులు భరించేది ఎవరన్నది చర్చనీయాంశంగా మారింది. టాటా ట్రస్ట్స్-టాటా సన్స్ వివాదానికి సంబంధించిన న్యాయపరమైన ఖర్చుల కోసం టాటా ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (TEDT) నిధులను వినియోగించే ఏ అవకాశాన్నైనా.. తాము వ్యతిరేకిస్తున్నట్లు ట్రస్టీ మెహ్లీ మిస్త్రీ వెల్లడించారు. ఈ మేరకు టాటా ట్రస్ట్స్ సీఈఓ సిద్ధార్థ శర్మతో పాటు ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా కు ఆయన మెయిల్ పంపినట్లు తెలిసింది. "కంపెనీ 150 ఏళ్ల చరిత్రలో ఇలాంటి వివాదం అనూహ్యమైనది. దీనిపై మేం విచారం వ్యక్తం చేస్తున్నాం. అయితే, టాటా సన్స్‌లో మా ట్రస్ట్ వాటాదారుగా లేదు. అందువల్ల ఈ వివాదంతో మాకు సంబంధం లేదు. న్యాయపరమైన ఖర్చులకు మేం వెచ్చించలేం" అని మెహ్లీ మిస్త్రీ స్పష్టం చేశారు. టాటా ట్రస్ట్స్ గతంలోనూ పలుమార్లు న్యాయపరమైన ఖర్చులను ఎదుర్కొన్నాయి. మాజీ ఛైర్మన్ సైరస్ మిస్త్రీతో టాటా గ్రూప్‌నకు నెలకొన్న సుదీర్ఘ న్యాయ వ్యవహారంలో.. టాటాసన్స్, టాటాట్రస్ట్స్ సంయుక్తంగా రూ.200 కోట్లు వెచ్చించినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. సైరస్ మిస్త్రీ వైపు మరో రూ.50 కోట్లు ఖర్చు అయినట్లు సమాచారం. దీన్ని దృష్టిలో ఉంచుకునే TEDT ట్రస్టీ.. తాజా మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. తాజా వివాదంలో టాటా ట్రస్ట్స్ వైపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించేందుకు సిద్ధమయ్యారు. అటు టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తరఫున మరో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ లాయర్లు ఇద్దరూ టాటా గ్రూప్ వివాదంపై తమతమ అభిప్రాయాలను మీడియా ముందు వ్యక్తపరుస్తున్నారు. ఈ నెల 17న జరిగిన బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్ పదవీకాలాన్ని పొడిగించే ప్రతిపాదనపై ఇద్దరు టాటా ట్రస్ట్స్ నామినీ డైరెక్టర్లలో నోయల్ టాటా వ్యతిరేకంగా ఓటు వేశారు. మరో ట్రస్ట్ నామినీ వేణు శ్రీనివాసన్ మాత్రం అనుకూలంగా ఓటేశారు. దీంతో కాస్టింగ్ ఓటు వినియోగించి ప్రతిపాదనను బోర్డు అంగీకరించింది. అయితే, ఇది కంపెనీ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ (ఏఓఏ)ను అతిక్రమించడమేనని ట్రస్ట్స్ ఆరోపించింది.




## ఇంకో మెట్టు పైకి..



దాదాపు పదేళ్ల షూటింగ్ కెరీర్ ఆమెది. ప్రపంచకప్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, ఆసియా ఛాంపియన్‌షిప్‌లతో జూనియర్, సీనియర్ విభాగాల్లో ఎన్నో పతకాలు ఖాతాలో ఉన్నాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో ప్రపంచ రికార్డు కూడా ఆమెదే. కానీ అత్యంత క్లిష్టమైన పోటీ ఉండే ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లో ఒక్క పతకం కూడా లేదు. మొత్తానికి ఆమె ఎదురు చూసిన రోజు వచ్చింది. పడిన కష్టానికి ఫలితం దక్కింది. ఆసియా క్రీడల్లో ఒకటి కాదు.. ఒకే రోజు రెండు పతకాలను సొంతం చేసుకుంది. ఒకటి వ్యక్తిగత పతకమైతే.. రెండోది టీమ్ మెడల్. ఆ షూటరే ఇలవేనిల్ వలరివాన్. జపాన్ ఆసియా క్రీడల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో వ్యక్తిగత, టీమ్ రజతాలతో మెరిసిందీ తమిళనాడు అమ్మాయి. 27 ఏళ్ల ఇలవేనిల్.. 2021 టోక్యో, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడినా రాణించలేకపోయింది. 2018 ఆసియా క్రీడల్లోనూ నిరాశ పరిచింది. ఆ ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుని, ఒత్తిడిని అధిగమించి కెరీర్‌లో తొలిసారి ఓ పెద్ద క్రీడల్లో పోడియంపై నిలిచింది.

# రోహిత్ శర్మకు 'అగార్కర్' లైన్ క్లియర్..

వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా? కొంతకాలంగా ఈ ప్రశ్నపై ఎన్నో అంచనాలు, విశ్లేషణలు వినిపిస్తూనే ఉన్నాయి. అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి రోహిత్ ను ఆడించే ఉద్దేశం లేదని గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ దిగిపోవడం ఖాయమేనని తెలుస్తోంది. దీంతో రోహిత్‌ను వన్డేల్లో కొనసాగించడానికి లైన్ క్లియరైనట్లేనని అంతా భావిస్తున్నారు. అయితే, బీసీసీఐ మాత్రం ఈ విషయంలో ఇంకా వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. రోహిత్ ఫిట్‌నెస్ పై ఇంకా అతడిని వరల్డ్ కప్ వరకు కొనసాగించేందుకే బోర్డు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. కాకపోతే రోహిత్ ఫిట్‌నెస్ విషయంలోనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 39 ఏళ్ల హిట్‌మ్యాన్ గత ఐపీఎల్ సీజన్‌లో గాయం కారణంగా వరుసగా నాలుగు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఇక, బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌లు, ఒత్తిడి లేని మ్యాచుల్లోనే అతడు అదరగొడుతున్నాడనే అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌తో టీమ్ఇండియా సిరీస్ కోల్పోయిన తర్వాతే.. ఆ రెండు జట్లపై రోహిత్ సెంచరీలు చేయడం గమనార్హం. ఈ పరిణామాల



సందేహాలు ఉండటమే ఇందుకు కారణంగా కన్పిస్తోంది. వచ్చే ప్రపంచకప్ టోర్నీకి రోహిత్ స్థానంలో యశస్వి జైస్వాల్‌ను తీసుకోవాలని అగార్కర్ కమిటీ భావించింది. అయితే, బీసీసీఐ ఇందుకు విముఖత వ్యక్తం చేసింది. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేసింది. మరోవైపు, రిటైర్మెంట్ ప్రచారం వేళ.. లార్డ్స్‌లో 138 పరుగుల ప్రదర్శన చేసి రోహిత్ సెలక్టర్లకు సవాల్ విసిరాడు. దీంతో నేపథ్యంలో వరల్డ్ కప్ టోర్నీకి తాను అందుబాటులో, ఫిట్‌గా ఉండగలనని నిరూపించుకోవాల్సిన బాధ్యత రోహిత్‌పైనే ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ, ప్రపంచ కప్ ముందు రోహిత్ ఫిట్‌నెస్ దెబ్బతింటే.. అప్పటికప్పుడు జైస్వాల్‌ను సిద్ధం చేయడం కష్టమవుతుందనే వాదనలూ ఉన్నాయి. అందుకే, ఇప్పటి నుంచే జైస్వాల్‌ను వన్డేల్లో ఆడించాలని క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు.

# షమీ రాజకీయాల్లోకి వస్తున్నాడా..? ఆ పార్టీ చీఫ్‌తో భేటీ



టీమ్ఇండియా సీనియర్ పేసర్ మహమ్మద్ షమీని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకుంటారా? లేదా అనేదానిపై చర్చ కొనసాగుతూనే ఉంది. ఈ సమయంలో నెట్టింట ఓ వార్త చక్కర్లు కొడు తోంది. షమీ రాజకీయాల్లో రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆర్ఎల్‌డీ పార్టీ చీఫ్‌తో క్రికెటర్ భేటీ కావడమే ఇందుక్కారణం. రాష్ట్రీయ లోక్‌దళ్ (RLD) పార్టీ అధినేత జయంత్ చౌధరీతో షమీ ఆదివారం ఢిల్లీలో సమావేశమయ్యాడు. ఇందుకు సంబంధించిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వీరి భేటీపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ.. వచ్చే ఏడాది జరగబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో షమీ పోటీ చేసే అవకాశాలున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అమ్రోహా శాసనసభ నియోజకవర్గం నుంచి ఆర్ఎల్‌డీ టికెట్‌పై షమీ పోటీ చేయనున్నట్లు ప్రచారం మొదలైంది. షమీ అమ్రోహా జిల్లాలోనే జన్మించాడు. యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని యూపీ ప్రభుత్వంలో ఆర్ఎల్‌డీ పార్టీ మిత్రపక్షంగా ఉంది. ఇక, అమ్రోహా శాసనసభకు ప్రస్తుతం సమాజ్‌వాదీ పార్టీ నేత మహబూబ్ అలీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అలీ.. తన సమీప భాజపా ప్రత్యర్థిపై 71వేల ఓట్లతో విజయం సాధించి వరుసగా నాలుగో సారి ఈ స్థానంలో ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు ఇక్కడ షమీని నిలబెట్టి ఓటర్లను ఆకట్టుకోవాలని ఎన్డీయే వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. అయితే, రాజకీయ ప్రవేశంపై షమీ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇదిలా ఉండగా.. గతంలోనూ పలుమార్లు షమీ రాజకీయాల్లోకి రానున్నట్లు వార్తలు వచ్చాయి. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందు కూడా.. ఈ క్రికెటర్ బెంగాల్ నుంచి పోటీ చేస్తాడని ప్రచారం జరిగింది. దేశవాళీలో నిలకడగా ప్రదర్శన చేస్తున్నప్పటికీ షమీవైపు టీమ్ఇండియా సెలక్టర్లు మాత్రం దృష్టిసారించడం లేదు. 2025 ఛాంపియన్ ట్రోఫీ తర్వాత నుంచి అతడు జాతీయ జట్టుకు దూరమయ్యాడు.

# ఆసియా క్రీడల్లో భారత్ జోరు..




జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల్లో భారత్ మూడో పతకాన్ని సొంతం చేసుకుంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో రజతం దక్కింది. ఫైనల్లో రుద్రాంక్ష్ పాటిల్, పార్థ్ మానే, హిమాన్షు ధిల్లాన్ త్రయం (1890.1 పాయింట్లు) త్రుటిలో స్వర్ణాన్ని చేజార్చుకుంది. చైనా 1899 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు రుద్రాంక్ష్, హిమాన్షు వ్యక్తిగత ఈవెంట్‌లో ఫైనల్‌కు అర్హత సాధించారు. ఫైనల్‌లో హిమాన్షుకు రజతం, రుద్రాంక్ష్‌ను కాంస్యం దక్కింది. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (MMA) మహిళల-60 కేజీల విభాగంలో భారత క్రీడాకారిణి సుచిక తరియల్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. సెమీఫైనల్లో సుచికను సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. మరోవైపు.. భారత మహిళల టేబుల్ టెన్నిస్ బృందం క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. పాకిస్థాన్ జట్టును ఓడించి.. గ్రూప్-ఎఫ్‌లో అగ్రస్థానంలో నిలిచింది.

## షెఫాలి మెరుపు శతకం.. పసిడి పోరుకు భారత అమ్మాయిలు

షెఫాలి క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత స్వర్ణాన్ని నిలబెట్టుకోవడానికి అడుగు దూరంలో నిలిచింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో హర్మన్‌ప్రీత్ బృందం 114 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. మొదట ఓపెనర్ షెఫాలి వర్మ (100 నాటౌట్; 49 బంతుల్లో 3×4, 9×6) మెరుపు సెంచరీ సాధించడంతో భారత్ 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. స్మృతి మంధాన (37; 19 బంతుల్లో 5×4, 2×6), హర్మన్‌ప్రీత్ కౌర్ (40; 33 బంతుల్లో 6×4) రాణించారు. ఛేదనలో బంగ్లా 15.4 ఓవర్లలో 81 పరుగులకే ఆలౌటైంది. దిలారా అక్తర్ (27) టాప్ స్కోరర్. దీప్తి శర్మ (3/7), నందని శర్మ (3/25), శ్రీచరణి (2/7) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు. భారత ఇన్నింగ్స్‌లో షెఫాలి ఆటే హైలైట్. రెండో ఓవర్లో సంజిద బౌలింగ్‌లో సిక్సర్‌తో మొదలైన షెఫాలి జోరు.. ఆ తర్వాత అంతకంతకు పెరుగుతూపోయింది. మెరుపు షాట్లతో స్కోరు పెంచిన షెఫాలి.. 24 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. నహిదా



వేసిన 17వ ఓవర్లలో వరుసగా రెండు సిక్సర్లతో 90ల్లోకి వచ్చిన షెఫాలి.. ఇన్నింగ్స్ ఆఖరి బంతికి సెంచరీ (49 బంతుల్లో) అందుకుంది. వైట్‌బాల్ ఫార్మాట్లలో షెఫాలికి ఇదే తొలి శతకం. షెఫాలితో పాటు హర్మన్‌ప్రీత్, స్మృతి రాణించడంతో భారత్ 200కు చేరువగా స్కోరు చేసింది. మధ్యలో వికెట్లు పడకుండా ఉంటే భారత్ 200పైన స్కోరు సాధించేది. ఛేదనలో భారత బౌలర్ల ధాటికి బంగ్లా ఏమాత్రం నిలవలేకపోయింది.


# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి చరిత్ర సృష్టించిన 'రాకా'



**వుదయం సినిమా:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా సెన్సేషనల్ డైరెక్టర్ వి. అరుణ్‌కుమార్ (అట్లీ) దర్శకత్వంలో సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తోన్న భారీ చిత్రం 'రాకా'. ఈ సినిమా 'ఒకేసారి రియల్ టైమ్‌లో ఎక్కువ మంది వ్యక్తులకు సంబంధించిన హావభావాలను క్యాప్చర్ చేయడం' అనే సినీ సాంకేతికతలో అరుదైన ఘనతను సాధించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు దక్కించుకుని చరిత్ర సృష్టించింది. ఈ రికార్డును ఏక కాలంలో 37 మంది కళాకారుల మోషన్‌ను రియల్ టైమ్‌లో క్యాప్చర్ చేయడం ద్వారా 'రాకా' సాధించటం విశేషం. భారతీయ సినీ పరిశ్రమలో సాంకేతికత పరంగా ఇదొక మైల్ స్టోన్.2026 ఫిబ్రవరిలో సాధించిన ఈ ఘనతకుగానూ 'రాకా' చిత్రానికి సెప్టెంబర్ 15, 2026న అధికారిక గుర్తింపు లభించింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సీనియర్ అడ్జుడికేటర్ స్వప్నిల్ డాంగ్రికర్ దీనికి సంబంధించిన అధికారిక సర్టిఫికేట్‌ను ఐకాన్ స్టార్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు వి.అరుణ్‌కుమార్‌కు అధికారిక సర్టిఫికెట్‌ను అందజేశారు. చిత్రానికి చెందిన ముఖ్య తారాగణం, సాంకేతిక బృందం సభ్యుల సమక్షంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరు ఈ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

# వుదయం సినిమా

## 'ఇరుముడి' రూ.250 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ..



**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ, సెన్సిబుల్ డైరెక్టర్ శివ నిర్వాణ, ప్రముఖ పాన్–ఇండియా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇరుముడి' బాక్సాఫీస్ దగ్గర జనరేషనల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ఫలితాలను అందుకోవడంతో పాటు.. ఇప్పటివరకు చూడని స్థాయిలో లాభాలను అందించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.250 కోట్లకు పైగా గ్రాస్ సాధించి.. రవితేజ కెరీర్‌లో తొలిసారి ఎలైట్ రూ.250 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన చిత్రంగా నిలిచింది. అలాగే రీజినల్ సినిమాల్లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు ఈ బ్లాక్‌బస్టర్ ప్రపంచంలోని ప్రముఖ OTT ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లోనూ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ ప్రారంభమైనప్పటి నుంచి నంబర్ 1 స్థానంలో ట్రెండ్ అవుతోంది. OTTలోనూ 'ఇరుముడి' ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. ముఖ్యంగా తండ్రీకూతుళ్ల అనుబంధాన్ని బలమైన ఎమోషనల్ కోర్‌గా తీసుకున్న కథ దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు కనెక్ట్ అవు తోంది.


# 'జనవరి 12 విడుదల' నుంచి దీపుగా కృతి శెట్టి ట్రెడిషనల్ ఫస్ట్ లుక్



**వుదయం సినిమా:** విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ ఫెస్టివ్ ఎంటర్‌టైనర్ 'జనవరి 12 విడుదల' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి ఆర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్‌డేట్ ఆసక్తిని పెంచుతోంది. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే ఇంట్రెస్టింగ్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్ర టైటిల్‌ను మేకర్స్ ఇటీవల హిలేరియస్, ఎంటర్‌టైనింగ్ వీడియో ద్వారా ప్రకటించారు. దీంతో సినిమాపై బజ్ మరింత పెరిగింది.ఇప్పటికే వెంకటేష్, కళ్యాణ్ రామ్ ఫస్ట్ లుక్స్‌ను పరిచయం చేసిన మేకర్స్.. తాజాగా హీరోయిన్ కృతి శెట్టి పుట్టినరోజు సందర్భంగా ఆమెను 'దీపు' గా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో కృతి శెట్టి ట్రెడిషనల్ అవతార్‌లో ఆకట్టుకున్నారు. పర్పుల్–పింక్ కలర్ హాఫ్ సారీలో అందంగా కనిపించారు. ఆమె ఆహ్లాదకరమైన చిరునవ్వు ఈ ఫస్ట్ లుక్‌కు మరింత చార్మ్, ఎలిగెన్స్‌ను తీసుకొచ్చింది.ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాష్, ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌కు తోడు కీర్తి సురేష్, కృతి శెట్టి లాంటి స్టార్స్ ఉండటంతో ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తుండటంతో ఈ చిత్రం ఫెస్టివల్ సీజన్‌లో ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉండబోతోంది.

# అక్టోబర్ 30న 'ఏమో ఏమో ఇది' రిలీజ్

**వుదయం సినిమా:** యువతను ఆకట్టుకునే ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రంగా రూపొందుతున్న 'ఏమో ఏమో ఇది' విడుదల తేదీ ఖరారైంది. రోషన్ మేక, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని 2026 అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ శీతాకాలంలో ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రేమానుభూతిని అందించేందుకు సినిమా సిద్ధమవుతోంది.'HIT' ఫ్రాంచైజీతో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్న రచయిత, దర్శకుడు శైలేష్ కొలను తొలిసారి ఓ ఆహ్లాదకరమైన ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తనదైన థ్రిల్లర్ కథాంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన, 'ఏమో ఏమో ఇది'తో పూర్తిగా భిన్నమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నారు. రోషన్ మేక, ప్రీతి ముకుందన్‌ల ఫ్రెష్ పెయిర్ ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది.ఇప్పటికే విడుదలైన 'ది ఫస్ట్ బ్రీజ్ ఆఫ్ ' ఏమో ఏమో ఇది' వీడియోకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ వీడియో సినిమాపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేయడంతో పాటు, చిత్రంలోని ప్రేమకథ ఎలా ఉండబోతోందనే ఆసక్తిని పెంచింది.సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ ఎస్., సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, వంశీ పచ్చిపులుసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.విడుదల తేదీ ఖరారు కావడంతో చిత్ర బృందం తదుపరి ప్రచార కార్యక్రమాలకు సిద్ధమవుతోంది. త్వరలోనే సినిమాలోని పాటలతో పాటు ఇతర ఆసక్తికరమైన అప్‌డేట్స్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



# "పిఠాపురంలో అలా మొదలైంది" చిత్ర సక్సెస్ మీట్



**వుదయం సినిమా:** డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకులు 'ప్రేయసి రావే' ఫేమ్ మహేష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పిఠాపురంలో... అలా మొదలైంది'. ఈ సినిమాని మహేష్ చంద్ర సినిమా టీమ్, ఎవర్ గ్రీన్ ఎపిక్ సినిమా సంయుక్త నిర్మాణంలో దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదారి కిట్టయ్య) నిర్మించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18న విడుదల చేయగా ఈ చిత్రానికి వచ్చిన అనూహ్యస్పందన పై చిత్ర బృందం తమ సక్సెస్ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పృథ్వి రాజ్ మాట్లాడుతూ... "తల్లి దండ్రులు పిల్లల క్షేమం కోసం చెప్పే విషయాలు వినకపోతే పిల్లల జీవితాలు ఎలా తారుమారవుతాయో చెబుతూ వచ్చిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులంతా ఆదరించడం చాలా సంతోషంగా ఉంది. నేను మొదటిసారి నటించిన సినిమాలో హీరో రాజేంద్రప్రసాద్ గారు. పైన చిన్న నిర్మాతల పాలిట దేవుడు. సమాజంలో సాధారణంగా చూస్తుంది కొన్ని యదార్థ సంఘటనలను ఈ సినిమా ప్రతిబింబిస్తుంది. ఎవరైనా ఒక ఆర్టిస్ట్ బాగా నటిస్తే వారి ప్రతిభను గుర్తించే గొప్ప వ్యక్తులు అంతా ఈ సినిమాలో ఉన్నారు. తెలుగు అమ్మాయిలు హీరోయిన్ గా నటించిన సినిమా ఇది. పవన్ కళ్యాణ్ గారి నియోజకవర్గం పేరిట వచ్చిన ఈ సినిమా ఆయనకు తగ్గట్లు ఎక్కడ తగ్గకుండా ఉంటుంది. ఆయన సినిమాను గుర్తిస్తారని అనుకుంటున్నాను.

# కన్నడ స్టార్ విజయ్ రాఘవేంద్ర హీరోగా దర్శకుడు సంజీవ్ మేగోటి మూవీ 'ఆన్ డ్యూటీ'

**వుదయం సినిమా:** క్రైమ్, యాక్షన్, థ్రిల్‌తో కూడిన విభిన్న కథలను తెరపై ఆవిష్కరించడంలో తనదైన ముద్ర వేసుకున్న క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. తెలుగులో వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన 'పోలీస్ కంప్లైంట్' మూవీతో హిట్ కొట్టిన ఆయన.. ఇప్పుడు కన్నడలో తన అప్‌కమింగ్ మూవీ రూపొందించబోతున్నారు. 'ఆన్ డ్యూటీ' టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ మూవీ కన్నడ కంఠీరవ డాక్టర్ రాజ్‌కుమార్ కుటుంబానికి చెందిన ప్రముఖ హీరో విజయ్ రాఘవేంద్ర కథానాయకుడిగా నటించనున్నాడు.ఇప్పటికే క్రైమ్, సస్పెన్స్, యాక్షన్ జానర్‌లో పలు విభిన్న చిత్రాల్లో నటించిన విజయ్ రాఘవేంద్ర.. సంజీవ్ మేగోటి చెప్పిన ఈ సరికొత్త కథకు ఓకే చెప్పడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. విజయ్ రాఘవేంద్ర ఫిల్మోగ్రఫీలో కూడా క్రైమ్, థ్రిల్లర్, యాక్షన్ కథలు కనిపిస్తాయి. విజయ్ రాఘవేంద్ర ఇటీవల నటించిన 'సెకండ్ కేస్ ఆఫ్ సీతారాం' మూవీ ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతూ సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది.



# "సర్కారు బాయి" నుంచి బర్త్ డే పోస్టర్

శ్రీరామ్ నిమ్మల, వర్షిక హీరో హీరోయన్స్ గా నటిస్తున్న సినిమా "సర్కారు బాయి". ఈ చిత్రాన్ని డెక్కన్ ఫిలింస్ సమర్పణలో ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు లారా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అప్పటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబిస్తూ నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటం వంటి అంశాలను దర్శకుడు లారా కళ్లకు కట్టినట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది.ఈ రోజు బ్యూటిఫుల్, టాలెంటెడ్ హీరోయిన్ వర్షిక పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ మూవీ టీమ్ బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. "సర్కారు బాయి" సినిమాలో వర్షిక కల్పన టీచర్ పాత్రలో నటిస్తోంది. ఈ బర్త్ డే పోస్టర్ లో చీరకట్టులో ట్రెడిషనల్ లుక్ లో వర్షిక కనిపించి ఆకట్టుకుంటోంది. ఈ సినిమాతో వర్షిక హీరోయిన్ గా మంచి పేరు తెచ్చుకుంటుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి.ప్రస్తుతం "సర్కారు బాయి" సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఇటీవలే చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి, పరిసర ప్రాంతాల్లో భారీ షెడ్యూల్ కంప్లీట్ చేశారు. మరోవైపు ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. హీరో శ్రీరామ్ నిమ్మల, హీరోయిన్ వర్షిక, బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్ లాంటి ప్రధాన నటీనటులు పాల్గొన్న ఈ లెంగ్తీ షెడ్యూల్ లో చాలా వరకు సినిమా చిత్రీకరించారు. త్వరలోనే "సర్కారు బాయి" సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి ఈ చిత్రాన్ని మంచి ప్రొడక్షన్



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.